



# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక





ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 147 ఆదివారం 18 జనవరి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 22 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్



ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా, నికర హరిత ఇంధన ఎగుమతి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా మరో చరిత్రాత్మక ముందడుగు పడిందని ఆయన ప్రకటించారు. కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ ఏర్పాటు చేస్తున్న 1.5 మిలియన్ టన్నుల సామర్థ్యం గల గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు పరికరాల ఏర్పాటు కార్యక్రమం శనివారం ప్రారంభమైందని తెలిపారు. ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నామని ముఖ్యమంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు.

## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా
# ఆంధ్రప్రదేశ్

## గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రత్యేక ప్రోత్సాహం

- గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన
- 2027 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తుందన్న చంద్రబాబు
- గ్రీన్ అమ్మోనియా ఓ మైలు రాయి అన్న పవన్ కళ్యాణ్

**కాకినాడ :** గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కాకినాడలో రూ.18వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 'గ్రీన్ అమ్మోనియా.. భవిష్యత్తులో పెను మార్పునకు నాంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి బాగా పెంచాలని ప్రధాని మోదీ కోరుతున్నారు. 2014లోనే మా ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి నాంది పలికింది. ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్

మిగతా 2 లో




## పెట్టుబడులే లక్ష్యంగా దావోస్‌కు సీఎం

నేడు బయలుదేరనున్న ప్రత్యేక బృందం

## బీహార్ తర్వాత ఇప్పుడు
# బెంగాల్ వంతు




- బెంగాల్ అభివృద్ధికి మమత ప్రధాన అడ్డంకి
- తృణమూల్‌ను సాగనంపే సమయం వచ్చింది
- చొరబాటుదారులకు తృణమూల్ అండ
- అవినీతి కారణంగా ప్రజలకు చేరని పథకాలు
- మాల్దా సభలో ప్రధాని మోడీ



## పట్టాలకెక్కిన తొలి వందేభారత్ స్లీపర్

మాల్దాలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని

## బస్టాండ్‌లలో ఆటోమెటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్

### ఎపిఎస్ ఆర్టీసికి ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు

ఆర్టీసి అధికారులు, సిబ్బంది కృషిని అభినందించిన మంత్రి




**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు మరో జాతీయ అవార్డు దక్కింది. రాష్ట్రవ్యాప్తంగా బస్టాప్‌లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ విజయవంతంగా అమలు చేసినందుకు గానూ ఏపీఎస్ఆర్టీకి ప్రతిష్టాత్మకమైన గవర్నెన్స్ నౌ 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డ్ వరించింది. ఈ అవార్డు ద్వారా ప్రయాణికుల సౌకర్యార్థం డిజిటల్ సాంకేతికతను సమ-ర్థవంతంగా వినియోగించిన ఏపీఎస్ఆర్టీసీ కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు

మిగతా 2 లో



గణతంత్ర దినోత్సవ వేళ

## రాష్ట్రాలకు హైఅలర్ట్

- ఉగ్రవాదుల నేపథ్యంలో కేంద్రం అప్రమత్తం

3

## ఇరాన్‌లో అస్థిర పరిస్థితులు

- భారత్ హెచ్చరికతో స్వదేశానికి పౌరులు
- రెండు విమానాల్లో పలువురి రాక

3



## జగన్ చర్యలతో అమరావతికి
# ఐదేళ్ల కష్టం

### భూములిచ్చిన రైతులను నానా యాతన పెట్టారు




### మూడు రాజధానుల పేరుతో డ్రామాలు
### మండిపడ్డ మంత్రి కొలుసు పార్థసారథి

**అమరావతి :** మూడు రాజధానుల పేరుతో జగన్ రెడ్డి ఐదేళ్లు కాలయాపన చేసి, ఒక్క రాజధానినైనా నిర్మించకుండా రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టారని మంత్రి కొలుసు పార్థసారథి ఘాటు విమర్శలు చేశారు. ఇది తుగ్లక్ పాలనకు సమానమని మంత్రి విమర్శించారు. ఈ మేరకు రాజధాని అమరావతి అభివృద్ధిపై మంత్రి కొలుసు పార్థసారథి కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014లో అసెంబ్లీలో అమరావతికి మద్దతిచ్చిన జగన్ రెడ్డి.. 2019 ఎన్నికల ముందు అక్కడే ఇల్లు కట్టుకున్నానని ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక దానిని నాశనం చేయడం ఘోరమైన నమ్మకద్రోహమని

మిగతా 2 లో

## గ్రామస్థాయిలో ఉద్యోగుల అటెండెన్స్

### పేస్ రికగ్నేషన్‌కు ప్రభుత్వం నిర్ణయం



**అమరావతి :** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పని తీరును మరింత పర్యవేక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల అటెండెన్స్ కోసం ఫేస్ రికగ్నిషన్ ఆధారిత మొబైల్ యాప్‌ను తప్పనిసరి చేయాలని నిర్ణయించింది. ఇకపై ఈ యాప్ ద్వారా హాజరు నమోదు

మిగతా 2 లో

## ఏప్రిల్ కోటా సేవల విడుదలకు
# రంగం సిద్ధం

### 19న విడుదల చేయనున్న తితిదే




**తిరుమల :** భక్తుల సౌకర్యార్థం 2026 ఏప్రిల్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన టికెట్లను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఎలక్ట్రానిక్ లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 21న ఉదయం 10 గంటల

మిగతా 2 లో

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్

మొదటి పేజీ తరువాయి

అమ్మోనియాకు నాంది పలికాం అని అన్నారు. కాకినాడలో ఏర్పాటయ్యేది ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ. 2027 జూన్ నాటికి మొదటి దశ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ మన రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కానుందని చంద్రబాబు అనినారు. బొగ్గు వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోంది. కాలుష్యం వల్ల సముద్రంలోనూ పెను మార్పులు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు వెయ్యి కి.మీ సముద్ర తీరం ఉంది. 20 పోర్టులు ఏర్పాటు కానున్నాయి. ప్రపంచంలో ఎండ పుష్కలంగా ఉండేది మనదేశంలోనే. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ .. మన రాష్ట్రానికి వరం అని అన్నారు. మన సంస్కృతిని కాపాడుకుంటూనే టెక్నాలజీని వాడుకోవాలి. ఎంత ఎత్తుకు ఎదిగినా స్వగ్రామాన్ని మర్చిపోకూడదు. ఆలోచనలు ఆచరణలో పెట్టేవారు చాలా కొద్ది మందే ఉంటారు. వారిలో చలమలశెట్టి అనిల్ ఒకరు. చరిత్రను తిరగరాయడంలో తెలుగువాడు ముందున్నందుకు గర్వంగా ఉంది. ఆనాడు ఎన్టీఆర్ చొరవతో కాకినాడకు నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ వచ్చింది. కాకినాడ గురించి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా చర్చించుకుంటారు. ఇలాంటి పరిశ్రమలకు అనుకూలమైన పరిస్థితులన్నీ ఇక్కడ ఉన్నాయి. ప్రజలకు మేలు జరిగే ఆలోచనలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేస్తోంది. 2047 నాటికి మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తయారవుతుందని అన్నారు. గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రకృతి సేద్యం పెరగడమే అందరి ఆరోగ్యాలకు శ్రీరామ రక్ష. ఎరువులు,



పురుగుమందుల వినియోగం బాగా తగ్గించాలి. గ్రీన్ అమ్మోనియాను ఏ దేశానికైనా ఎగుమతి చేసే అవకాశం ఉందని సీఎం అన్నారు. బలమైన సంకల్పం ఉంటేనే ఏదైనా సాధించగలమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తాను పుట్టి పెరిగిన కాకినాడకి అనిల్ ఎంతో చేస్తున్నారని అభినందించారు. అనేక కష్టాలను తట్టుకుని ఏఎమ్ గ్రీన్ కంపెనీ పెట్టారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ముందుకెళ్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ దిశగా మనం వేసే అడుగులు చాలా కీలకం. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం అన వివరించారు. కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో ఇదో మైలురాయి. రాష్ట్ర సుస్థిరాభివృద్ధిలో ఇది గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ప్రాజెక్టు వల్ల వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతారని అన్నారు. గత ప్రభుత్వంలో పారిశ్రామిక వేత్తల ఇబ్బందులు తెలుసు. పార్టీలు మారవచ్చు.. కానీ, ప్రభుత్వ వ్యవస్థ శాశ్వతం అని పవన్ అన్నారు.

## పెట్టుబడులే లక్ష్యంగా దావోస్‌కు సీఎం చంద్రబాబు

**నేడు బయలుదేరనున్న ప్రత్యేక బృందం**

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌కి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా.. ఇప్పటికే పలు మార్లు విదేశీ పర్యటనలకు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఆదివారం దావోస్ పర్యటనకు బయల్దే-రనున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పర్యటనలో ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో తొలి రెండు రోజుల పాటు సీఎం చంద్రబాబు 20కు పైగా దేశాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో భేటీ అయి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలపై చర్చించనున్నారు. ఇక, 4 రోజుల పర్యటనలో మొత్తం 36 కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. ఐబీఎం , గూగుల్ క్లౌడ్, ఏపీ మోలర్ మెర్స్క్ వంటి ప్రముఖ సంస్థల సీఈవోలతో సీఎం చంద్రబాబు ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే స్విట్జర్లాండ్, యూఏఈతో పాటు పలు దేశాల ప్రభుత్వ ప్రతినిధులతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో ఐటీ, పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం చంద్రబాబు అంతర్జాతీయ వేదికపై వివరించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ఈ పర్యటన జరగనుందని అధికారులు తెలిపారు. దావోస్ పర్యటన పూర్తయ్యాక ఈ నెల 23న సీఎం చంద్రబాబు అమరావతికి తిరిగి రానున్నారని వెల్లడించారు.

## బస్టాండ్‌లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్

మొదటి పేజీ తరువాయి

లభించింది. అవార్డుపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందిస్తూ.. ఏపీఎస్‌ఆర్టీసీకి ప్రతిష్టాత్మక గవర్నెన్స్ నౌ – 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డు రావడం గర్వకారణమని అన్నారు. ఈ విజయం ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది అందరూ ప్రజలకు అంకితభావంతో అందిస్తున్న సేవలకు నిదర్శనమని అభివర్ణించారు. ప్రధాన బస్టాప్‌లలో అమలు చేసిన ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ద్వారా ప్రయా-ణికులకు రియల్– టైమ్, స్పష్టమైన సమాచారం అందుతోందని తెలిపారు. ముందస్తు సమాచారం అందించడం వల్ల సేవల నాణ్యత గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుతో పాటు సిబ్బందిని మంత్రి అభినందించారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని ఆర్టీసీ ముందడుగులు వేస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రయాణికులకు మరింత ఆధునిక, సౌకర్యవంతమైన సేవలు అందిస్తామన్నారు. ప్రజా రవాణా రంగంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పండుగల సమయంలో సాధారణ ఛార్జీలు కొనసాగిస్తూ ఏపీఎస్‌ఆర్టీసీని దేశానికి ఆదర్శంగా నిలబెడతామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రయాణికులకు మరింత ఆధునిక, సౌకర్యవంతమైన సేవలు అందిస్తామన్నారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఢిల్లీలో అవార్డు అందుకున్నారు.

## గ్రామస్థాయిలో ఉద్యోగుల అటెండెన్స్

మొదటి పేజీ తరువాయి

చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యాలయ సమయాలను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆలస్యం, గైర్హాజరు లాంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకునే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. ఇక, ప్రస్తుతం రీ–సర్వే కార్యక్రమాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మాత్రం ఈ అటెండెన్స్ యాప్ నుంచి తాత్కాలిక మినహాయింపు ఇవ్వనున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఫీల్డ్‌లో పని చేస్తున్న వారి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. కాగా, ఇటీవల కొంతమంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఆఫీసుల్లో అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులు అధికారుల దృష్టికి వచ్చాయి. ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదని, కార్యాలయాల్లో ఉద్యోగులు కనిపించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి అని సర్కార్ సీరియస్‌గా తీసుకుంది. కాగా, ప్రజలకు నేరుగా సేవలు అందించే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉద్యోగుల పని తీరును మెరుగుపరచడం, జవాబుదారీతనం పెంచడం లక్ష్యంగా ఈ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ యాప్‌ను తీసుకొస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక, ఈ కొత్త విధానం అమలుతో గ్రామ, వార్డు సచివాలయాల్లో సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందనున్నాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## కర్నాటక మాజీమంత్రి ఖండ్రే మృతి

**సంతాపం తెలియ చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**అమరావతి :** కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులు డాక్టర్ భీమన్న ఖండ్రే మృతి పట్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంతాపం తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. 'కర్ణాటక రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి, మిత్రులు ఈశ్వర్ ఖండ్రే తండ్రి, ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులు డా.భీమన్న ఖండ్రే మృతికి చింతిస్తున్నాను. వృద్ధాప్య సంబంధిత వ్యాధుల కారణంగా ఆయన తుదిశ్వాస విడిచారని తెలిసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. స్వాతంత్య్ర సమరంలో, హైదరాబాద్ కర్ణాటక విముక్తి, కర్ణాటక సమైక్యత ఉద్యమాల్లో డా.భీమన్న ఖండ్రే కీలక పాత్ర పోషించారు. ఈశ్వర్ ఖండ్రేకు, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ ట్వీట్ చేశారు. కాగా.. కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్య సమరయోధుడు భీమన్న ఖండ్రే(102) కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత వ్యాధుల కారణంగా గత అర్ధరాత్రి బీదర్ జిల్లా భాల్కి పట్టణంలోని తన నివాసంలో ఖండ్రే తుది శ్వాస విడిచారు. గత కొద్దిరోజులుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడటంతో పాటు రక్తపోటు సమస్యలతో ఆయన కొన్ని రోజులుగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా.. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రవాణా మంత్రిగా ఖండ్రే పనిచేశారు.

## నంద్యాలలో దారుణ ఘటన

**పిల్లలకు విషమిచ్చి తల్లి ఉరేసుకుని ఆత్మహత్య**

**నంద్యాల :** నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎన్ జి ఓ కాలనీ లలిత నగర్ లో శనివారం దారుణం జరిగింది. తన పిల్లలకు విషాన్ని ఇచ్చి తల్లి ఉరేసుకొని మరణించింది. టూ టౌన్ సిఐ తెలిపిన వివరాల ప్రకారం సుధా మల్లికా (26), ఉదయ్ లకు ఐదు ఏళ్ల కిందట వివాహం అయింది. వీరు గత కొంత కాలంగా లలిత నగర్ లో నివాసముంటున్నారు. వీరికి 5 ఏళ్ల బాబు, 6 నెలల పాప ఉన్నారు. ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఉరేసుకొని మరణించింది. మల్లికా మృతికి కుటుంబ కలహాలే కారణంగా ప్రాథమిక విచారణలో తేలినట్లు సిఐ తెలిపారు. ఆమెది హత్యనా.. లేక ఆత్మహత్యనా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సిఐ చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని సమగ్ర విచారణ చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా ? తమ అమ్మాయిని అత్తా ఆడపడుచులు, భర్త కలిసి కొట్టి చంపారని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్ళు

**పలువురు వ్యాపారులకు క్లోజర్ నోటీసులు**

**కర్నూలు :** నగరపాలక సంస్థకు రావాల్సిన ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్లను నగరపాలక సిబ్బంది వేగవంతం చేశారు. బకాయిలు చెల్లించని వ్యాపారులపై సిబ్బంది కఠిన చర్యలు చేపడుతున్నారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించని దుకాణదారులపై నిబంధనల ప్రకారం చర్యలు కొనసాగుతున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ క్రమంలో శనివారం షరాఫ్ బజార్ పరిధిలో సుమారు రూ.15 లక్షల ట్రేడ్ లైసెన్స్ బకాయిలు చెల్లించని 196 దుకాణాలకు క్లోజర్ నోటీసులు జారీ చేశారు. అలాగే క్లోజర్ నోటీసులు జారీ చేసినప్పటికీ బకాయిలు చెల్లించకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్న మూడు షాపులను సీజ్ చేశారు. మున్సిపల్ నిబంధనలను అతిక్రమిస్తూ వ్యాపారాలు నిర్వహించడం చట్ట విరుద్ధమని, బకాయిలు చెల్లించని పక్షంలో మరింత కఠిన చర్యలు తప్పవని ప్రజారోగ్య సిబ్బంది హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిలు చెల్లించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని పేర్కొంటూ, వెంటనే బకాయిలు చెల్లించి సహకరించాలని నగరపాలక సిబ్బంది వ్యాపారులను కోరారు. నగర అభివఅద్ధి, పారిశుధ్య నిర్వహణతో పాటు ప్రజా సౌకర్యాల నిర్వహణకు ఈ వసూళ్లు ఎంతో కీలకమని వివరించారు. ఈ తనిఖీల్లో శానిటేషన్ ఇంస్పెక్టర్ రమేష్ బాబు, ఆర్.రాజు, మునిస్వామి, అనిల్ కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ చర్యలతో అమరావతికి ఐదేళ్ల కష్టం

మొదటి పేజీ తరువాయి




ఆరోపించారు. సీఎం చంద్రబాబు పిలుపునకు 29వేల మంది రైతులు ముందుకు వచ్చి 33వేల ఎకరాల భూమిని రాజధాని కోసం స్వచ్ఛందంగా ఇచ్చారని, ఇది ప్రపంచంలోనే అరుదైన సంఘటన అని మంత్రి అన్నారు. అమరావతిని ఎడారిగా, శ్మశానంతో పోల్చి, కమ్మరావతి – బ్రహ్మరావతి వంటి నీచమైన మాటలతో ప్రాంతీయ, కుల విద్వేషాలు రెచ్చగొట్టడంతో వైసీపీ రాజకీయాల స్థాయిని బయటపెట్టిందని పేర్కొన్నారు. న్యాయం కోసం శాంతియుతంగా ఉద్యమించిన రైతులు, మహిళలపై పోలీసులతో దౌర్జన్యం చేయించి ఉద్యమాన్ని అణచివేయాలని జగన్ ప్రభుత్వం ప్రయత్నించిందని మంత్రి ఆరోపణలు చేశా-రు. 2024 ఎన్నికల్లో ప్రజల కోపానికి గురైన వైసీపీకి అమరావతి పాపమే శాపమైందని.. కేవలం 11 సీట్లకే పరిమితమైందన్నారు. నదీ ఒడ్డున రాజధాని ఎందుకు అని ప్రశ్నించే జగన్‌కు.. లండన్, వాషింగ్టన్, కైరో వంటి ప్రపంచ నగరాలన్నీ నదీ తీరాల్లోనే అభివృద్ధి చెందిన విషయం తెలియకపోవడం ఆశ్చర్యకరమని మంత్రి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు.. సైబరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన చంద్రబాబు.. ఇప్పుడు అమరావతిని క్వాంటం వ్యాలీగా మార్చి రాష్ట్ర భవిష్యత్తుకు దారి చూపిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వరల్డ్ బ్యాంక్, ఏడీబీ, నాబార్డ్ నుంచి వేల కోట్ల నిధులు సమీకరించి అమరావతిలో పనులను వేగంగా ప్రారంభించిందని మంత్రి తెలిపారు. అమరావతిలో భూముల విలువ పెరగడం ద్వారా వచ్చే ఆదాయంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న స్పష్టమైన ఆర్థిక దృష్టితో ప్రభుత్వం ముందుకెళ్తోందని వివరించారు. 30 శాతం గ్రీన్ కవర్, 10 శాతం వాటర్ బాడీస్‌తో.. పర్యావరణానికి హానిలేకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మాణం జరుగుతోందని మంత్రి చెప్పారు. పీపీపీ విధానంలో పెట్టుబడులు పెడితే అరెస్ట్ చేస్తామని బెదిరించడం ద్వారా జగన్ పెట్టుబడిదారులను భయపెట్టి, గతంలో సోలార్ ఒప్పందాల రద్దుతో రాష్ట్రాని వేల కోట్ల నష్టం తెచ్చారని పార్థసారథి ఆరోపించారు. జగన్‌కు నిజంగా ప్రజలపై ప్రేమే ఉంటే.. రాజధానిపై ఉన్న సందేహాలను అసెంబ్లీకి వచ్చి చర్చించాలి తప్ప, బయట ఉండి విష ప్రచారం చేయడం సరైన రాజకీయ ధోరణి కాదన్నారు. 2027–28 నాటికి అంతర్జాతీయ స్థాయి అమరావతిని, అలాగే పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో ముందుకు నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

## ఆర్టీసీ బస్సులను వినియోగించుకోండి

**కొత్త బస్సులకు మంత్రి అచ్చన్న ప్రారంభం**

**శ్రీకాకుళం :** ప్రజలు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివఅద్ధి మత్స్యశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం టెక్కలిలో పోలీస్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులను పూజలు నిర్వహించిన అనంతరం జెండా ఊపి 7 బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ బస్సులు శ్రీకాకుళం–1, 2 టెక్కలి డిపోలకు చెందిన వివిధ రూట్లకు సర్వీసు అందిస్తాయన్నారు. టెక్కలి – శ్రీకాకుళం –అమలాపురం మార్గంలో ఒక కొత్త సూపర్ లగ్జరీ బస్సు, టెక్కలి – విశాఖపట్నం – ఇచ్ఛాపురం మార్గంలో ఒక కొత్త ఎక్స్ ప్రెస్, టెక్కలి, విశాఖపట్నం, ఇచ్ఛాపురం మార్గంలో ఒక కొత్త బస్సు, శ్రీకాకుళం, విజయవాడ మార్గంలో ఒక కొత్త సూపర్ లగ్జరీ బస్సు, శ్రీకాకుళం –విజయనగరం మార్గంలో ఒక ఎక్స్ ప్రెస్, శ్రీకాకుళం – బత్తిలి మార్గంలో ఒక అ÷–దదె ప్లలె వెలుగు, శ్రీకాకుళం ? విశాఖపట్టణం మార్గంలో ఒక అ÷–దదె అల్ట్రా డీలక్స్ బస్సులు ఆయా రూట్లలో ప్రజలకు సర్వీసులు అందిస్తాయన్నారు. ఇందులో మూడు బస్సులు అద్దెవని, నాలుగు బస్సులు ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు బస్సుల సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని సర్వీసులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం మాజీ శాసన సభ్యులు కలమట వెంకటరమణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బాగాది శేషగిరిరావు,పిసకాన అజరు కుమార్, కోల లవకుమార్, లాడి శ్రీనివాసరావు, హనుమంతు రామకఅష్ణ, కెల్లి శ్రీరాములు, ఆర్ఎం, శ్రీకాకుళం 1,2 టెక్కలి డిపోల మేనేజర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ కోటా సేవల విడుదలకు రంగం సిద్ధం

మొదటి పేజీ తరువాయి

వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ–టికెట్లు పొందిన వారు జనవరి 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి. 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా, సాలకట్ల తెప్పోత్సవాలు, సాలకట్ల వసంతోత్సవాల టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లై-న్‌లో విడుదల చేస్తారు. 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు.. మధ్యాహ్నం 3 గంటలకు తిర-ుమల, తిరుపతిలో అ÷–దదె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. మార్చి నెలకు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. భక్తులు వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు సూచించారు.

## నచ్చజెప్పేందుకు వెళ్లిన పాపానికి...దాడి

**కాకినాడ :** తొండంగి మండలం ఏ.కొత్తపల్లి తూర్పు వీధిలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయారు. గుండాట డబ్బుల పంపకాల్లో వైసీపీలో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. ఘర్షణ తీవ్రస్థాయి చేరడంతో వారికి నచ్చజెప్పేందుకు వెళ్లిన టీడీపీ నేతలపైనే వైసీపీ కార్యకర్తలు తిరిగి దాడి చేశారు. వీరిని ఒక వర్గంగా భావించి బీరు బాటిళ్లు, కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన కొంజర్ల గోవిందు, నామాల గోపికి గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గణతంత్ర దినోత్సవ వేళ రాష్ట్రాలకు హైఅలర్ట్

## ఉగ్రదాడుల నేపథ్యంలో కేంద్రం అప్రమత్తం



**న్యూఢిల్లీ :** గణతంత్ర దినోత్సవం-2026 సందర్భంగా అన్ని రాష్ట్రాలకు భద్రతా సంస్థలు హై అలర్ట్ ప్రకటించాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీని లక్ష్యంగా చేసుకుని ఉగ్రదాడి జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేసే ఉగ్ర గ్రూపులు ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, ముంబై, హైదరాబాద్ సహా పలు ప్రధాన నగరాల్లో దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) హెచ్చరించింది. ఆయా నగరాల్లోని రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఉగ్రమూకలు గగనతలం నుంచి డ్రోన్ల ద్వారా దాడులు జరిపే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని ముఖ్య ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ నిఘా పెంచారు అధికారులు. ఇప్పటికే సుమారు 50,000 మందికి పైగా పోలీసులు, 65 కంపెనీల పారామిలిటరీ దళాలు ఢిల్లీలో మోహరించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల భద్రతా బలగాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో పేర్కొంది.

# జేఈఈ మెయిన్ అడ్మిట్ కార్డుల విడుదల

**న్యూఢిల్లీ :** జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం విడుదల చేసింది. జనవరి 21, 22, 23, 24 తేదీల్లో జరగనున్న పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డుల్ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. దేశవ్యాప్తంగా జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్-1 పరీక్ష, 29న పేపర్ -2 పరీక్ష జరగనున్నాయి. ప్రస్తుతానికి తొలి నాలుగు రోజుల అడ్మిట్ కార్డులను విడుదల చేయగా.. 28, 29 తేదీల్లో జరిగే పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను తర్వాత విడుదల చేయనున్నారు. మొత్తం రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. తొలి షిఫ్టు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు; రెండో షిఫ్టు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు.

# గుజరాత్‌లో మారుతి సుజుకీ భారీ పెట్టుబడి

## రూ.35 వేల కోట్లతో కొత్త కార్ల తయారీ పరిశ్రమ

**గాంధీనగర్ :** ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ గుజరాత్‌లో మరో ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. ఖోరజ్ వద్ద రూ.35 వేల కోట్ల వ్యయంతో కొత్త కార్ల తయారీ పరిశ్రమను నెలకొల్పనుంది. ఏటా 10 లక్షల కార్ల తయారీ లక్ష్యంగా ఏర్పాటువుతున్న ఈ ప్లాంట్ ద్వారా 12 వేలమందికి నేరుగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇందుకోసం గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 1750 ఎకరాలను మారుతీ సుజుకీకి కేటాయించింది. గాంధీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఎండీ హితాచీ తకేయూచీ పెట్టుబడుల ధ్రువీకరణ పత్రాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు అందజేశారు. భారత ఆటోమొబైల్ హబ్స్‌లో గుజరాత్ ఒకటిగా నిలిచిందని, ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని సీఎం 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్-జపాన్ భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ, మారుతీ సుజుకీ ప్రతినిధులు పాల్గొన్నారు. 1983లో మారుతీ సుజుకీ దేశీయంగా తన కార్యకలాపాలను ప్రారంభించింది. హరియాణాలోని గురుగ్రామ్‌లో తొలి ఎ÷-లాంట్‌ను నెలకొల్పింది. తర్వాత తన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటూ వచ్చింది. గుజరాత్‌లో ఇది వరకే ఒక ఎ÷-లాంట్ నెలకొల్పిన ఆ కంపెనీ.. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కార్ల తయారీని చేపట్టేందుకు కొత్త ఎ÷-లాంట్ ఏర్పాటుకు పూనుకుంది. ఏటా 40 లక్షల కార్ల తయారీని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 17 మోడళ్లను 650 రకాల వేరియంట్లను మారుతీ దేశ, విదేశీ మార్కెట్లలో విక్రయిస్తోంది. 2025లో 22.55 లక్షల కార్లను మారుతీ ఉత్పత్తి చేసింది.

# యూపిలో అనూహ్య ఘటన

## పట్టుకున్న పాముతో వ్యక్తి సయ్యాటలు

## కసితీరా కాటేయడంతో యమలోకానికి పయనం

**లక్నో :** పాముతో చెలగాం ఆడిన ఓ వ్యక్తి ఏకంగా ప్రాణ్యాలు కోల్పోయాడు. ఉత్తరప్రదేశ్‌లో ఈ ఘటన జరిగింది. ఓ వ్యక్తి నాగు పామును చేతుల్లోకి తీసుకుని అతి చేశాడు. దాన్ని అటూ ఇటూ తిప్పుతూ జనం ముందు ఫోజులు కొట్టాడు. విష సర్పంతో ఆటలు.. ఏకంగా అతడి ప్రాణాలు తీసేశాయి. మూడుసార్లు అతణ్ని నాగుపాము కాటేయడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే చనిపోయాడు. ఈ సంఘటన ఉత్తర్ ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. రామ్‌పూర్‌కు చెందిన 50 ఏళ్ల రాజ్ సింగ్‌కు పొలాల దగ్గర ఓ నాగుపాము కనిపించింది. సుమారు ఆరు అడుగులు ఉన్న ఆ పామును అతడు ఏ మాత్రం భయపడకుండా పట్టుకున్నాడు. అలా పట్టుకుని.. దానితో ఆటలు ఆడటం మొదలెట్టాడు. అటూ ఇటూ తిప్పుతూ సయ్యాట ఆడాడు. తర్వాత రోడ్డు మీదకు వచ్చి మరింత దానితో గేమ్స్ ఆడాడు. పామును మెడలో వేసుకుని ఫోజులు కొడుతూ తిరిగాడు. పామును పట్టుకుని తిరుగుతున్న అతడ్ని చూసి జనం భయపడిపోయారు. అతడు దగ్గరకు వస్తుంటే దూరంగా పరుగులు తీశారు. కొంతమంది అతడికి హితవు పలికారు. పామును వదిలిపెట్టమని, లేదంటే చచ్చిపోతావని హెచ్చరించారు. అయినా కూడా రాజ్ సింగ్ వారి మాటలు పట్టించుకోలేదు. పామును చాలా ఇబ్బందిపెట్టేలా ప్రవర్తించాడు. సహనం నశించిన పాము మూడుసార్లు అతడ్ని కరిచింది. పాము కాట్ల కారణంగా అతడి పరిస్థితి విషమించింది. కొద్దిసేపటికే ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. రాజ్ సింగ్‌ను పరీక్షించిన వైద్యులు.. అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. ప్రస్తుతం రాజ్ సింగ్ పాముతో అతి చేసిన దృశ్యాల తాలూకా వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ప్రైవేట్ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

**కర్నూలు :** ప్రైవేట్ బస్సుకు తృటిలో పెనుప్రమాదం తప్పిన ఘటన శనివారం కర్నూలు జిల్లా మంత్రాలయంలో జరిగింది. మంత్రాలయం నుండి బెంగళూరుకు వెళుతున్న కర్నాటక ప్రైవేట్ ట్రావెల్ బస్సులో పత్తికొండ పట్టణ సమీపంలోని ఉరుకుంద ఈరన్న స్వామి టెంపుల్ దగ్గర స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. స్థానిక వివరాల మేరకు బస్సు కెఎ 25 డి 4503 బస్సు డ్రైవర్ బస్సులో మంటలను ముందుగా గుర్తించి అప్రమత్తమై ప్రయాణికులను బస్సు నుండి దించేశారు. రేడియేటర్ దగ్గర విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయని డ్రైవర్ చెబున్నారు. పత్తికొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

# బీహార్ తర్వాత ఇప్పుడు బెంగాల్ వంతు

- బెంగాల్ అభివృద్ధికి మమత ప్రధాన అడ్డంకి
- తృణమూల్‌ను సాగనంపే సమయం వచ్చింది
- చొరబాటుదారులకు తృణమూల్ అండ
- అవినీతి కారణంగా ప్రజలకు చేరని పథకాలు
- మాల్దా సభలో తృణమూల్‌ను ఏకిపారేసిన ప్రధాని మోడీ




**కోల్‌కతా :** బెంగాల్ ప్రజల పట్ల ఏమాత్రం కనికరం లేని అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇక్కడి చొరబాట్లకు తృణమూల్ అండగా నిలవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. బీజేపీ అభివృద్ధి మోడల్‌ను జెన్‌జీ తరం విశ్వసిస్తోందని.. ఈసారి బెంగాల్ ప్రజలు మార్పు కోరుతూ బీజేపీకి పట్టం కడతారనే నమ్మకం తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. బృహన్ ముంబై ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం అనంతరం తొలిసారి పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రథమార్థంలో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. రాష్ట్రంలో అవినీతి కారణంగా కేంద్ర పథకాల ప్రయోజనాలు.. పేద ప్రజలకు చేరడం లేదని ప్రధాని ఆరోపించారు. బెంగాల్‌లోని పేదలందరికీ సొంత ఇళ్లు, ఉచిత రేషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలన్నదే తన కోరిక అని అన్నారు. పేద ప్రజల కోసం పంపిన సొమ్ములను టీఎంసీ నేతలు లూటీ చేస్తున్నారన్నారు. 'టీఎంసీ ప్రభుత్వం నాకు, బెంగాల్ ప్రజలకు శత్రువుగా మారుతోంది' అని తీవ్రంగా ఆక్షేపించారు మోదీ. బెంగాల్ విజన్‌తోనే 2047 నాటికి అభివృద్ధి భారత్ విజన్ సాకారమవుతుందని ప్రధాని అన్నారు. ఒడిశా, త్రిపుర, అస్సాం, బిహార్‌లో బీజేపీ వరుస విజయాలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు బెంగాల్‌లో సుపరిపాలనకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ఇటీవల చారిత్రక విజయం సాధించిందని, ముఖ్యంగా ముంబై పురపోరు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిందని గుర్తుచేశారు. 'ఈసారి బెంగాల్లో మార్పు అవసరముందని నేను చెబుతాను.. బీజేపీ సర్కార్ కావాలి' అని మీరు చెప్పండి.. అంటూ సభికులను మోదీ ఉత్సాహపరిచారు. కేంద్ర పథకాలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని అడ్డుకోవడంపై విమర్శలు గుప్పిస్తూ.. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అడ్డుకున్న ఏకైక రాష్ట్రం బెంగాల్ అని, పేద ప్రజలకు ఎలాంటి పథకాలు అందనీయడం లేదని మోదీ చెప్పారు. ఇలాంటి క్రూర ప్రభుత్వానికి గుడ్‌బై చెప్పే సమయం వచ్చిందన్నారు. మాల్దాలో ఫ్యాక్టరీలు లేకపోవడంతో మాల్దా, ముర్షిదాబాద్ ప్రజలు ఉద్యోగాల కోసం వలసలు వెళ్తున్నారని, మామిడి రైతులు ప్రభుత్వ విధానాలు, వరదల సమయంలో చూపిస్తున్న నిర్లక్ష్యంతో ఎంతో నష్టపోతున్నారని అన్నారు. గంగా, ఫులాహార్ నదీ తీర కోత కారణంగా వేలాది మంది ఇళ్లు కోల్పోయారని, రక్షణ గోడ కోరుతూ ప్రజలు చేస్తున్న ఆర్తనాదాలను టీఎంసీ సర్కార్ ఖాతారు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం పంపిన వరద సహాయక నిధులు లబ్దిదారులకు చేరలేదని కాగ్ నివేదకలు కూడా చెబుతున్నాయని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ అనుచిత విధానాలకు స్వస్తి చెప్పి, వరదల నివారణకు సమగ్ర పరిష్కారం కల్పిస్తామని, మామిడి సాగు చేసే మాల్దా రైతుల కోసం కోల్డ్ స్టోరేజీ సౌకర్యం కల్పించి ఆర్థికంగా బలపడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని, బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే భాజపా ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. బిహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని.. వీటి కారణంగానే మాల్దా, ముర్షిదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని, వీటిని అరికట్టడానికి తృణమూల్ కాంగ్రెస్ ఎటువంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40సార్లు అందించామని, అయినా అవి అసలైన లబ్దిదారులకు చేరలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్రం నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతోందని.. ఆ పార్టీ అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే పార్టీ అని అన్నారు. టీఎంసీ అధికారం కోల్పోయి.. భాజపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తూర్పు భారత్ దశాబ్దాలుగా వెనకబడి ఉందన్నారు.

# పట్టాలకెక్కిన తొలి వందేభారత్ స్లీపర్

## మాల్దాలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని




**కోల్‌కతా :** భారత్‌లో తొలి వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో జరిగిన కార్యక్రమంలో ఈ అధునాతన రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్లీపర్ రైల్లో ప్రయాణించే విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. రైలు లోపలికి వెళ్లి అందులోని సౌకర్యాలను ప్రధాని పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌవ్‌డా- నుంచి అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది. వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్‌ఎస్) సమక్షంలో కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య తుది పరీక్షలు నిర్వహించగా రైలు ఈ వేగాన్ని చేరుకుంది. గాజు గ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్‌లో ఉంచినా.. రైలు గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం నీళ్లు తొణకకపోవడాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతంలో సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ రైల్లో 16 కోచ్‌లు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. విమానంలో ప్రయాణించిన అనుభూతిని కలిగించేలా ఇందులో సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ఇందులో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటి వాటిని ఇందులో అనుమతించరు.

# ఇరాన్ అల్లర్ల కుట్రదారు ట్రంప్

## తీవ్ర విమర్శలు చేసిన ఇరాన్ సుప్రీం ఖమేని

**టెహ్రాన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్న ఆయన.. ఇరాన్‌లో ఆందోళనలకు, ప్రాణ నష్టానికి ఆయనే కారణమని ఆరోపించారు. ఇటీవల చోటు చేసుకున్న ఆందోళనల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఖమేనీ తొలిసారి ప్రస్తావించారు. ఇటీవల ఆందోళనల వెనుక అమెరికా కుట్ర దాగుంది. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడం వారి లక్ష్యం. ఆందోళనల వేళ అమెరికా అధ్యక్షుడు స్వయంగా వ్యాఖ్యలు చేస్తూ నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. అందుకే ఆయన్ను నేరస్థుడిగా పరిగణిస్తున్నాం. నిరసనల్లో పాల్గొన్నవారు అమెరికా కోసం పనిచేసిన వారే. విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేశారు. ఎంతో మందిని గాయపరిచారు' అని సుప్రీం లీడర్ ఖమేనీ పేర్కొన్నారు. ఆందోళనకారులు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న మందుగుండు సామగ్రిని వినియోగించారని ఖమేనీ ఆరోపించారు. యుద్ధం వైపు దేశాన్ని తీసుకెళ్లాలని అనుకోవడం లేదన్నారు. నేరస్థుల్లో విదేశీయులూ ఉన్నారన్నారు. నేరస్థులెవరినీ విడిచిపెట్టబోమని, కేసులను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఆందోళనల్లో పాల్గొన్న వారిలో దాదాపు 800 మందికి ఇరాన్ మరణశిక్ష అమలు చేస్తుందనే వార్తలు వచ్చాయి. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో గల్ఫ్ దేశాలు జోక్యం చేసుకోవడం తదితర పరిణామాల తర్వాత ఇరు దేశాలు వెనక్కి తగ్గినట్లు కనిపించింది. ఈ నేపథ్యంలో ఖమేనీ స్పందిస్తూ అమెరికాపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు ఇరాన్ హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3వేలకు పైగా మరణించినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.

# బంగ్లాలో ఆగని హింస

## మరో హిందూ యువకుడి దారుణ హత్య

**ఢాకా :** బంగ్లాదేశ్‌లో మైనారిటీలే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. తాజాగా మరో హిందువును కారుతో తొక్కించి మరీ దారుణంగా హత్య చేశారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. మీడియా కథనాల ప్రకారం రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా (30) పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హాషేమ్ పెట్రోల్ కోసం వచ్చాడు. పెట్రోల్ కొట్టించుకున్నాక డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించాడు. రిపోన్ డబ్బు ఇవ్వాల్సిందిగా హాషేమ్‌ను అడగ్గా అతడిపైకి కారుతో దూసుకెళ్లాడు. కారు తనపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాల పాలైన రిపోన్ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అబుల్ హాషేమ్‌ను, అతడి కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఇరాన్‌లో అస్థిర పరిస్థితులు

**న్యూఢిల్లీ :** ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నిరసనల కారణంగా ఇప్పటివరకు సుమారు రెండు వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లోని భారతీయులు జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత త్వరగా ఇండియాకు వచ్చేయాలని సూచించింది. శుక్రవారం రాత్రి రెండు కమర్షియల్ విమానాలు భారతీయులతో ఢిల్లీ చేరుకున్నాయి. అయితే.. అవి రెండూ రెగ్యులర్ విమానాలే. భారతీయులను ఇరాన్ నుంచి ఇండియాకు తరలించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విమానాలు కాదు. ఇక.. భారత ప్రభుత్వం అక్కడి పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అత్యవసరమైతే తప్ప ఇరాన్‌కు ప్రయాణించవద్దని భారతీయులను హెచ్చరించింది. ఇరాన్ ఎయిర్‌స్పేస్ తాత్కాలికంగా మూసివేయడంతో జనవరి 15 నుంచి రెండు దేశాల మధ్య పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇప్పుడిప్పుడే ఎయిర్‌స్పేస్ పరిస్థితులు సాధారణ స్థితిలోకి వస్తున్నాయి. దీంతో భారతీయులు అక్కడి నుంచి ఇండియాకు వచ్చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం తమకు ఎంతో



సాయం చేసిందంటున్నారు. శుక్రవారం రాత్రి ఇండియాకు చేరుకున్న ఓ ఎంబీబీఎస్ విద్యార్థిని మీడియాతో మాట్లాడుతూ.. 'నేను నిరసనల గురించి విన్నాను. కానీ, నేరుగా చూడలేదు. అక్కడ ఇంటర్‌నెట్ లేదు' అని చెప్పుకొచ్చారు. మరో వ్యక్తి స్పందిస్తూ.. 'మేము బయటకు వెళ్లినపుడు నిరసనకారులు కారుకు అడ్డంగా వచ్చారు. కొంచెం ఇబ్బంది పెట్టారు. అక్కడ ఇంటర్‌నెట్ కూడా లేదు. ఆ కారణంతో ఇండియాలోని మా కుటుంబాలకు విషయం చెప్పలేకపోయాం. ఆఖరికి ఇండియన్ ఎంబసీని కూడా సంప్రదించలేకపోయాం' అని వాపోయారు. ఓ ఇంజనీర్ మాట్లాడుతూ.. 'ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నాయి. నెట్‌వర్క్ సమస్యలు ఉన్నాయి' అని అన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




## సంపాదకీయం

# అనేక దేశాల్లో అస్థిరతకు కుట్రలు

ప్రపంచంపై పెత్తనం సాగించాలన్న ట్రంప్ రాజ్యకాంక్ష కారణంగా అనేక దేశాల్లో అస్థిరత నెలకొంటోంది. అయితే సుంకాలు లేదంటే బెదరింపులు..మరీ అయితే దాడులు అన్న మంత్రాన్ని ఎంచుకున్న ట్రంప్ రంపం కోతలు పెడుతున్నారు. అనేక దేశాలు ఇప్పుడు ట్రంప్ గుప్పిట్లో ఇరుక్కున్నాయి. పైకి తీయగా మాట్లాడుతూ..తన ధృతరాష్ట్ర కౌగిలిని బిగిస్తున్నారు. వెనిజులా తరవాత ఇరాన్‌లో అదే తరహా సన్నాహాలకు దిగినా ఎందుకనో వెనకడుగు వేశారు. అమెరికా సిఐఎ ఇప్పుడు ప్రపంచంలో చిచ్చు పెట్టే పనిలో ఉంది. శ్రీలంక,బంగ్లాదేశ్,నేపాల్, ఇరాన్, ఇరాక్, ఇలా చెప్పుకుంటూ పోతే అనేక దేశాల్లో అంతర్గత కలహాలకు ఆజ్యం పోస్తోంది. భారత్‌ను దెబ్బతీసేందుకు నానారకాల గడ్డీ కరిచింది. సిఐఎ గుప్పిట తెలియకుండానే పడ్డ ఎందరో తమ దేశంలో అస్థిరతకు కారణం అవుతున్నారు. అందులో భారత్‌లోని కొందరు నేతలు కూడా ఉన్నా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఎందుకంటే కొంతకాలంగా భారత్‌లో అస్థిరతకు అనేక రకాల ప్రయత్నాలు సాగాయి. మణిపూర్ అల్లర్లు, రైతుల ఆందోళనలు, సర్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, బంగ్లాను ఎగదోయడం, పాక్‌కు పాలుపోసి పెంచడం వంటివన్నీ భారత్‌లో అస్థిరతకు కారణాలుగా చూడాలి. తాజాగా ఇరాన్‌లో సాగుతున్న ఆందోళనలను అమెరికా ఎగదోస్తోంది. అక్కడి ప్రజల్లో విషం నిండానికి ప్రయత్నం చేస్తోంది. అయితే ఇరాన్‌పై సైనిక చర్య తప్పదంటూ ఇటీవల వరుస హెచ్చరికలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతానికి వెనక్కి తగ్గినట్టే కనిపిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టిన నిరసనకారుల అణచివేత విషయంలో టెహ్రాన్ మొత్తబడినట్లు కనిపిస్తోందని పేర్కొన్న ఆయన.. సమీప భవిష్యత్తులో ఆ దేశంపై దాడి చేయబోమన్న సంకేతాలిచ్చారు. దనీఇకి కూడా కారణం లేకపోలేదు. ఇరాన్‌పై దాడులకు దిగితే ఆ దేశంలో అనిశ్చితి మరింత పెరిగే ముప్పుండటంతో పాటు అది దీర్ఘకాలిక యుద్ధంగా పరిణమించే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వచ్చాయి. అలాగే ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తే అవకాశాలు ఉండటం క ఊడా అమెరికా గమనించి ఉంటుంది. పరిమిత స్థాయి సైనిక చర్యతో ఆగిపోకుండా దీర్ఘకాలం పాటు దాడులు కొనసాగించక తప్పని పరిస్థితులు నెలకొంటే కొత్త తలనొప్పులు రావచ్చని ట్రంప్‌కు సలహాలు అందాయని అంటున్నారు. అందుకే సైనిక చర్యపై ట్రంప్ నిర్ణయం మార్పునకు కారణమైనట్లు తెలుస్తోంది. నిరసనకారులపై ఉక్కుపాదం మోపితే ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ పదేపదే హెచ్చరించాక కొంత తగ్గారని గమనించాలి. 24 గంటల్లోనే టెహ్రాన్‌పై వాషింగ్టన్ సైనిక చర్యకు దిగడం ఖాయమనీ అంతా అనుకున్నారు. పశ్చిమాసియాలోని పలు వైమానిక స్థావరాల నుంచి అమెరికా హడావుడిగా తన బలగాలను కొంతమేర ఉపసంహరించుకోవడంతో సైనిక చర్య తప్పదన్న వార్తలకు బలాన్నిచ్చాయి. అయితే ట్రంప్ కొంత తెలివిని ప్రదర్శించారనే అనుకోవాలి. అందుకే ప్రస్తుతానికి సైనిక చర్య ప్రయత్నాలు నిలిచిపోయినట్టే కనిపిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో చురుగ్గా పాల్గొన్న ఎర్ఫాన్ సొల్తానీ అనే 26 ఏళ్ల యువకుడికి ఈ నెల 14న మరణశిక్ష అమలు చేయాలని ఇరాన్ తొలుత భావించింది. కానీ చివరి నిమిషాల్లో ఆ శిక్ష అమలును నిలిపివేసింది. సైనిక చర్యపై ట్రంప్ వెనక్కి తగ్గడానికి ఇది బాగా ఉపయోగపడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్‌పై దాడుల విషయంలో ట్రంప్ వెనక్కు తగ్గడానికి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు కూడా ఓ ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇరాన్ అంత తేలికగా తలొగ్గబోదని ట్రంప్‌నకు నెతన్యాహు హితబోధ చ ఏసి ఉంటారని కూడా అంటున్నారు. గతంలో టెహ్రాన్‌పై సైనిక చర్యను కోరిన నెతన్యాహుయే ఇప్పుడు దాడులు వద్దని స్వయంగా చెప్పడం ట్రంప్‌ను పునరాలోచనలో పడేసి ఉంటుందన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. గల్ఫ్‌లో అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ వంటి దేశాలతో పాటు ఈజిప్టు కూడా సైనిక చర్య నివారణకు ట్రంప్‌తో ముమ్మరంగా దౌత్య ప్రయత్నాలు చేశాయి. ఇరాన్‌పై దాడులు ప్రాంతీయంగా యుద్ధమేఘాలకు కారణమవుతాయని, దానివల్ల అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదుపులకు లోనవుతుందని సూచించాయి. అయితే ఇరాన్‌లో నిరసనకారులపై హత్యాకాండను ఆపడమే తన ప్రాథమిక లక్ష్యమని ఆయా దేశాల అధికారులతో ట్రంప్ తెలిపారు. టెహ్రాన్ ఆ దిశగా సంకేతాలిస్తే సైనిక చర్యకు దిగబోనని స్పష్టం చేశారు. ఆపై కొన్ని గంటలకే ఎర్ఫాన్ సొల్తానీ మరణశిక్షను టెహ్రాన్ నిలిపివేయడం, 'ఇది శుభవార్త.. ఇదే కొనసాగుతుందని ఆశిస్తున్నా' అంటూ అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యలు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిరసనకారుల మరణశిక్షలను నిలిపివేసినందుకు ఇరాన్‌కు ట్రంప్ కృతజ్ఞతలు తెలపడం గమనార్హం. ఇదిలావుంటే ఇరాన్ అత్యంత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆర్థిక కష్టాలపై ప్రారంభమైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించి, సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖామెనీ అధికారానికి నిరంతర సవాలుగా మారింది. హింస పెరుగుతున్న వేళ, ఉరిశిక్షల బెదిరింపులు, దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ నిలిపివేత, అలాగే ముఖ్యంగా అమెరికా వంటి విదేశీ శక్తుల జోక్యం...ఇరాన్ అంతర్గత కలకలిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. మానవ హక్కుల సంస్థలు పరిస్థితులు వేగంగా క్షీణిస్తున్నాయని హెచ్చరిస్తున్నాయి. సంపూర్ణ ఇంటర్నెట్ బ్లాక్‌ఔట్ కారణంగా హత్యలు, అరెస్టులపై ఖచ్చితమైన సమాచారం అందడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే ఇరాన్‌లోని 31 ప్రావిన్సులన్నింటిలోనూ నిరసనలు చెలరేగాయి. 180కు పైగా నగరాల్లో వందలాది ప్రదర్శనలు నమోదయ్యాయి. ఇటీవలి వారాల్లో కనీసం 850 మంది మరణించారని, 2,300 మందికి పైగా అరెస్టయ్యారని హక్కుల సంఘాలు అంచనా వేస్తున్నాయి. బ్లాక్‌ఔట్ వల్ల కుటుంబాలు పరస్పరం సంబంధాలు కోల్పోయాయి. ఇదంతా జరుగుతుండగానే భద్రతా బలగాలు తమ దమన చర్యలను మరింత కఠినతరం చేశాయి. తాజా నిరసనలకు కారణం ఆర్థిక పతనం ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. ఇరానియన్ రియాల్ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది. ద్రవ్యోల్బణం సుమారు 40 శాతానికి చేరింది. ఆహారం, ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రోల్ ధరల పెంపు, చాలా వస్తువులపై సబ్సిడీ మారకపు రేట్ల రద్దు ఇవన్నీ అనేక కుటుంబాలను అంచుల దాకా నెట్టాయి. అయితే నిరసనలు త్వరలోనే ఆర్థిక అంశాలను దాటి, రాజకీయ దమనంపై ఉన్న కోపాన్ని ప్రతిబింబించాయి. నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘర్షణాత్మక ధోరణి అవలంబించారు. నిరసనలు కొనసాగించాలని ఇరానీయులను ప్రోత్సహిస్తూ వచ్చారు. మొత్తంగా ట్రంప్ వెనక్కి తగ్గినా ఇరాన్ తాజా పరిస్తితులు దారికి వస్తాయా అన్నది అనుమానమే. ఛాందసవాద పాలన కారణంగా ప్రజలు నలగి పోతున్నారు. దీనినుంచి బయటపడే మార్గాలను ఇరాన్ ఆలోచించాల్సి ఉంది.




**కంచర్ల అచ్యుత్ రావు**
ఎడిటర్

# కో ఆపరేటివ్ బ్యాంకులపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం సరికాదు

**రాష్ట్రంలో అర్బన్ బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఎన్నికలు నిర్వహించాలి**

**నాఫ్కాబ్ డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు**



**చల్లపల్లి:** దేశ సహకార అర్బన్ బ్యాంకింగ్ వ్యవస్థకు 121 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉందని, కో ఆపరేటివ్ బ్యాంకులు ప్రజల విశ్వాసంతో నడిచే సంస్థలనీ, వాటిపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయాలని చూస్తోందని ది నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ క్రెడిట్ సొసైటీ(నాఫ్కాబ్) డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు విమర్శించారు. శనివారం చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వ-రరావు, వికాసకేంద్రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో రాఘవేంద్రరావు మాట్లాడుతూ, బ్యాంకింగ్ నియంత్రణ చట్టానికి కేంద్ర ప్రభుత్వం చేసిన రాజ్యాంగ వ్యతిరేక సవ-రణలను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సహకార రంగంపై రాజకీయ కోణంగా పెత్తనం చేసేందుకు కేంద్రం ముందుకు వెళుతోందని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా జరుపుకుంటూ బలోపేతానికి నిర్దిష్ట చర్యలు తీసుకుంటున్న తరుణంలో ప్రజాస్వామిక స్వభావాన్నే మార్చివేసేలా కేం ద్రం చర్యలు చేపట్టడం దురదృష్టకరమన్నారు. కేంద్రం పెత్తనంపై నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నోరు పెదపకపోవటం విచారకరమన్నారు. వ్యవసాయంతోపాటు చిన్నశాఖగా ఉన్న సహకార శాఖను 2018లో ప్రత్యేక మంత్రిత్వ శాఖగాట ఏర్పాటుచేసి వ్యవసాయంతో సంబం ధంలేని హెూం మంత్రి అమిత్షాను సహకార శాఖ మంత్రి గా నియమించటం చూస్తే రాజకీయ కోణం ఉందని అందరూ అనుమానిస్తున్నట్లు చెప్పారు. దేశంలో కోవిడ్ సంక్షోభంలో బాక్డౌన్లో ఉండగా 2020లో హఠాత్తుగా బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంలో సహకార అర్బన్ బ్యాంకులు, బ్యాంకింగ్ కంపెనీలకు ఉన్న వ్యత్యాసాలను తొలగిస్తూ తొలుత ఆర్డినెన్స్ జారీ చేసి, తదుపరి ఎటువంటి చర్చలు పార్లమెంటులో ఆమోదింపచేశారని తెలిపారు. సహకార బ్యాంకులు అనే పదాన్ని బ్యాంకింగ్ కంపెనీగా సైతం మార్పుచేశారన్నారు. సహకార రంగం రాష్ట్రాల జాబితాలో అంశమనీ, పరిపాలన అంశాలు, ఎన్నికలు తదితర అంశాలు రాష్ట్రాలు మాత్రమే చేయాలనీ, కేంద్ర ప్రభుత్వ చట్టం వాటిని ఉల్లంఘించేలా రూ పొందించినట్లు తెలిపారు. షేరుధనం వాపసు నిషేదం, రెండు ఆర్బన్ బ్యాంకులను నిర్భందంగా రిజర్వ్ బ్యాంక్ విలీనం చేసే అధికారం, ఆర్బన్ బ్యాంకుల డైరెక్టర్లు పదేళ్లకు మంచి ఉండరాదని ఇలా అనేక మార్పులు చట్టస వరణ ద్వారా చేశారని అవి పూర్తిగా ప్రజాస్వామ్య, రాజ్యాం గ వ్యతిరేఖమైనవని విమర్శించారు. పార్లమెంటు సమ్యలకు సైతం వర్తించని అర్హత నిబందనలు ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా ఎన్నికయ్యే డైరెక్టర్లకు పెడుతూ చట్టసవరణ చేయటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వా పోయారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువొచ్చిన చట్టసవరణ పూర్తిగా లోపభూయిష్టమైనదని మం డిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థను నియంత్రించే అత్యున్నత సంస్థ రిజర్వ్ బ్యాంక్ చట్ట సవరణ అమలుకు ఉత్సాహం ప్రదర్శించటం సమంజనం కాదన్నారు. బ్యాంకింగ్ చట్టసవరణ అంశంలో దాఖలైన అన్ని హైకోర్టుల కేసులను మద్రాస్ హైకోర్టుకు బదిలీచేసిన నేపథ్యంలో కోర్టు తీర్పువచ్చేవరకు వేచిచూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక బ్యాంకింగ్ నియం తణ చట్టసవరణల అమలుకు పూనుకుంటే ఆర్సన్ బ్యాంకుల పట్ల ప్రజల విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ చట్టసవరణకు వ్యతిరేఖంగా జాతీయస్థాయిలో చర్చలు జరిగాయనీ, కేంద్ర ప్రభుత్వ వైఖరిని జాతీయ అర్బన్ సమాఖ్య తీవ్రంగా పరిగణిస్తోందని రాఘవేంద్రరావు తెలిపారు. అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధమైనట్లు చెప్పాడు. రాష్ట్రంలో ఆర్బన్ బ్యాంకులకు ప్రభుత్వం ఎన్నికలు జరపాలని దలసాని రాఘవేంద్రరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 44 అర్బన్ బ్యాంకులుంటే 110 సంవత్సరాల నుంచీ ఉన్న బ్యాంకులు 22 ఉన్నాయన్నారు. 20 బ్యాంకులకు ఎప్పటినుంచో ఎన్నికలే లేవనీ, ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే కుప్పంలో ఆర్బన్ బ్యాంకుకీ, మచిలీపట్నం. గుడివాడ తదితర బ్యాంకులకు ఎన్నికలు లేవన్నారు. కారణాలు లేకుండా ప్రభుత్వాలు ఎన్నికలు వాయిదా వేస్తున్నాయనీ, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల పాలకుల చిత్తశుద్ధికి ప్రభుత్వాల వైఖరి నిదర్శనమన్నారు. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంతో అర్బిఐలకు చాలా అధికారాలు ఉన్నాయనీ, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అర్బన్ బ్యాంకులకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. పార్టీ నాయకులను పెట్టి నియామకాలు చేయటం సమర్థనీయం కాదనీ, ఈ తరహా చర్యలతో ప్రజాస్వామ్య స్ఫూర్తి లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో విశాఖ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు ఉన్నారు.

# జూనియర్ సింగిల్స్ విజేత నరుమూగయ్

**సీనియర్ సింగిల్స్ విజేత రాగశ్రీ**

**సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్**






**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్ లో జరుగుతున్న సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ మహిళల లీగ్ జూనియర్ సింగిల్స్ విభాగంలో నరుమూగయ్ (తమిళనాడు), సీనియర్ సింగిల్స్ విభాగంలో రాగశ్రీ (తమిళనాడు) ఛాంపియన్ లుగా నిలిచారు. జూనియర్ విభాగంలో శ్వేత (తమిళనాడు) ద్వితీయ, సోనికా (కర్ణాటక), సంజూ (తమిళనాడు) తృతీయ స్థానాలను కైవసం చేసుకోగా సీనియర్ విభాగంలో షాలిని (తమిళనాడు) ద్వితీయ, యాజిని (తమిళనాడు), సాధన (తమిళనాడు) తృతీయ స్థానాలను సాధించారు. జూనియర్ విభాగంలో మొదటి సెమీ ఫైనల్స్ లో యాజిని (తమిళనాడు)పై 1-3 తేడాతో ఏ.ఎస్.షాలిని (తమిళనాడు), రెండవ సెమీ ఫైనల్స్ లో సాధన (తమిళనాడు)పై 0-3 తేడాతో నరుమూగయ్ (తమిళనాడు) విజయం సాధించారు. ఫైనల్స్ లో ఏ.ఎస్.షాలిని (తమిళనాడు)పై 1-3 తేడాతో నరుమూగయ్ (తమిళనాడు) గెలుపొందింది. సీనియర్ విభాగంలో మొదటి సెమీ ఫైనల్స్ లో సోనికా (కర్ణాటక)పై 0-3 తేడాతో రాగశ్రీ (తమిళనాడు), రెండవ సెమీ ఫైనల్స్ లో సంజూ (కేరళ)పై 0-3 తేడాతో శ్వేత (తమిళనాడు) గెలుపొందారు. ఫైనల్స్ లో శ్వేత (తమిళనాడు) 0-3 తేడాతో రాగశ్రీ (తమిళనాడు) విజయం సాధించింది. ఆదివారం, సోమవారం సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ డబల్స్ విభాగంలో మ్యాచ్ లు జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ పేర్కొన్నారు.

# ఘనంగా జీసస్ గాస్పెల్ మినిస్ట్రీ ఆఫ్ ఇండియా నూతన మందిరం ప్రారంభం







**చల్లపల్లి:** మండలంలోని రామానగరంలో ఆరవ నెంబర్ కాలువ ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన జీసస్ గాస్పెల్ మినిస్ట్రీ ఆఫ్ ఇండియా నూతన మందిరాన్ని శనివారం ప్రారంభించారు. దేవుని సేవకురాలు కొడాలి నవమణి ఆధ్వర్యంలో ఆత్మీయ అతిథి డాక్టర్ కైతేపల్లి దాస్ పర్యవేక్షణలో శనివారం మందిరం స్థల దాత అనుముకొండ పూర్ణ చంద్రశేఖర్ (ప్రెస్ పూర్ణ) ప్రారంభించారు. మందిరం గదిని విశ్రాంత డీఎస్పీ హరిరాజేంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు, సంఘ పెద్దలు స్థలదాత అనుమకొండ పూర్ణ చంద్రశేఖర్ సేవలను కొనియాడారు. పలువురు పాస్టర్లు యేసు క్రీస్తు సందేశం అందించడంతో పాటు పాటలు ఆలపించారు. సాయంత్రం దివిసీమ మహిళా పాస్టర్ల ఐక్యవేదిక కమిటీ ఏర్పాటు చేశారు. 12 మందితో కమిటీని ఏర్పాటు చేయగా, చల్లపల్లికి చెందిన కొడాలి నవమణి అధ్యక్షురాలిగా, కోడూరుకు చెందిన దొంతగాని ప్రభుకుమారి కార్యదర్శిగా, నాగాయలంకకు చెందిన కమల ట్రెజరర్ గా, రాజులపాటి మేరీ ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన మహిళా పాస్టర్ల కమిటీ సభ్యులకు పలువురి విశ్వాసులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ కు చెందిన మెట్ల జగన్ మోహనరావు, కొత్త మాజేరుకు చెందిన రెవరెండ్ ఎ విక్టర్ పాల్, రెవరెండ్ పి దేవదానం, పాస్టర్ పి హరనాథ్, నారా లోకేష్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాసరావులతో పాటు పెద్ద సంఖ్యలో దైవ సేవకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

# గవర్ల అనకాపల్లి లో సమాజ సేవకులకు సత్కారం

## – సమాజ సేవకులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



**మునగపాక, జనవరి 17, మనసులో మాట..** మండలంలోని తోటాడ పంచాయతీ, గవర్ల అనకాపల్లి గ్రామంలో నెహ్రూ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిశాయి.ఈ సందర్భంగా వైద్య వృత్తి ద్వారా సమాజ సేవ చేస్తున్న గ్రామానికి చెందిన పలువురు వైద్యులతో పాటు ఐఐటీ ర్యాకీకర్ దొడ్డి శరవణ్ నాయుడు,ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బొడ్డేడ మహిష మహాలక్ష్మి లను ఘనంగా సత్కరించారు.గౌరీ సేవా సంఘం తోటాడ క్లస్టర్ అధ్యక్షుడు పొలమరశెట్టి ఆనంద రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పుట్టి ఉన్నత విద్య ద్వారా వైద్య వృత్తిలో కొనసాగుతున్న వారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి సన్మానించడం వారి బాధ్యతను మరింత పెంపొందింస్తుందని అన్నారు.సంక్రాంతి సంబరాల్లో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయని పేర్కొన్నారు.వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత అన్ని రంగాలలో రాణించాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పొలమరశెట్టి చంద్రరావు (చందు) బృందం ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కొయిలాడ వెంకట్, ఎంపీటీసీలు కాండ్రేగుల వెంకటలక్ష్మి,మద్దాల వీరునాయుడు, పొలమరశెట్టి బాగేశ్వరరావు,ఆళ్ల మహేశ్వరరావు, పొలమరశెట్టి సత్య జగ్గారావు,దాడి శ్రీనివాస్,దొడ్డి కిరణ్,బుద్ధ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి ఏర్పాట్లు

## అందరు పాల్గొని విజవంతం చేయాలని పాడేరు టీడీపీ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి



**పాడేరు రూరల్ జనవరి 18 (మనసులో మాట):** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, తెలుగు జాతి గౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో నిలిపిన మహనీయుడు, స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) వర్ధంతిని పురస్కరించుకొని పాడేరు పట్టణంలో ఘనంగా వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నేడు ఆదివారం (18-01-2026) న పాడేరులో జరిగే ఈ వర్ధంతి కార్యక్రమాలను తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించనున్నారు. అలాగే ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రసంగించనున్నారు.

ఈ కార్యక్రమానికి పాడేరు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు

## అనకాపల్లిలో ముంబై మున్సిపల్ ఎన్నికల విజయంపై

# బిజెపి సంబరాలు

## - బిజెపి శ్రేణులు ర్యాలీ, బాణాసంచా వెలిగించి, స్వీట్లు పంపిణీ



**అనకాపల్లి రూరల్, జనవరి 17 (మనసులో మాట):** దేశ ఆర్థిక రాజధాని ముంబై మహానగరం (బి ఎం సి) మేయర్ ఎన్నికలలో బిజెపి పార్టీ గణవిజయం సాధించడంతో బిజెపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. భారతీయ జనతా పార్టీ మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో మహాయుతి గ్రూపుగా ఏర్పడి చరిత్ర సృష్టించడంతో సోదులు వారి వీధిలో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి ప్లే కార్డ్స్, బ్యానర్లు తో బిజెపి జిందాబాద్, ప్రధాని మోదీ జిందాబాద్ అంటూ నినాదాలు చేసుకుంటూ రామచంద్ర థియేటర్ కూడలి మీదుగా, నెహ్రూ చౌక్ కూడలికి చేరుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు, బొడ్డేడ నాగేశ్వరరావు విజయోత్సవ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ మొత్తం 227 కార్పోరేట్ డివిజన్లకు 114 డివిజన్ లలో మహాయుతి కూటమి విజయం సాధించడం తో దేశంలో బిజెపికి ఎదురులేదని మరో మారు నిరూపించిందన్నారు. బిజెపి ని ఎన్నికలలో గెలిపించిన మహారాష్ట్ర ప్రజలకు దన్యవాదములు తెలుపుతూ ఇదే విధంగా మన రాష్ట్రంలో కూడా ముందు ముందు జరగబోయే ఎన్నికల్లో ప్రజలు మద్దతు తెలిపి కూటమిని గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ప్రధాని మోడీజీ పై దేశం లో ఏ ప్రాంతంలో ఎన్నికలు జరిగినా బిజెపి విజయం సాధించడం మోడీజీ అవలంబిస్తున్న అవినీతి లేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలు కారణమన్నారు. ముఖ్యమంత్రి పడ్నవిష్ ఆధ్వర్యంలో దాదాపు అన్ని మున్సిపాలిటీలలో విజయం సాధించడం గొప్ప విషయమన్నారు. అనంతరం బాణాసంచా వెలిగించి, మిఠాయిలు పంపిణీ చేసి నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో బి రత్న భరత్, పాకలపాటి రవిరాజు, మహిలా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి నాగమణి, భానుమతి, భరత్, మారిశెట్టి బాస్కరరావు, నర్సింగ్ యాదవ్, కుమార్ కామేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్న ఆరోగ్య సమస్యకైనా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలి

## ప్రాణాపాయ స్థితిని నివారించవచ్చు : జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ



**పాడేరు రూరల్, జనవరి 17 (మనసులో మాట)..** జిల్లాలో ప్రజలు ఏ చిన్న ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నా స్థానిక ఆరోగ్య సిబ్బంది సహకారంతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రుల్లోనే చికిత్సలు చేయించుకోవాలని జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సకాలంలో సంప్రదించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని ఆమె తెలిపారు.

శనివారం పాడేరులోని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో (ప్రెస్ మీట్) ఆమె మాట్లాడుతూ, పెదబయలు మండలం సీకరి పంచాయతీ కౌరుపల్లి గ్రామానికి చెందిన కొర్రా పూజిత (14) అనే విద్యార్థిని మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పూజిత పెదబయలు బాలికల ఆశ్రమ పాఠశాల2లో 9వ తరగతి చదువుతూ సంక్రాంతి సెలవుల నిమిత్తం స్వగ్రామానికి వెళ్లి అనారోగ్యానికి గురై మృతి చెందిందన్నారు.

పిల్లల్లో నలత, వాంతులు, వీరేచనాలు, జ్వరం, దగ్గు, కిడ్నీ సంబంధిత సమస్యలు, రక్తహీనత, హై బ్లడ్ ప్రెషర్, అకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడిపోవడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు స్పందించి తక్షణమే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని సూచించారు. పరిస్థితి విషమిస్తే జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడం ద్వారా చిన్నారుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు.

ప్రభుత్వం జిల్లాలో పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేసిందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రిలో 24 గంటలు సుశిక్షిత వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, పరికరాలు, నాణ్యమైన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ కొన్నిచోట్ల అనుభవం లేని, అర్హత లేని వ్యక్తులు అనధికారికంగా వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

అలాంటి నాటు వైద్యాలు, నకిలీ మందులు, తేదీ దాటిన మందులు, పర్మిషన్ లేని చికిత్సల వల్ల ప్రాణనష్టం జరుగుతుందని, అట్టి వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పూజిత మృతికి కారణమైన వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. అనధికారికంగా వైద్యం చేసే వారిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ యంత్రాంగం కలిసి స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు చెప్పారు.

అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్సులు, జిల్లా ఆసుపత్రి, ఐటీడీఏ అంబులెన్సులు 24 గంటలు అందుబాటులో ఉంటాయని, డ్రైవర్లు లేరని, పెట్రోల్ లేదని, డబ్బులు అడిగినట్లయితే కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

108 అంబులెన్స్ అందుబాటులో లేకపోతే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కాల్ సెంటర్ నెంబర్ 6303921374 ను సంప్రదించాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. హేమలత దేవి, జిల్లా అదనపు డీఎంహెచ్ఓ డా. ప్రతాప్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ, ఐటీడీఏ ఏపీవో (పీటీజీ) వెంకటేశ్వర్లు, ఏవో హేమలత తదితరులు పాల్గొన్నారు.



## నర్సీపట్నం మెయిన్ రోడ్డుకు

# విద్యుత్ వెలుగులు

## - రూ. 30 లక్షల వ్యయంతో దీపాల ఏర్పాటు
## - ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ సీఎం రమేష్

**నర్సీపట్నం రూరల్, ( మనసులో మాట) :** నర్సీపట్నం పట్టణ ప్రధాన రహదారికి కొత్త శోభ సంతరించుకుంది. సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను సంక్రాంతి పర్వదినం సందర్భంగా గౌరవ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కలిసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, పట్టణంలోని సరస్వతి ప్రెస్ జంక్షన్ నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు ఈ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ దీపాల వెలుగులతో నర్సీపట్నం ప్రధాన రహదారి ఎంతో సుందరంగా కనిపిస్తోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు కావాల్సిన నిధులను ఎంపీ సీఎం రమేష్ సమకూర్చినట్లు స్పీకర్ ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్-ఛార్జ్ రాజాన సూర్యచంద్ర, కౌన్సిలర్ చింతకాయల రాజేష్, తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు. ప్రధాన రహదారి వెలిగిపోవడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి

# ఘనంగా ఏర్పాటు చేయాలి

## గోడపత్రిక ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



అనకాపల్లి రూరల్, జనవరి 17 (మనసులో మాట): ఉత్తరాంధ్రలో పేరొందిన వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలని స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొణతాల కమిటీ సభ్యులకు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ 175 సంవత్సరాల చరిత్ర కలిగిన అనకాపల్లి వేల్పులవీధి శ్రీ గౌరీ పరమేశ్వరి మహోత్సవం ఈనెల 24న శనివారం జరుగుతుందన్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు కోసం కమిటీ నిరంతరం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గరికి వెంకట్రావు, సెక్రటరీ నానేపల్లి రవి, కోశాధికారి పోతల రమణ, మద్దాల కుర్మారావు, ఉత్సవ కమిటీ సభ్యులు, వేల్పుల వీధి పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరంలో

# కూటమి నాయకులు కుమ్ములాట

## కోట్లాది రూపాయలు చేతులు మారిన పట్టించుకోని పోలీసులు





**అచ్చుతాపురం మనసులో మాట జనవరి 17:** ఎలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశంజనసేన కూటమి అంతర్గత విభేదాలు సంక్రాంతి సంబరాల సందర్భంగా బహిరంగ వర్గపోరుగా బయటపడ్డాయి. కూటమిలో ఉన్న రెండు పార్టీలు వేర్వేరు ప్రాంతాల్లో పోటీగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడంతో రాజకీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

రాంబిల్లి మండలం వెంకటాపురంలో జనసేన, అచ్చుతాపురం మండలం చౌడేపల్లిలో తెలుగుదేశం పార్టీ భారీగా సంక్రాంతి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం గమనార్హం. గత ఏడాది రామన్నపాలెం పరిధిలోని ఒక లేఔట్‌లో జనసేన నాయకుల ఆధ్వర్యంలో కోడిపందాలు, పేకాట, లాటరీ బల్లలు, మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరిగిన విషయం అప్పట్లో తీవ్ర చర్చకు దారితీసింది.



తెలుగుదేశం కార్యకర్తలకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వలేదన్న అసంతృప్తితో ఈ ఏడాది రెండు పార్టీలు విడివిడిగా కార్యక్రమాలు నిర్వహించుకున్నట్లు రాజకీయ వర్గాల్లో . చర్చించుకుంటున్నారు

ఇటీవల ఎలమంచిలిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు జనసేన ఎమ్మెల్యేపై చేసిన తీవ్ర వ్యాఖ్యలు కూటమిలో చీలికను మరింత బలపరిచాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న స్థానిక ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని బహిరంగంగా చర్చ జరుగుతోంది. సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, పేకాట, లాటరీ బల్లలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ, డీఎస్పీ విష్ణు సరూప్ పలుమార్లు హెచ్చరించినప్పటికీ, చౌడేపల్లి మరియు వెంకటాపురం గ్రామాల్లో బహిరంగంగానే జూదం కొనసాగింది.

మహిళల వ్యతిరేకత రాకుండా ఉండేందుకు ముగ్గుల పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆ వెనుకపరంగా భారీ స్థాయిలో కోడిపందాలు జరిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పందాల్లో కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు, మద్యం విక్రయాల్లో 180 ఎంఎల్ బాటిల్‌పై అదనంగా రూ.50 వసూలు చేసి కూటమి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఈ వ్యవహారాలపై కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చిన్న గ్రామాల్లో చాటుమాటుగా పందాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తున్న పోలీసులు, చోడపల్లి వెంకటాపురం వంటి ప్రాంతాల్లో జరుగుతున్న బహిరంగ జూదంపై చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఈ పరిస్థితిపై గ్రామాల మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జూద క్రీడలపై కఠిన చర్యలు తీసుకోకపోతే యువత పెడదారి పడే ప్రమాదం ఉందని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

## ఘనంగా రెండు గ్రామాల్లో

# తీర్థ మహోత్సవాలు

## - అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు
## - రసవత్తరంగా సాగిన ఎడ్లబళ్లు ప్రదర్శన



**దేవరాపల్లి, జనవరి 17, (మనసులో మాట) :** మండలంలోని రైవాడ గ్రామ దేవత ఎరకాలమ్మ, ఎన్ జి నగరం నారి తల్లమ్మ పేరంటాల తీర్థ మహోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి అమ్మవారి ఆలయం వద్ద ధూప దీప నైవేద్యాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్ జి నగరం గ్రామంలో నారి తల్లమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేరంటాల మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు రసవత్తరంగా జరిగాయి . ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 12 వేలు, రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 6 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రైవాడ ఎరకాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తలన రావడంతో రైవాడ జలాశయం సందర్శకులతో కళకళలాడింది.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## మోడల్ గ్రామాలుగా అయిదు పంచాయితీ లు ఎంపిక

**ఎస్. రాయవరం, జనవరి17,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలంలోని అయిదు పంచాయితీ లనుఎంపిక చేసి ఓడిఎఫ్ ప్లస్ మెడల్ గ్రామాలుగా తీర్చిదిద్దేకు చర్యలు చేపట్టామని డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని పెట్టుగొల్లపల్లి,రామయ్యపట్నం,పెద గుమ్ము లూరు, ధర్మవరం గ్రామ పంచాయతీలలో అమలు జరుగుతున్న పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపిడిఓ పరిశీలించారు.పంచాయతీలలో పొడి చెత్తను ఎట్టి పరిస్థితుల్లో మంట పెట్టరాదని పారిశుధ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిలకు సూచించారు..స్వచ్ఛ ఆంధ్రా సాధనలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలం లోని పెట్టుగోళ్ళపల్లి, రామయ్యపట్నం,భీమవరం, వేమగిరి, గుడివాడగ్రామ పంచాయతీలను ఒడిఎఫ్ ప్లస్ గామార్చేందుకుచర్యలుతీసుకుంటున్నామన్నారు. అనంతరం పెట్టు గొళ్ళపల్లి, రామయ్య పట్నం లో గల సంపద తయారీ కేంద్రాలను పరిశీలన చేసి వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు ప్రశాంతి నరసింహమూర్తి, కార్యదర్శి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

### మూలపేటలో ప్రమాదవశాత్తు
## అగ్నిప్రమాదం
### రెండు ఎకరాల చెరుకు తోట దగ్ధం



**మునగపాక, జనవరి 17, మనసులో మాట..**మండలంలో గల మూలపేట గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఎకరాల తోట దగ్ధం అయింది. వరి కుప్పలు నూర్చిన తర్వాత వేరే చెత్తకు అగ్గిపెట్టడంతో అది రాజుకుని వెదజల్లడంతో చెరుకు తోట దగ్ధమైంది. కోయిలాడ పైడ్రాజు, కోయిలాడ శంకరరావు, ఆడారి సత్యనారాయణ, కోయిలాడ చిన్నప్పల్ నాయుడు కు చెందిన చెరుకు తోట ఈ ప్రమాదంలో నష్టపోయిందని రైతులు వాపోతున్నారు.

## హైవేపై రోడ్డు ప్రమాదం.. నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి స్పాట్‌లో మృతి





**కొయ్యూరు, జనవరి 17 (మనసులో మాట):** కొయ్యూరు మండలంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కొయ్యూరు ఎస్ఐ కిషోర్ వర్మ వివరాలు వెల్లడించారు.కొయ్యూరు మండలం రామరాజుపాలెం హైవే రోడ్డుపై శుక్రవారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో పెదమాకవరం గ్రామానికి చెందిన సాగిన రాంబాబు (60) తన స్వగ్రామమైన పెదమాకవరం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా, ఎదురుగా శరభన్నపాలెం నుంచి రామరాజుపాలెం వైపు బైక్‌పై వస్తున్న బోళ్ళ సాయి అతనిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రాంబాబు తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదంలో బైక్ నడిపిన బోళ్ళ సాయి కింద పడిపోవడంతో అతనికి తల, కాలు ప్రాంతాల్లో తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా, మృతుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వివరించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కొయ్యూరు ఎస్ఐ కిషోర్ వర్మ తెలిపారు.

### గణపర్తి గ్రామం లో అంగ రంగవైభవంగా
# నవతరం సంక్రాంతి ఉత్సవాలు





**మునగపాక, జనవరి 17, మనసులో మాట..** మునగపాక మండలం గణపర్తి గ్రామం లో నవతరం సేవా సమితి ఆద్వర్యం లో సంక్రాంతి సంబరాలు చాలా వినోదాత్మకంగా జరిగాయి . మహిళలకి ముగ్గులు పోటీలు, బిందెలు పోటీలు, బెలూన్ పోటీలు, రామంజయేయుల యుద్ధండ్రామా, ఐక్యమత్యమే మహా బలం నాటిక, విద్యార్థిని విద్యార్థులు చేత భరత నాట్యం, డ్యాన్స్ హంగామా కార్యక్రమాలు జరిగాయి. అలాగే నవతరం సేవాసమితి ఆద్వర్యం లో పెట్టిన లక్కీ డీప్ లో గెలుపొందిన వారికి వాషింగ్ మిషన్, సైకిలు, మిక్సి గ్రైండర్, ప్లాష్టిక్ కంటైనర్ లని గ్రామ పెద్దలు ప్రెసిడెంట్చదరంగణేష్ నాయుడు, కర్రిరామ నాగేశ్వర రావు, చదరంఅప్పల నాయుడు, కాళ్ళచంద్ర మోహన్, ఆడారి.గోపీ, మరిశెట్టివెంకటరమణ, కర్రి లక్ష్మి నారాయణ , వెంకట రావు చేతులు మీదుగా అందించడం జరిగింది... అలాగే గణపర్తి శాఖా గ్రంథాలయం మాస్టర్ గా 9 సంత్సరాల పాటు విశేష సేవలు అందించి నందుకు గాను తిమ్మరాజు పేట గ్రామానికి చెందిన దొడ్డి.కోటేశ్వరరావుని దుస్సాలువ తో సత్కరించడం జరిగింది .
ఈ కార్యక్రమంలో నవతరం కుర్రాళ్ళు కె బాల కృష్ణ రమేష్, బొబ్బిలిశంకర్, వీర గణేష్, జగన్నాథం, ఓం సురేష్, కర్రి.మురళీ, సూరిసెట్టి శంకర్, నూకరాజు, గోపద్మ, జగదీష్, పాల్గొన్నారు.

# రామగిరిలో ప్రారంభమైన శ్రీ ధర్మ ఫౌండేషన్ సేవలు
### - భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించిన కర్రి సాయికృష్ణ



**మునగపాక, జనవరి 17, మనసులో మాట..** యలమంచిలి నియోజకవర్గం, మునగపాక మండలం, రామగిరి గ్రామంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన ప్రాచీన శ్రీ రామాలయం ప్రసిద్ధి చెందింది. ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా శ్రీ రాముని తీర్థ మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా, జిల్లా నలుమూలల నుండి వేలాది మంది భక్తులు రామగిరి చేరుకొని కొండపై వెలసి ఉన్న శ్రీ రాముని దర్శించుకుంటారు.
సుదూర ప్రాంతాల నుండి భక్తులు నడుచుకుంటూ వచ్చి, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకునే క్రమంలో తీవ్రమైన దాహంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముందుగానే గ్రహించిన శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణభక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చొరవ చూపారు.
ఈ నేపథ్యంలో, శ్రీ ధర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 85 వాటర్ బస్తాలును ఏర్పాటు చేసి, కొండపైకి వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయాన్ని కల్పించారు. భక్తులు సేదతీరుతూ, ఎటువంటి అసౌకర్యం లేకుండా స్వామివారి దర్శనం చేసుకునేలా ఈ సేవా కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కర్రి సాయికృష్ణ మాట్లాడుతూ, శ్రీ ధర్మ ఫౌండేషన్ అనేది రాజకీయాలకు అతీతంగాప్రజాసేవే ధ్యేయంగా ఏర్పాటు చేయబడిన సంస్థ. అవసరం ఉన్న ప్రతి చోట, ప్రతి ఒక్కరికీ మా ఫౌండేషన్ సేవలు అందాలన్నదే మా లక్ష్యం. అదే ఉద్దేశ్యంతో రామగిరిలో భక్తుల కోసం తాగునీటి సౌకర్యాన్ని కల్పించాము. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని ప్రాంతాల్లో కొనసాగిస్తాంఅని తెలిపారు.
ఈ సేవా కార్యక్రమంలో రామగిరి శ్రీ ధర్మ ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి యువత, పెద్దలు హాజరై, ఫౌండేషన్ సేవలను అభినందించడం విశేషం.

# పండగ పూట పస్తులున్న చక్కెర ఫ్యాక్టరీల కార్మికులు
### కూటమి నేతలు సమాధానం చెప్పాలి!! - భీశెట్టి



**విజయనగరం :(మనసులోమాట) జనవరి 17 :** ఉత్తరాంధ్ర లో అత్యంత కీలకమైన మూత పడ్డ తాండవ,ఏటికొప్పాక,చోడవరం, భీమసింగి, సహకార చక్కెర ఫ్యాక్టరీల కార్మికుల, ఉద్యోగుల కుటుంబాలు సంక్రాంతి పండుగ సందర్భంగా పస్తులతో ఉన్నారని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు.శనివారం జామిలో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ రైతులను, కార్మికులను వారి కుటుంబాలను పట్టించు కోవడంలో ఫ్యాక్టరీల పరిధిలోని ఎమ్మెల్యేలు,జిల్లా ల్లోని మంత్రులు కూటమి నాయకులు విఫలమయ్యారని ఆరోపించారు,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్రప్రదేశ్ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని,స్థానిక ప్రజా ప్రతినిధులను అనేక సందర్భాల్లో కోరామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి లేఖలు రాశామని నేటికీ కనీసం స్పందన లేదని గత ప్రభుత్వం లో ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు,పండుగలో కార్మికులకు,ఉద్యోగులకు వారికి ఇవ్వవలసిన పిఎఫ్, గ్రాట్యుటీ లో కొంత అడ్వాన్స్ ఇచ్చినా పిల్లల తో సంతోషంగా గడిపేవారని తాండవ సుగర్ ఫ్యాక్టరీ 361మంది కార్మికుల కుటుంబాలకు 12 కోట్ల రూపాయలు, ఏటికొప్పాక ఫ్యాక్టరీ 386 మంది కార్మికుల కుటుంబాలకు 13 కోట్ల రూపాయలు, చోడవరం ఫ్యాక్టరీ 341 మంది రూపాయలు పిఎఫ్,గ్రాట్యుటీ లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఒక్క చోడవరం ఫ్యాక్టరీ రైతులకు మాత్రమే 28 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని మిగతా చోట్ల రైతుల బకాయిలు లేవని భీశెట్టి అన్నారు,భీమసింగి సుగర్స్ మూతపడి 5 సంవత్సరాలు అవుతోందని చాలామంది కార్మికులు ఆర్థిక ఇబ్బందుల తో ఆందోళన చెంది చనిపోయారని మూత పడ్డ ఐదు సహకార చక్కెర ఫ్యాక్టరీ ల పై రాష్ట్ర ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకో పోతే కర్మగారాల్లో యంత్రాలు తుప్పుపట్టి పోతున్నాయని అన్నారు, జిల్లా మంత్రి కొండపల్లి, జిల్లా ఎమ్మెల్యేలు భీమసింగి కార్మికుల బకాయిల పై తగిన చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు ఈ సమావేశంలో ఫ్యాక్టరీ కార్మికులు శిరెడ్డి ఎర్నాయుడు, సిరికి వెంకట్రావు,రమణ,భీశెట్టి అధిబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఉత్తర సర్కారుల బాప్టిస్ట్ సంఘముల
# 71వ వార్షికోత్సవ సభలు
## 350 మంది డెలిగేట్స్ హాజరు





**నర్సీపట్నం రూరల్, జనవరి 17, ( మనసులో మాట) :** ఉత్తర సర్కారుల బాప్టిస్ట్ సంఘముల 71 వార్షికోత్సవ మహాసభలను నర్సీపట్నంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చింతపల్లి రోడ్డు లోని ఆంధ్ర బాప్టిస్ట్ క్రైస్ట్ చర్చ్ లో ఈనెల 16 నుండి 18 వరకు మూడు రోజులపాటు అత్యంత వైభవంగా ఈ మహోత్సవములను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రెవరెండ్ డా. మందపల్లి విజయకుమార్ మాట్లాడుతూ, విద్యా, వైద్యం ప్రజలకు ఉచితంగా అందించడం ద్వారానే క్రీస్తు ప్రేమను ప్రకటించవచ్చని పిలుపునిచ్చారు. క్రీస్తు ప్రేమ నిర్వచించలేమని, మనుషులందరి పట్ల క్రీస్తు ప్రేమను, దయను, కనికరమును చూపించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ జి. జోసఫ్ రాజు, ట్రెజరర్ బిజెపి ప్రసాద్ తో పాటు కోర్ కమిటీ సభ్యులు గవర్నింగ్ బాడీ ఎలెక్టెడ్ మెంబర్స్ తదితరులు హాజరయ్యారు. సుమారుగా 135 సంఘాల నుంచి 350 మంది డెలిగేట్స్ హాజరయ్యారు. గత మూడు రోజులుగా సభలో వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ఎనిమిది మంది దేవుని సేవకులుగా శిక్షణ పొందిన వారిని అభిషేకించారు. క్విజ్ పోటీలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. వీరికి స్థానిక సంఘం నుండి ముఖ్య ప్రసంగీకులుగా మిస్ రెవరెండ్ ఎస్ జె అమృతవల్లి, డాక్టర్ రెవరెండ్ రూబేన్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమాన్ని ఆద్యంతం కెనడి ప్రత్యేకించి పర్యవేక్షించారు.



## సాయి అఖండ జ్యోతి దర్శనం...

**కె.కోటపాడు,జనవరి17( మనసులో మాట):** లోక కల్యాణార్థం దేశవ్యాప్తంగా భక్తికాంతి ప్రసరింపచేస్తూ దర్శనమిస్తోన్న అఖండ జ్యోతిని దర్శించుకోవడం మన అదృష్టం అని శ్రీ సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు అన్నారు.గత ఏడాది నవంబర్ 23న శ్రీ సత్య సాయి శత వర్ష జన్మదిన వేడుకలు సందర్భంగా పుట్టపర్తిలో ప్రకాశనంచేసిన పంచ జ్యోతుల్లో ఒకటయిన అఖండజ్యోతి శనివారం మండలానికి చేరుకుంది. కూండ్రపువానిపాలెం శ్రీ సత్య సాయి భజన మండలి భక్తులుభక్తితో స్వాగతం పలికారు. మందిరంలో అఖండ జ్యోతిని భక్తులు దర్శించుకున్నారు.శ్రీ సత్య సాయి సేవా సంస్థల జిల్లా సహ సమన్వయ కర్త కన్నూరు అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కశిరెడ్డి మాట్లాడుతూ పరబ్రహ్మ స్వరూపమైన అఖండజ్యోతి దక్షిణ భారత దేశవ్యాప్తంగా భక్తులకు దర్శనమిచ్చి ఈ ఏడాది నవంబర్ 23వ తేదీన పుట్టపర్తి చేరుతుందన్నారు.శ్రీ సత్యసాయివైభవం, సనాతన ధర్మ, వేదోద్ధారణను ప్రపంచానికి చాటి చెప్పడమే ఈ అఖండ జ్యోతి ఆధ్యాత్మిక ఉద్దేశం అని అప్పలనాయుడు అన్నారు .ఈ కార్యక్రమంలో జోన్-6 ఇంచార్జి రవిశంకర్, భక్తులు పెంటారావు, జగన్నాథం, చెల్లుబాబు, గురన్నాచారి, వరహాలునాయుడు, మల్లేశ్వర రావు, కన్నబాబు, సూరిబాబు, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఉప్పవరం గ్రామంలో
## శ్రీ సీతారాముల తీర్థ ఉత్సవం



**అచ్యుతాపురం మనసులో మాట జనవరి 17:** అచ్యుతాపురం మండలం ఉప్పవరం గ్రామంలో శ్రీ సీతారాముల వారి తీర్థ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కోలాటాలు, భజనలు నిర్వహించడంతో గ్రామం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఉత్సవం వైభవంగా కొనసాగగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తుల కోసం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కూలి శెట్టి సత్తిబాబు, కొలగాని శేషు, చిన్ని రామనాయుడు, చిన్ని సత్తిబాబు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సంబరాలు



విమాడుగుల జనవరి 17.( మనసులో మాట) మాడుగులలో మోదకొండమ్మ శతకం పట్టు వద్ద భారత నిర్మాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు మూడు రోజులపాటు ఘనంగా జరిగాయి. దీంట్లో పిల్లల సంప్రదాయ దుస్తుల ప్రదర్శన. మండల స్థాయి షెడ్యూల్ టోర్నమెంట్. దేశభక్తి పాటల పోటీలు. పిడతల పందెములు. తెలుగులో మాట్లాడటం లాంటి కార్యక్రమాలు విద్యార్థులతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మండల పరిషత్ పాఠశాల(గెడ్డబడి) జిల్లా పరిషత్ బాలికల. బాలుర పాఠశాల విద్యార్థులు. విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు. వీనస్ కోచింగ్ విద్యార్థులు తోపాటు అప్పలరాజు మాస్టర్ విద్యార్థులు మరియు గ్రామంలో చిన్నారులు పాల్గొని నృత్య ప్రదర్శన చేశారు. సంప్రదాయ దుస్తుల పోటీలలో రౌతు వెంకట హర్షిత. గౌరీపట్టపు రాఘవి. పెదపూడి గురు చరణ్ బహుమతులు గెలుచుకున్నారు. షటిల్ టోర్నమెంట్లో 1 బహుమతి ఓమ్మలి. రెండవ బహుమతి జంపెన. మూడో బహుమతి ఓమ్మలి టీం గెలుచు ఉన్నారు. అలాగే బొమ్మిశెట్టి భవ్య. భావన తో పాటు రాజేష్. గీతా శ్రీ. ఎలిసెట్టి తేజ ప్రార్థన గీతాలతో అలరించారు. ఇంకా సారికి జోష్ణభవధారిణి. కొల్లూరు నిత్య షణ్ముఖి. గౌరీపట్టపు రాఘవి. రిహాన్ని ఈ చిన్నారులంతా కూచిపూడి భరతనాట్యం ఫోక్ డాన్స్ లతో అలరించారు. అల్లూరి సీతారామరాజు లగునాటిక ప్రత్యేక ఆకర్షణగా ప్రదర్శించారు , ఇండియా క్రికెటర్ పాంగి కరుణ కుమారి అందుల ప్రపంచ కప్ ఛాంపియన్ ట్రోఫీలో 42 రన్స్ కొట్టి ఇండియా గెలుపుకు కీలక పాత్ర పోషించిన వంట్లమామిడి గ్రామానికి చెందిన పాంగి కరుణ కుమారి తల్లిదండ్రులను మండల వాసు , సంతోషి దంపతులు ఘనంగా సత్కరించారు, పారిశుద్ధ్య కార్మికులకు చిరు సన్మానం చేశారు,ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు.యస్. సూర్యనారాయణ మాస్టర్. కొప్పోజు శ్రీను మాస్టర్. సీతా సతీష్. గొర్లి అప్పలనాయుడు. అప్పల బత్తుల ప్రసాదరావు ఉపాధ్యాయ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులతోపాటు ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు.మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు. సర్పంచ్ యడ్ల కళావతి. ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు.టీడీపీ పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీ నారాయణ,వైసీపీ పట్టణ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు. కొట్యాడ భాస్కరరావు. యడ్ల హేమ కుమార్, పుట్టా గంగయ్య,మామిడి శ్రీను. దంగేటి మోహన్. సిహెచ్ గోవింద్ ,వర్తక సంఘం సభ్యులు, మరియు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.





## అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్, ప్రముఖుల విగ్రహాలను పరిరక్షించుకోవాలి

### టిడిపి నాయకులు...దాడి రత్నాకర్

**అనకాపల్లి టౌన్ జనవరి 17 మనసులో మాట..** పట్టణంలోని మాజీ మంత్రి దాడి వీరభద్ర రావు హయాంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరు మీద ఏర్పాటు చేసిన పలు శాశ్వత కట్టడాలను, విగ్రహాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. జనవరి 18 ఆదివారం ఎన్టీఆర్ 30 వ వర్ధంతి సందర్భంగా రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం యొక్క నిర్వహణ బాధ్యతలు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజ్ చూసుకుంటుందని ఈ విగ్రహం చుట్టూ ఫ్లెక్సీలను గాని, విగ్రహం కనబడకుండా హోర్డింగ్లను గాని ఏర్పాటు చేయవద్దని ప్రజలకు మరియు రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ జంక్షన్ ను మొదట ఎన్టీఆర్ రింగ్ రోడ్ జంక్షన్ గా నామకరణం చేయడం జరిగిందని కానీ ప్రస్తుతం అది వాడుకలోకి రావడం లేదని మరల దాన్ని వాడుకులకు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. పార్టీలకు అతీతంగా ఎవరైనా హోర్డింగ్లను ఏర్పాటు చేస్తే వాటిని వెంటనే తీసివేయడం జరుగుతుందని దయచేసి ఎన్టీఆర్ గారి విగ్రహం చుట్టూ పోస్టర్లు అంటించడం కానీ, బ్యానర్లు కట్టడం గాని, హోర్డింగ్స్ పెట్టడం గాని చేయవద్దన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి ఎదురుగా ఉన్న పోలీసు వారి అవుట్ పోస్టును కూడా వేరే ప్రదేశానికి మాత్రం జరుగుతుందని అన్నారు. అలాగే ఎన్టీఆర్ స్టేడియం వద్ద గల ఎన్టీఆర్ చౌక్ వద్దగల ఎన్టీఆర్ విగ్రహాన్ని మరియు నెహ్రూ చౌక్ వద్ద గల నెహ్రూ గారి విగ్రహాన్ని జీవీఎంసీ అధికారులు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాలి కానీ వారు చేయకపోవడంతో రెండు సంవత్సరాల క్రితం దాడి వీరునాయుడు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ దత్తత తీసుకోవడం జరిగిందని అప్పటినుండి విగ్రహాల చుట్టూ ఎవరు హోల్డింగ్ లు పెట్టిన బ్యానర్లు కట్టిన తీసివేయడం జరుగుతున్నదని అన్నారు. కానీ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన బ్యానర్లు హోల్డింగ్స్ కట్టడం మానడం లేదని దయచేసి ఎవరూ బ్యానర్లవి కట్టడం గాని అంటించడం కానీ చేయవద్దు అని అన్నారు. ఈ విగ్రహం చుట్టూ గల ఐరన్ గ్రిల్స్ మరియు పలకలు నిర్లక్ష్యానికి గురై పాడవడం జరిగిందని వీటి పునర్నిర్మాణం రెండు రోజుల్లో పూర్తి చేస్తామని అన్నారు. ఎన్టీఆర్ ఆసుపత్రి వద్ద గల ఎన్టీఆర్ హాస్పిటల్ ఎల్ఈడి బోర్డు ఆరు నెలల కిందట పాడవడం జరిగిందని దానిని వెంటనే బాగు చేయవలసిందిగా హాస్పిటల్ సూపరిండెండెంట్ వారికి విజ్ఞప్తి చేసిన ఎప్పటి వరకు ఏర్పాటు చేయడం జరగలేదని దానిని కూడా వెంటనే ఏర్పాటు చేస్తామని అన్నారు.

## టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు 30వ వర్ధంతి వేడుకలు



**అచ్యుతాపురం జనవరి 17 మనసులో మాట..** యలమంచిలి నియోజక వర్గంలో అచ్యుతాపురం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ పప్పల చలపతిరావు , రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీ ప్రగడ నాగేశ్వరరావు , నియోజవర్గ పరిశీలకులు శ్రీ బోండా జగన్నాథం , రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ కర్రి సాయి కృష్ణ , రాష్ట్ర కార్యదర్శి శ్రీ రాజాన రమేష్ కుమార్ , రాష్ట్ర కార్యదర్శి మరియు యాదవ కార్పొరేషణ్ డైరెక్టర్ శ్రీ దూళి రంగనాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పప్పల చలపతిరావు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని, ప్రతి గ్రామంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు చేసిన సేవలను స్మరిస్తూ పేద ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు రూపొందించాలని తెలిపారు. ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సృష్టికర్త, ఆంధ్రుల ఆరాధ్య దైవం స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి వేడుకలు ఎలమంచిలి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో నిర్వహించాలని, తెలుగుదేశం పార్టీ విధానాలను మరియు సిద్ధాంతాలను ప్రజలకు వివరించి, స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, రాబోవు రోజుల్లో తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు కార్యాచరణతో ముందుకు వెళుతుందని, స్థానిక ఎన్నికలలో గెలిపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని, కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీలా తులసీరామ్, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లి శివన్నారాయణ మూర్తి, గవర కార్పోరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, మండల ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### దళితులను మనుషుల్లా చూడని

# కూటమి ప్రభుత్వం..

- దళితులపై జరుగుతున్న హత్యాకాండలను ఖండిస్తున్నాం..
- పిన్నెల్లిలో వైసీపీ కార్యకర్త మందా సాల్మన్ హత్యకు నిరసనగా..
- ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ధర్నా



**విజయనగరం, (మనసులోమాట) జనవరి 17:** ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దళితులను మనుషుల్లా చూడడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ ఛైర్పర్సన్, భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపైన, వైసీపీ కార్యకర్తలపై దాడులు చేస్తూ కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలతో చలి కాచుకుంటోందని దుయ్యబట్టారు. పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దళిత కార్యకర్త మందా సాల్మాన్ పై టీడీపీ గుండాలు దాడి చేసి, తీవ్రంగా కొట్టి చంపడాన్ని మజ్జి శ్రీనివాస్ రావు( చిన్న శ్రీను) తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలకు నిరసనగా కలెక్టరేట్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్ నేతృత్వంలో కలెక్టరేట్ వద్ద వైసీపీ శ్రేణులు, దళిత సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. దళితులపై కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులు, హత్యలను వారంతా ఖండిస్తూ నినదించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన ప్రజా స్వామ్య రాజ్యాంగాన్ని కాకుండా మంత్రి నారా లోకేష్ రాసుకున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ దళితులను, వైసీపీ కార్యకర్తలపై దాడులు చేస్తూ హతమారుస్తోందని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ ఛైర్పర్సన్ మజ్జి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ దళిత కార్యకర్త మందా సాల్మన్ పై టీడీపీ గుండాలు దాడి చేసి హతమార్చడం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలకు అద్దం పడుతోందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలోని వైసీపీ కార్యకర్తలు, దళిత సానుభూతిపరులను భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. దాంతో దాదాపు మూడు వందల కుటుంబాలు ఆ గ్రామాన్ని వీడి భయంతో వేరే ప్రాంతాల్లో తలదాచుకునే దుస్థితి కలిగిందన్నారు. భార్యకు అనారోగ్యమని ఊరుకు వచ్చిన వైసీపీ దళిత కార్యకర్త సాల్మన్ పై టీడీపీ గుండాలు రాళ్ళ, ఇనుప రాడ్డులతో దాడులు చేయగా, వైసీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, గురజాల ఇంచార్జ్ కాసు మహేశ్వర రెడ్డి, వైసీపీ నాయకులు ఆయనకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చాలా కృషి చేసినా, గాయాల తీవ్రత వల్ల అతడు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగి ఇన్ని రోజులైనా, దళిత హోం మంత్రిగా ఉన్న ఈ కూటమి ప్రభుత్వంలో ప్రాథమిక విచారణ గానీ, దోషులపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలను భూమ్మీద లేకుండా చేస్తే, వైసీపీ పూర్తిగా లేకుండా పోతోందని కుట్రతో ఈ కూటమి ప్రభుత్వం రెండేళ్లగా దాడులు చేస్తూ, హత్యా కాండలకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తూ పోలీస్, న్యాయ, అధికార వ్యవస్థలను సక్రమంగా పని చేయకుండా ఈ కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దళితులంటే చులకన భావన ఉందన్నారు. గతంలో దళితుల ఇంట ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అంటూ దళితులను హీనంగా చూస్తూ చంద్రబాబు అవహేళన చేశారని మజ్జి శ్రీనివాస్ రావు గుర్తు చేశారు. దళితులంటే మీకు మనుషుల్లా కనిపించట్లేదా చంద్రబాబూ అంటూ ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలోని దళిత ప్రజానీకం, బడుగు బలహీన వర్గాల రాబోయే రోజుల్లో చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజా కోర్టులో మరణ శాసనం రాస్తారని ఉద్ఘాటించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఎక్కడ విఘాతం కలిగించినా, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నా , వెంటనే చర్యలు తీసుకునే వారని గుర్తు చేశారు. ఆయన ఎన్నడూ తారతమ్య బేధాలు చూపకుండా ఈ రాష్ట్రంలో ప్రతి పౌరుడికి రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో పాలన చేశారని అన్నారు. కానీ ఈ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి, అనేక హత్యలు, అరాచకాలతో పాలన సాగిస్తోందని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాస్ రావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొంగ భానుమూర్తి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, జిల్లా బీసీ సెల్ అధ్యకుడు మహంతి జనార్ధన్, జిల్లా ఉపాధ్యక్షుడు పాండ్రంకి సంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శులు వర్రి నరసింహ మూర్తి, గొర్లి రవికుమార్, వైసీపీ నాయకులు పట్నాల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో వైభవంగా 'మకరజ్యోతి' వేడుకలు



**నర్సీపట్నం రూరల్, ( మనసులో మాట) :** స్థానిక శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో మకరజ్యోతి మహోత్సవాలు రెండో రోజు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప స్వామి రథయాత్ర ఐదు రోడ్ల జంక్షన్, కృష్ణ బజార్ మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు కోలాటాల నడుమ కోలాహలంగా సాగింది.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో గౌరవ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు దంపతులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ప్రముఖ సంగీత దర్శకుడు కోటి, గాయకుడు మనో పాల్గొని రథయాత్రలో అయ్యప్ప ఆలయానికి చేరుకున్నారు. స్థానిక స్టేడియంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో కోటి, మనో తమ పాటలతో అలరించారు. అనంతరం వారిని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే యూపీ అడిషనల్ డిఐజి సత్యనారాయణ, సత్యసాయి జిల్లా జేసీ భరద్వాజ్, గాయకుడు ధీరజ్లను కూడా గౌరవించుకున్నారు. తెలుగు మహాసభల విజయవంతమైన నిర్వహణకు గాను స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులను గజల్ శ్రీనివాస్ బృందం గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ.. 1983 నుంచి దివంగత సత్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక వేడుకలు నిరంతరాయంగా జరుగుతున్నాయని గుర్తుచేశారు. ఏటా సంక్రాంతి వేళ స్థానిక కళాకారులను, ఉన్నత స్థాయి అధికారులను సన్మానించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం (జనవరి 16) రాత్రి 'పండు మాస్టర్' కొరియోగ్రఫీలో జబర్దస్త్, ఢీ షో కళాకారులతో 'డాన్స్ బేబీ డాన్స్' కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్ రాజేష్, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర, ఆలయ కమిటీ సభ్యులు, టిడిపి బిజెపి జనసేన నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కారు వలన ఆంధ్రప్రదేశ్ కి 270 ప్రాజెక్టులు

### - మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్



**అనకాపల్లి టౌన్, జనవరి 17 మనసులో మాట :** డబల్ ఇంజిన్ సర్కారు ఉండటం వలన రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందని ప్రధాని నరేంద్ర మోడీ సహాయ సహకార వల్ల దేశంలో ఏ రాష్ట్రశీ లో లేని విధంగా 270 ప్రాజెక్టులను ముఖ్యంగా హైవేలు విమానాశ్రయాలు పోర్టులకు, ప్రాధాన్యత కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రం పురోగతి అభివృద్ధి సాధిస్తుందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు శనివారం పార్లమెంట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కేంద్ర నిర్ణయాలను రాష్ట్రవ్యాప్తంగా హర్షం వ్యక్తం పరుస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 800 ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించుకుంటే దానిలో ఎక్కువ సంఖ్యలు 270 ప్రాజెక్టులకు 1,15,000 కోట్ల నిధులను కేటాయించారని, దీనిలో ప్రధానంగా పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ మంచినీరు సౌకర్యం, అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్, అమరావతి కనెక్టెడ్ హైవేస్, గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, సోలార్ ప్రాజెక్టులు, రాష్ట్రంలో ప్రధానమైన నగరాలకు విమానాశ్రయాలు, షిప్ బిల్డింగులు, పోర్టులు, నౌకలు మరమ్మత్తు సదుపాయాలు, ప్రపంచ వ్యాప్తంగా వివిధ పోర్టులో అమలులో ఉన్న విధానాలను, అక్కడే అత్యుత్తమ విధానాలను ఇక్కడ అమలు చేసే విధంగా అధికారులను పరిశీలన చేయడానికి ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిందని నాగ జగదీష్ అన్నారు. రాష్ట్రంలో తీరప్రాంతాల అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని, దేశంలో ఎక్కడా లేని విధంగా 1054 కిలోమీటర్లు సముద్ర తీర ప్రాంతం ఉండడం దానిని అభివృద్ధి చేయడానికి 15,601 కోట్ల రూపాయలు పెద్ద పెద్ద సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నారని, ఈ తీర ప్రాంతం అభివృద్ధి చేయడానికి మారిటైశీ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఈ మేరకు ఈ రంగంలోని వివిధ సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతుందని ఎంఓయూలు కుదుర్చుకుంటుందని నాగ జగదీష్ అన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో భోగాపురం విమానాశ్రయం పిపిపి పద్ధతిలో శరవేగంగా జిఎంఆర్ సంస్థ అనుకున్న దానికంటే ముందే జూన్ నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తుందని, జూలై నుండి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దీని మూలంగా ఉద్యోగ అవకాశాలు ప్రత్యక్షంగా పరోక్షంగా రాబోతున్నాయని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ బీసీ బోడి వెంకటరావు శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



### మూలపేటలో సందడిగా

## సంక్రాంతి ముగ్గుల పోటీలు

### విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన నేత కాండ్రేగుల గాంధీ

**మునగపాక, జనవరి 17, మనసులో మాట..** మండలంలో గల మూలపేట గ్రామంలో ముక్కనుమ పండుగ సందర్భంగా శాసనసభ్యులు శ్రీ సుందరపు విజయ్ కుమార్ ప్రోత్సాహం తో మూలపేట గ్రామంలో కూటమి నాయకులు కాండ్రేగుల గాంధీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో 1. మొదటి బహుమతి బొడ్డేడ కీర్తి 2. రెండవ బహుమతి టీ. తబిత 3. మూడవ బహుమతి బిశెట్టి వేణిశ్రీ ఇంకా ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ గిఫ్ట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మరియు గ్రామ పెద్దలు,మహిళలు, యువకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

### శ్రీకల్యాణవేంకటేశ్వరాలయం వద్ద

## గోపూజోత్సవం



**విజయనగరరం (మనసులోమాట) జనవరి 18:** కనుమ పర్వదినంసందర్భంగా పట్టణంలోని రింగ్ రోడ్ శ్రీకళ్యామణవేంకటేశ్వరస్వామి ఆలయంప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం శ్రీశ్రీనివాస సేవాసంఘం ఆధ్వర్యంలో గోపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పీసపాటి శ్రీమన్నారాయణాచార్యులు, రఘునాథాచార్యులు భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి గోత్రనామాలతో పూజలలోపాల్గొన్నారు. గోమాతలకు ముమ్మారు ప్రదక్షిణలు చేసారు. అనంతరం గోమాతకు మంగళహారతులుఇచ్చారు. పశుగ్రాసం, బియ్యం, బెల్లం సమర్పించారు.

## తిమ్మరాజుపేటలో పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ

### పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ ఆడారి మంజు



**మునగపాక, జనవరి 17, మనసులో మాట..** ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని తమ జీవితాలను సైతం త్యాగం చేస్తూ నిత్యం పారిశుధ్యములో పరితపిస్తున్న కార్మికులకు తన వంతు సాయంగా ప్రతి సంవత్సరం బట్టలు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు, మాజీ ఎంపీపీ ఆడారి మంజు అన్నారు. మండలంలో గల తిమ్మరాజుపేట గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు తన సొంత నగదుతో బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఏవిఎన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన బిపిఎల్ సీజన్ ఫోర్ క్రికెట్ పోటీలు



**నర్సీపట్నం రూరల్, జనవరి 17, ( మనసులో మాట) :** మున్సిపాలిటీలోని బలిఘట్టంలో ప్రారంభమైన బలిఘట్టం ప్రీమియర్ లీగ్ సీజన్ 4 పోటీలు శనివారం ఘనంగా ముగిసాయి. ఈనెల 10న పట్టణ సీఐ షేక్ గఫూర్, వ్యాపారవేత్త వెలగా నారాయణరావు ఈ పోటీలను ప్రారంభించారు. ముగింపు కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త వెలగా నారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ పోటీలలో సన్ రైజర్స్ టీం మొదటి స్థానంలో నిలవగా, రాయల్ చాలెంజర్స్ జట్టు రన్నర్స్ గా నిలిచింది. అన్ని స్థానాలకు కలిపి మొత్తం రూ. 60వేలు ప్రైజ్ మనీగా నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ రావు మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్న ఈ రోజుల్లో కొంతమంది యువకులు బిపిఎల్ పేరుతో 4ఏళ్ళ క్రిందట ప్రారంభించిన బలిఘట్టం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు యువతలో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా సంఘటిత శక్తిని నింపిందని అభినందించారు. త్వరలో మండల స్థాయి పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విజేతలకు ఆయన ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బలిఘట్టం యువత, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

కోస్తాంధ్ర

| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా |
| --- | --- | --- |
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు |

ఆదివారం 18 జనవరి 2026






# కుటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం

- ▸▸ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రాభివృద్ధిలో భాగం కావాలి
- ▸▸ గత ప్రభుత్వం రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడిదారుల్ని బెదిరించింది
- ▸▸ కూటమి ప్రభుత్వం వేధించదు అండగా ఉంటుంది
- ▸▸ పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు గేమ్ ఛేంజర్
- ▸▸ దేశ కాలుష్యరహిత ఇంధన ప్రయాణంలో కీలక మైలురాయి
- ▸▸ పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రాన్ని అగ్రపథాన నిపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ▸▸ ఆ దిశగా వేసిన బలమైన అడుగు ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ
- ▸▸ ప్రభుత్వాలు మారినా పాలనా విధానాలు స్థిరంగా ఉండాలి
- ▸▸ కాకినాడలో ఏఎం గ్రీన్ వారి గ్రీన్ ఆమ్మోనియా ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్






**కాకినాడ( మనసులో మాట) జనవరి 17..** ప్రభుత్వాలు, పార్టీలు మారినా పరిపాలనా పరమైన విధానాలు మాత్రం స్థిరంగా ఉండాలి. గత పాలకులు రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడిదారులను బెదిరించి, కోర్టుకు ఈడ్చి నానా ఇబ్బందులు పెట్టారుఆరోపించారు. కూటమి ప్రభుత్వం మాత్రం పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపుతుంది. వారికి అండగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని మా ప్రభుత్వం నుంచి పెట్టుబడిదారులకు ఎలాంటి వేధింపులు ఉండవని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం కల్పిస్తున్నామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ని అగ్రగామిగా నిలిపే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కీలక మైలురాయి అని చెప్పారు. శనివారం కాకినాడలోని వాకలపూడిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ తో కలసి ఏఎం గ్రీన్ సంస్థ వారి గ్రీన్ అమ్మోనియా-గ్రీన్ హైడ్రోజన్ కాంప్లెక్స్ కు శంకుస్థాపన చేశారు. గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్లాంట్ నమూనాని పరిశీలించి. యంత్ర పరికరాల పైలాన్ ను ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలం అని గ్రీన్ కో వ్యవస్థాపకులు చలమలశెట్టి అనిల్ నిరూపించారు. అనేక కష్టనష్టాలను తట్టుకుని ఈ రోజున ఏఎం గ్రీన్ కంపెనీ స్థాపించారు. కాకినాడలో 495 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ. 15, 600 కోట్లు పెట్టుబడితో ప్రారంభం అవుతున్న ఈ సంస్థలో 8 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పాదక ఇంధన పెట్టుబడులు రానున్నాయి. 2027 ఏడాది చివరికి తొలి దశ కమిషనింగ్ లక్ష్యంగా, పునరుత్పాదక ఇంధన ఆధారిత శుద్ధ ఇంధన కేంద్రంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోబోతోంది. నిర్మాణ దశలో సుమారు 8,000 మందికి, ఆపరేషన్ దశలో సుమారు 1,500 మందికి ప్రత్యక్ష ఉపాధి, పరోక్షంగా కొన్ని వేల మందికి దీర్ఘకాల ఉపాధి అవకాశాలు సృష్టించే ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వ్యవస్థాపకులు అయిన చలమలశెట్టి అనిల్ కి మహేష్ కి అభినందనలు తెలియజేస్తున్నాను. క్లీన్ ఎనర్జీ పాలసీతో విధానపరమైన స్పష్టత ఇచ్చాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుంది. ఆ ప్రయత్నాల్లో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కీలక అడుగు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని ప్రోత్సహిస్తూ, ఆ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. అందుకు ఏఎం గ్రీన్ ఎనర్జీ ముందుకు రావడం ఆనందదాయకం. ఆ దిశగా కూటమి ప్రభుత్వం వేసిన బలమైన అడుగు ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024. ఈ పాలసీ రాష్ట్రాన్ని భవిష్యత్ పునరుత్పాదక ఇంధన సామర్థ్య కేంద్రంగా, పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి హబ్‌గా తీర్చిదిద్దబోతోంది. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వంటి శుద్ధ ఇంధనాల ఉత్పత్తికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించగలిగితే పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరుగుతుంది. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా ఇప్పటికే కూటమి ప్రభుత్వం విధానపరమైన స్పష్టత ఇచ్చింది. గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం కావాలి. అదే నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ విధానం. క్లీన్ ఎనర్జీ పాలసీని సద్వినియోగం చేసుకుంటూ ఈ రోజు ఏఎం గ్రీన్ సంస్థ మన కాకినాడలో దేశంలోనే మొట్టమొదటి మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. దేశ కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో ఇదో చారిత్రక మైలురాయిగా అభివర్ణించవచ్చు.గ్రీన్ అమ్మోనియా రాష్ట్ర సుస్థిర అభివృద్ధి సాధనలో బలమైన అడుగు ఈ ప్రాజెక్టు పునరుత్పాదక ఇంధన సాయంతో నీటిని ఎలక్ట్రాలిసిస్ చేయడం ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రక్రియలో వాతావరణంలోని కర్బన ఉద్గారాలను పూర్తిగా క్లీన్ చేస్తుంది. పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కీలక అడుగు. ఏఎం గ్రీన్ సంస్థ ఏడాదికి 0.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియా సరఫరా చేసేందుకు జర్మనీకి చెందిన ప్రముఖ ఇంధన సంస్థ యూనిపర్ తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇది భారత దేశం నుంచి యూరోపియన్ దేశాలకు జరుగుతున్న తొలి శుద్ధ ఇంధన ఎగుమతి ఒప్పందం. ఈ చారిత్రాత్మక ఒప్పందానికి ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా ఉండడ మనందరికీ గర్వకారణం. గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు దేశ, రాష్ట్ర సుస్థిర అభివృద్ధి సాధనలో బలమైన అడుగు. వ్యవసాయం నుంచి రవాణా వరకు అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధనకు ఇది ఉపయోగపడుతుంది. రవాణా, పారిశ్రామిక, జల రవాణా రంగాల్లో క్రూడ్ ఆయిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఎరువుల తయారీ, విత్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక రంగాల్లో కర్బన ఉద్గారాలను తగ్గిస్తుంది. క్రూడ్ ఆయిల్ ప్రమేయం లేకుండా ఎరువులు తయారు చేయడం, ఫార్మా, రసాయిన, ప్లాస్టిక్ ఆధారిత పరిశ్రమల్లో ముడి పదార్థంగా గ్రీన్ అమ్మోనియా ఉపయోగపడుతుంది. వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా వాతావరణంలో మార్పులను నిలవరించవచ్చు. ఒక్క సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతను తగ్గించినా బలమైన మార్పు వస్తుంది. ఉప్పాడలో సముద్ర జలాలు ముందుకు వచ్చేస్తున్నాయంటే అందుకు భూతాపం పెరగడమే కారణం. ఇలాంటివి తగ్గించేందుకు ప్రపంచ దేశాలన్నీ క్రూడ్ ఆయిల్ ప్రమేయంలేని గ్రీన్ ఎనర్జీ తయారీకి పెద్దపీట వేస్తున్నాయి. గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది

గ్రీన్ అమోనియా ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి ఎన్నో దీర్ఘకాలిక లాభాలు కలగనున్నాయి. ఇది రాష్ట్రాన్ని విద్యుత్ రంగ సంక్షోభం నుంచి బయటపడేస్తుంది. పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపుతుంది. గత ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు రద్దు చేసి, పునః సమీక్ష పేరిట విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేసింది. కియా లాంటి సంస్థ ప్రతినిధులపై కూడా బహిరంగ బెదిరింపులకు దిగారు. కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో పెట్టుబడిదారులకు సహకరిస్తూ యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తుంద"న్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, కాకినాడ జిల్లా ఉన్నతాధికారులు, ఏఎం గ్రీన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## దళిత యువకుడి హత్యపై వైఎస్ఆర్ సీపీ ఆగ్రహం

- రాజమండ్రి నగరంలోని గోకవరం బస్టాండు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన
- ప్రభుత్వ వైఖరిని ఎండగట్టిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 17:** పల్నాడు జిల్లా పిన్నెల్లిలో దళిత యువకుడు మందా సాల్మన్‌ను పాశవికంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ శనివారం నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ నాయకత్వం వహించారు. ముఖ్య నాయకులుగా మాజీ ఎంపీ మార్గాని భరత్, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణు గోపాల్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిళా రెడ్డి హరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో దళితులకు రక్షణ కరువైందని మండిపడ్డారు. సాల్మన్ హత్య అత్యంత దారుణమని, రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని విమర్శించారు. బాధితుడి కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు దళితులపై జరుగుతున్న దాడులపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నక్కా రాజబాబు, నక్కా నగేష్, నాయకులు దాసి వెంకట్రావు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి అంగాధ సత్య ప్రియ, చీకురుమిల్లి చిన్నా, మోర్తా పావన మూర్తి, పెనుమాక సునీల్, మద్ద దుర్గారావు, కోల్లి వెంకటరత్నం, కాటం రజినీకాంత్, పరిమళ నాని, సుందరపల్లి అనిల్, ముత్యాల జాన్, నక్కా ధనరాజ్, దేవమాత, పల్లెటి చిన్నా, తగరం సోము, కస్సే రాజేష్, తిరగడి దుర్గారావు తదితరులు పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దళితుల హక్కులను కాలరాస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని వారు ఆరోపించారు.

## డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం




**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 17:** కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయంలో దిగిన డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ కి ఆ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ, రాజమహేంద్రవరం జనసేన పార్టీ ఇంచార్జ్ అత్తి సత్యనారాయణ, పలువురు వీర మహిళలు తదితరులు డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికారు.

## వైసీపీ నిర్లక్ష్యం వల్లే నాశనం

వాంబే గృహాల వద్ద కమ్యూనిటీ హాల్ రెనోవేషన్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే వాసు




**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 17:** స్థానిక 45వ డివిజన్ ఆర్ అండ్ బీ వాంబే గృహాల వద్ద ఉన్న కమ్యూనిటీ హాలు రెనోవేషన్ పనులను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరిశీలించారు. స్థానిక నాయకులు, అధికారులకు ఆయన ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడే ఈ కమ్యూనిటీ హాలును గత వైసీపీ పాలకులు నిర్లక్ష్యంగా వదిలేసి నాశనం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడేలా తీర్చి దిద్దుతోందని, ఈ కమ్యూనిటీ హాలు అందుబాటులోకి వస్తే ఇక్కడి ప్రజలు వారి శుభకార్యాలు చేసుకునేందుకు వెసులుబాటుగా ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

## అమ్మా.. చిన్నమ్మా.. ఇదేందమ్మా

- రాజమండ్రి ఇల్లు, కార్యాలయంలో దీపం పెట్టే దిక్కే లేదా?
- పండగ పూటా పురందేశ్వరికి చీరాల మీదే ప్రేమ?..
- ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జేటీ రామారావు





**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 17:** "అమ్మా.. చిన్నమ్మా.. ఇందేదమ్మా.. పేరుకు పార్టీలో పెద్ద నాయకురాలివే కావచ్చు..అభివృద్ధిలో చూస్తే ఆ స్థాయిలో కూడా లేదే"..ఇదమ్మా ప్రజల మనసులో మాట అని వ్యాఖ్యానించారు ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జేటీ రామారావు. రాజమహేంద్రవరం ఎంపీ గా దగ్గుబాటి పురందేశ్వరి పూర్తిగా విఫలమయ్యారని, ఒక్క పరిశ్రమను కూడా తీసుకు రాలేని నిస్సహాయ స్థితిలో ఆమె ఉండటం సిగ్గు చేటన్నారు. రాజమండ్రి ఇల్లు, కార్యాలయంలో దీపం పెట్టే దిక్కు లేదా?..అని సూటిగా ప్రశ్నించారు. రాజకీయాలు, కలెక్షన్లు కోసమే రాజమండ్రి అన్నట్లు ఉందని నగర వాసులు అంటున్నా మీకు వినిపించడం లేదా అని జేటీ రామారావు సూటిగా ఎంపీ పురందేశ్వరి ని ఉద్దేశించి ప్రశ్నించారు. కాకినాడలో ఇంటిగ్రేటెడ్ గ్రీన్ అమ్మోనియా మెగా ప్రాజెక్టు వచ్చి దాదాపు 8వేల మందికి అక్కడ ఉద్యోగావకాశాలు వస్తుంటే.. రాజమండ్రికి మెగా జూ పార్కు తీసుకు వచ్చి 8 మంది వాచ్ మెన్లతో సరా.? అని ప్రశ్నించారు. వలస పక్షులుకు, వలస వచ్చిన నాయకులకు ఒట్లేస్తే ఎం జరుగుతుందో రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గంలో స్పష్టంగా చిన్నమ్మ చక్కలు చూపిస్తున్నారని మండిపడ్డారు. ఆమెను కనీసం రాజకీయంగా విమర్శించడానికి అతిరథ మహారథ నాయకులు ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. తండ్రి పేరు చెప్పుకుని బ్రతుకు తెరువు కోసం మొన్న బాపట్ల, నిన్న వైజాగ్, నేడు రాజమండ్రిలో అమాయక ప్రజలను నమ్మశక్యం కాని హామీలతో మోసం చేసి అధికారం చేజిక్కించుకోవడం సిగ్గుచేటన్నారు. సరే, అవిడ అంత పెద్ద మహా నాయకురాలైతే మొన్న అమలాపురం ఇరుసుమండ బ్లో అవుట్ సమయంలో బాధితులను ఎందుకు పరామర్శ చేయలేదని ప్రశ్నించారు. ఓఎన్జీసీ సేఫ్టీ, ప్రమాద సంఘటనపై ఎందుకు మాట్లాడలేకపోయారని జేటీ రామారావు ప్రశ్నించారు. త్వరలో భారీ భవిష్యత్తు కార్యాచరణతో పోరుబాటకు సిద్ధం కానున్నట్టు జేటీ రామారావు వెల్లడించారు.

## ప్రయాణం జరా భద్రం!

లాలా చెరువు వద్ద జాతీయ రహదారిపై ప్రయాణ భద్రతపై అవగాహన




**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 17:** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని లాలా చెరువు ట్రాఫిక్ జంక్షన్ వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. లాలా చెరువు ట్రాఫిక్ జంక్షన్ వద్ద నున్న సుమారు 200 ఆటో రిక్షాలపై రహదారి భద్రతా అవగాహనా పోస్టర్లను అతికించి తద్వారా రహదారి భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రవాణా అధికారులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సీహెచ్ సంపత్ కుమార్, ఎం రవి కుమార్, జీ రామ్ నారాయణ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు జీ ప్రణీత్ కుమార్, జీ రాధిక దేవి, పీవీవీడీ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# గ్రీన్ హైడ్రోజన్, అమోనియా ఉత్పత్తికి కాకినాడే కేంద్రం

- అనుమతిచ్చిన ఏడాదిలో ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం సంతోషం
- చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లతోనే సాధ్యం
- దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ క్లీన్-గ్రీన్ ఎనర్జీ పాలసీ
- గ్లోబల్ సంస్థలు ఏపీ నుంచి కార్యకలాపాలు నిర్వహించాలి
- విద్యుత్ కొనుగోలు ధరను రూ.1.19 మేర తగ్గించేలా కృషి
- కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టు శంకుస్థాపనలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 17..** గ్రీన్ హైడ్రోజన్-గ్రీన్ అమోనియా ఉత్పత్తికి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ కీలకమైన రాష్ట్రంగా అవతరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టును కాకినాడలో ఏర్పాటు చేయటం సంతోషకరమని అన్నారు. ఈ ప్రాజెక్టుతో కాకినాడవైపు ప్రపంచం మొత్తం చూస్తుందని వ్యాఖ్యానించారు. 2029-30 నాటికి ఏఎమ్ గ్రీన్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అత్యుత్తమంగా మారాలని ఆకాంక్షించారు. శనివారం కాకినాడలో గ్రీన్ కో అనుబంధ సంస్థ ఏమ్ గ్రీన్ ఏర్పాటు చేస్తోన్న గ్రీన్ అమోనియా ప్లాంటుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ప్లాంట్ నమూనాను పరిశీలించారు. 495 ఎకరాల్లో, 2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తోన్న ఈ ప్లాంట్ పూర్తైతే ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల అమోనియా ఉత్పత్తి కానుందని సంస్థ ప్రతినిధులు వివరించారు.

**2027 జూన్‌కు 1.5 ఎం ఎం టి గ్రీన్ అమోనియా ఉత్పత్తి ప్రారంభం**

ఈ ఏడాది సంక్రాంతి పండుగను ప్రజలు అద్భుతంగా జరుపుకున్నారని, ఇదే సమయంలో ప్రపంచం మొత్తం చూసే ఈ ప్లాంట్ శంకుస్థాపన జరగడం సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 30 లక్షల మందికిపైగా ఆంధ్రప్రదేశ్‌లోని తమ స్వస్థలాలకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చారు. హైదరాబాద్ నుంచి 3 లక్షల వాహనాల్లో పండగ కోసం ఏపీకి వచ్చారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా జగ్గన్నతోట ప్రభల తీర్థం ఉత్సవాలు అత్యద్భుతంగా నిర్వహించారు. ఇదే సమయంలో ఏఎం గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రమోటర్లకు అభినందనలు. గత ఏడాది గ్రీన్ అమోనియా ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి ఇచ్చాం. సరిగ్గా ఏడాదిలో కార్యరూపం దాల్చింది. 2027 జూన్ కల్లా గ్రీన్ అమోనియా ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. చరిత్ర తిరగ రాయటం తెలుగువాళ్ల వల్లే సాధ్యం అవుతుంది. కాకినాడ నుంచి జర్మనీకి గ్రీన్ అమోనియా సరఫరా అవుతుంది. గతంలో గ్రే అమోనియా తయారీని నాగార్జునా ఫెర్టిలైజర్స్ చేపట్టింది. ఇప్పుడు అదే ప్రాంతంలో గ్రీన్ అమోనియా తయారు చేసి పర్యావరణహిత ఉత్పత్తులు తయారవుతాయి. పర్యావరణ సమతుల్యత సాధించటమే ప్రస్తుతం ఉన్న లక్ష్యం. అందుకు అనుగుణంగా ప్రణాళికలు జరుగుతున్నాయి' అని సీఎం అన్నారు.

**ప్రధాని మోదీ లక్ష్యాలకు అనుగుణంగా...**

ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆయన నిర్దేశించిన లక్ష్యాన్ని అందిపుచ్చుకుని ఏపీలో 160 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని తయారు చేయాలని నిర్ణయించుకున్నాం. సోలార్ ప్యానెళ్లు ఇళ్లపై ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేస్తూ వినియోగదారులు ప్రోజ్యూమర్లుగా మారారు. ఏపీ తీర ప్రాంతంలో 20 [illegible] రాబోతున్నాయి. సౌర, పవన, జల విద్యుత్, పంప్డ్ స్టోరేజీ లాంటి విద్యుత్ ఉత్పత్తికి, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ఉత్పత్తికి ఏపీ అనుకూలమైన రాష్ట్రం. కాకినాడలో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ద్వారా గ్రీన్ హైడ్రోజన్, అమోనియా, ఇథనాల్, గ్రీన్ మాలిక్యూల్స్ లాంటి ఉత్పత్తులు వస్తాయి. ఇకపై ప్రపంచంలో ఎక్కడైనా సరే గ్రీన్ ఎనర్జీ గురించి చర్చ వస్తే కాకినాడ పేరే వినిపిస్తుంది. గ్రీన్ హైడ్రోజన్, అమోనియా ద్వారా ప్రపంచ పటంలో కాకినాడ నిలుస్తుంది' అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీ క్లీన్-గ్రీన్ ఎనర్జీ పాలసీ దేశంలోనే బెస్ట్..**

'కాకినాడలోనే 2 గిగావాట్ల సామర్థ్యం ఉన్న ఎలక్ట్రొలైజర్స్ తయారీకి ఏఎమ్ గ్రీన్ నిర్ణయించటం అభినందనీయం. ఏపీ క్లీన్, గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీ-2024 దేశంలోనే అత్యుత్తమంగా ఉంది. పారిశ్రామిక రంగానికి అనుకూలమైన విధానాల ద్వారా పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావటమే మా ప్రభుత్వ లక్ష్యం. ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నాం. గ్రీన్ అమోనియా ద్వారా ప్రకృతి సేద్యానికి కూడా ఎంతో ఉపయోగం ఉంటుంది. తద్వారా పర్యావరణానికి మేలు, ప్రజల ఆరోగ్యానికి రక్షణ. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా అభివృద్ధి జరిగి సంపద రావాలి. తద్వారా సంక్షేమం జరగాలి' అని సీఎం అన్నారు.

**ట్రాన్స్ మిషన్ నష్టాలు తగ్గించే ప్రయత్నం..**

దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయి. దీనికి కారణం ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న నమ్మకం. రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు భారాన్ని రూ.1.19 మేర తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే యూనిట్‌కు 29 పైసల మేర కొనుగోలు భారాన్ని తగ్గించాం. ట్రాన్స్ మిషన్ నష్టాలు కూడా తగ్గిస్తాం. విశాఖకు 1 గిగావాట్ సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు గూగుల్ సంస్థ ముందుకు వచ్చింది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, క్వాంటం వంటి రంగాలపై దృష్టి సారించి భవిష్యత్‌కు నాంది పలికాం. ఈ ఏడాదిలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు ప్రారంభం అవుతాయి. రాష్ట్రంలో స్పేస్ టెక్నాలజీ లాంటి సాంకేతికతపై కూడా పెద్ద ఎత్తున పురోగతి సాధిస్తాం. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ నాలెడ్జ్ ఎకానమీకి కేంద్రంగా మారుతుంది. గ్లోబల్ సంస్థలు ఏపీ నుంచి కార్యకలాపాలు నిర్వహించాలని పిలుపునిస్తున్నాను. రాష్ట్రంలోకి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది' అని పెట్టుబడిదారులకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.



## కూటమి రెడ్ బుక్ పై త్వరలోనే సమాధానం చెప్తాం

**ఏలూరు, జనవరి 17 (మనసులో మాట)..** గురజాల నియోజకవర్గ పరిధిలోని పిన్నెల్లి గ్రామంలో, పచ్చముకల దాడిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సాల్మన్ అంత్యక్రియలు జరుపుటకు గ్రామంలోకి తీసుకువెళ్తున్న మృతదేహంనకు,బంధువులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, అనుమతి ఇవ్వకుండా అంత్యక్రియలను అడ్డుకుంటున్న పోలీసు, ప్రభుత్వ, కూటమి నాయకుల, వైఖరికి నిరసనగా, ఈరోజు ఉదయం ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కైకలూరు జు×. మీూా దూలం నాగేశ్వరరావు(ణచీ=) ఏలూరు పాత బస్టాండ్ సెంటర్లో గల డా బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేయడం జరిగింది.అనంతరం డిఎన్ఆర్ మాట్లాడుతూ పచ్చముకల దాడిలో గాయపడి మృతి చెందిన గురజాల నియోజకవర్గ పరిధిలోని పిన్నెల్లి గ్రామనికి చెందిన మందా సాల్మన్ గారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఎన్నికలు అయిన దగ్గర నుండి బెదిరిస్తూ,కేసులు పెడుతూ, కూటమి ప్రభుత్వం అరాచకాలు చేస్తుందని, రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ కొత్త పాలసీని తీసుకొచ్చిందని, పిన్నెల్లి గ్రామంలో ఈ కుటుంబమే కాక చాలా కుటుంబాలు ఇలాంటి స్థితిలో ఉన్నాయని, సాల్మన్ రాజు భార్య అనారోగ్యం కారణంగా ఆమెను చూసేందుకై గ్రామంలోకి వచ్చిన సాల్మన్ రాజు ని ఇనుప రాడ్లతో దాడి చేసి హతమార్చారని, అక్కడ ఉన్న పోలీస్ వారు తిరిగి సాల్మన్ రాజు పై కేసులు పెట్టడం దుశ్చర్యని, అధికారం ఎవరిదైనా వారు చేయవలసింది అభివృద్ధి సంక్షేమని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలని మీరు అమలు చేస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగానికి తప్పనిసరిగా సమాధానం చెప్పాల్సి వస్తుందని, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ఆ కుటుంబంతో మాట్లాడి పరామర్శించారని, ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారని, వారి కుటుంబానికి ఆదుకోనేందుకు 5 లక్షలు అందించారని తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## కోనసీమలో మండువా లోగిల్లును పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తున్నాం

- మంత్రి కందుల దుర్గేష్



**అమలాపురం(మనసులో మాట) జనవరి 17:** కోనసీమ అభివృద్ధితో పాటు ఆ ప్రాంతంలో ఉన్న మండవాలోగిల్లును పర్యాటకంగాఅభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శుక్రవారం అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన తోట లో జరిగిన ప్రభల తీర్థంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగ్గన్నతోట ప్రభలతీర్థానికి రాష్ట్ర పండుగగా హోదా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రబలతీర్థంలో కొలువైన ఏకాదశ రుద్రులను దర్శించుకున్నారు. కోనసీమ అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. కోనసీమ జిల్లాల్లోని మండువా ఇళ్లను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. కోడిపందాలు సంక్రాంతి సంబరాల్లో అంతర్భాగమని ఉత్సవాలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లా జరగాలని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త నవనాసి త్రిమూర్తులకు సన్మానం



**గోకవరం (మనసులో మాట), జనవరి 17:** గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన శివాలయ ధర్మకర్త నవనాసి త్రిమూర్తులను గ్రామ ప్రజలు సన్మానించారు. గ్రామం లో శివాలయ నిర్మాణానికి సంకల్పం చేసిన ఆధ్యాత్మికవేత్త భాగవతోత్తముడు నవనాసి త్రిమూర్తులను గ్రామంలోని పల్లపు వీధి రామాలయం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి సీనియర్ నాయకుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు, బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ వెంకటరెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి కోనా వెంకట సురేష్, విశ్వహిందూ పరిషత్తు ధర్మ ప్రచార విభాగం అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, సమరసిత సేవా ఫౌండేషన్ కార్యకర్తలు మల్లేశ్వరరావు, సాంబశివ, కొరిపిల్లి అప్పలస్వామి తదితర్లు ఆయనను ఘనంగా పూలమాలలతో శాలువాలతో సత్కరించారు. తొలుత భారత మాత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన విశ్వహిందూ పరిషత్ రాజమండ్రి జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆది విష్ణు మాట్లాడుతూ నవనాసి వారి కుటుంబము తరతరాలుగా ధార్మిక మార్గంలో నడుస్తూ ప్రతి సంవత్సరము సంక్రాంతి ముందు రోజు భోగి పర్వదినాన గ్రామంలో ఉన్న కాల భైరవ స్వరూపమైన శునకాలకు బెల్లము నెయ్యి కలిపిన మధుర పదార్థమును వితరణ చేసి పండుగ రోజు మనమే కాదు వీధి శునకాలకు కూడా విందు చేయాలి అని ఆలోచనతో సుమారు 90 సంవత్సరాల నుండి నవనాసి వారి వంశీయులు ప్రతి సంవత్సరం భోగి రోజున వీధి సునకాలకు అన్నదానము చేయడం అనేది వారి యొక్క అపారబభూత దయకు జీవ కారుణ్యానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్తు రాజమండ్రి జిల్లా సత్సంగ ప్రముఖు కొరవటి సత్యనారాయణ, సుంకర త్రిమూర్తులు, శీలం కృష్ణార్జునుడు, కసిరెడ్డి వీరభద్రం, నవనాసి చలపతి, నవనాసి గణపతి, నవనాసి విష్ణు, గంటా చిలకయ్య, దేవలంక పెద్ద కాపు, కాకర శ్రీను, మడకం లక్ష్మణ దొర, సూరపురెడ్డి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు కపీలేశ్వరపురం బాలిక

**కపిలేశ్వరపురం (మనసులో మాట ) జనవరి 17..** జాతీయ స్థాయి లో జరిగే పోటీలకు కపిలేశ్వరపురం విద్యార్థిని ఎంపిక అయింది.ఈ సందర్భంగా శనివారం కపిలేశ్వరపురం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గుజరాత్ లో ఈ నెల 18 నుండి జరిగే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు హెచ్.ఎం. వంగా శ్రీనివాస్ విలేకర్లకు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ జట్టు తరపున ఆడేందుకు కపీలేశ్వరపురం శ్రీ సర్వారాయ ఉన్నత పాఠశాల కి చెందిన 9వ తరగతి విద్యార్థిని కేతిని నవ్యశ్రీ ఎంపిక అయినట్లు హెచ్.ఎం వంగా శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 16 మంది జట్టులో ఒక క్రీడాకారిణిగా నవ్యశ్రీ ఎంపికయిందన్నారు. ఈ సందర్భంగా నవ్యశ్రీని, హ్యాండ్ బాల్లో శిక్షణనిచ్చిన వ్యాయామోపాధ్యాయులు సుమంత్, రవి ని హెచ్ ఎం శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయసిబ్బంది అభినందించారు.జాతీయ స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థిని నవ్యశ్రీ ని పలువురు ప్రజా ప్రతినిధులు,పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది గ్రామస్తులు అభినందించారు.

## సూర్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు

### ఈ నెల 25 ఆదివారం రథసప్తమి

**గోకవరం (మనసులో మాట), జనవరి 17 :** ఈ నెల 25 ఆదివారం రథసప్తమి శుభసందర్భాన్ని పురస్కరించుకుని గోకవరం గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న సూర్య పీఠం ప్రాంగణంలో సౌర హోమం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు సూర్య పీఠం ట్రస్టు తోట సాయిబాబా తెలిపారు. యావన్మంది భక్తులు విచ్చేసి సూర్యనారాయణ స్వామివారి దివ్యానుగ్రహాన్ని పొందాలని సూర్య పీఠం ట్రస్టు సభ్యులు కోరారు.

## రాష్ట్రం కూటమి నాయకుల ఆధ్వర్యంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో పరుగులు తీస్తుంది..

### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్




**కాకినాడ (మనసులో మాట) జనవరి 17..** బారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎనర్జీ రంగంలో పరుగులు తీస్తోందన్నారు. ఇటీవల దేశ ప్రధాని నరేంద్ర మోడి విశాఖపట్నం పర్యటనకు వచ్చి వరల్డ్ లార్జెస్ట్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ను ప్రారంభించారని, ఈ రోజు కాకినాడలో ఎఎం గ్రీన్ సంస్థ గ్రీన్ అమోనియా ప్లాంటును ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఏఎం గ్రీన్ పేరులో ఉన్న ఏఎం పదం నవ ఉదయాన్ని సూచిస్తుందని, సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ ప్రగతిలో ఎఎం గ్రీన్ కొత్త కాంతులు ప్రసరించ నుందన్నారు. గత నాలుగు రోజులుగా పండుగలు జరుపుకుంటున్నామని, పండుగంటే రాక్షసత్వం పై దైవత్వం విజయమని, కార్బన్ ఉద్గారాల రాక్షసిని తరిమి కొట్టేందుకు గ్రీన్ ఎనర్జీ అనే దైవశక్తికి ఎఎం గ్రీన్ సంస్థ పండుగ రోజులలో నాంది పలుకుతోందన్నారు. ఈ గ్రీన్ ఎనర్జీ సునామీలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను, దేశంలోను, భూగోళమంతా వెల్లువెత్తాలని కాంక్షించారు. ఈ శుభ పరిమాణానికి కృషి చేస్తున్న ఎఎం గ్రీన్ వ్యవస్థాపకులు అనిల్ కుమార్, ముఖేశ్ లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఈ సంస్థతో భాగస్వామ్యం అవుతున్న అందరికి అభినందనలు తెలిపారు.

## అధికారుల నిర్లక్ష్యానికి బలైపోతున్న శాటిలైట్ సిటీ అపార్ట్మెంట్లు వాంబే గృహాలు

### -ప్రజల కష్టాలపై బీజేపీ ఘాటైన ప్రశ్న





**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 17:** రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ పరిధిలోని వాంబే గృహాలలో (రాజీవ్ గృహాలు) నివాసితులు దుర్భర పరిస్థితుల్లో నలుగుతున్నారని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆందోళన వ్యక్తం చేసింది. బీజేపీ నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమానికి శాటిలైట్ సిటీ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మట్టా నాగబాబు నేతృత్వంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, మండల నాయకులతో కలసి వాంబే గృహాల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 80 బ్లాకులు, 960 ప్లాట్లతో ఉన్న ఈ శాటిలైట్ సిటీ కాలనీలో అడుగడుగునా సమస్యలే తాండవిస్తున్నాయని బీజేపీ నాయకులు తెలిపారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని ఐదేండ్లు పూర్తిగా విస్మరించడంతో పరిష్కరించలేని స్థితికి సమస్యలు చేరాయన్నారు. బ్లాక్‌ల వెనుక బిల్డింగ్ ల మధ్య దుర్భర వాతావరణం ఉందని, చెత్త పేరుకుపోయి వాటర్ పైపుల నుంచి లీక్ అవుతున్న నీరు కలసి పెద్ద మురుగు కాలువల వలె కనిపిస్తున్నాయన్నారు. భరించలేని దుర్వాసన వచ్చి పూర్తిగా శిథిలావస్థకు చేరి, పరిసరాలు తీవ్రంగా దుర్గంధభరితంగా మారాయని అన్నారు. పైపుల లీకేజీల వల్ల త్రాగునీరు కలుషితం అవుతుండగా, గోదావరి నీటిని సరఫరా చేయాల్సిన అవసరం అత్యవసరంగా ఉందన్నారు. కొన్ని బిల్డింగ్‌ల పునాదుల చుట్టూ గోడలు కూలిపోతూ, మట్టి మురుగు కాలువల్లోకి చేరుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. అనేక బ్లాకుల్లో నివాసాలు ఖాళీ అవుతుండటంతో, అక్కడ సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. అశుభ్రమైన వాతావరణం కారణంగా దోమలు విపరీతంగా పెరిగి, విష జ్వరాలు ప్రబలుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలు పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవారు కావడంతో, తమ సమస్యలను స్వయంగా పరిష్కరించుకునే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రజల కష్టాలను కళ్లారా చూశామని, ఈ దుర్భర పరిస్థితికి బాధ్యులైన అధికారులను నిలదీస్తామని, శాటిలైట్ సిటీ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు బీజేపీ వారికి అండగా నిలుస్తుందని నాయకులు హామీ ఇచ్చారు. ఉన్నత అధికారులు తక్షణమే ఈ ప్రాంతంలో పర్యటన చేయాలని, బిల్డింగ్ ల మధ్య చెత్తా మురుగు తొలగించి సీసీ వర్క్ నిర్వహించాలని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించడం ద్వారా త్రాగునీరు పైప్ లైన్- మురుగు కాల్వలు మెరుగుపరచాలని డిమాండు చేశారు. బిల్డింగ్ లన్నీ ఆధునీకరించాలని, గ్రూప్ హౌస్ మెయింటైనెన్స్ పై హౌసింగ్ బోర్డు అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. పై అన్ని అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మన్నెం శ్రీనివాస్, మజ్జి సాయి, పబ్బిత్ సతీష్, అన్నబత్తుల సాంబయ్య, కర్రి హరి, అత్తిలి సోమేశ్వరరావు, మిర్చని శివకుమార్ తదితర స్థానిక నాయకులు, బీజేపీ మండల జిల్లా నాయకులు పాల్గొన్నారు.




# అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టులు ప్రజాస్వామ్యంపై దాడి

- జర్నలిస్టు డెమోక్రటిక్ రైట్స్ ఫోరం (జేడీఆర్ఎఫ్) తీవ్ర ఖండన
- ఎన్టీవీ జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలి
- జేడీఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 17:** జర్నలిస్టులపై తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాలను జర్నలిస్టు డెమోక్రటిక్ రైట్స్ ఫోరం (జేడీఆర్ఎఫ్) తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఫోరం ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో జర్నలిజం నాలుగవ స్తంభమని, అలాంటి జర్నలిస్టులను ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా, అర్ధరాత్రి వేళ తీవ్రవాదుల్లా అరెస్టు చేయటం రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధమని అన్నారు. మహిళా ఐఏఎస్ అధికారి, మంత్రి సంబంధిత వార్త వ్యవహారంలో సిట్ విచారణ ఇంకా కొనసాగుతున్న దశలోనే ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్లు పరిపూర్ణ చారి, సుధీర్లను అరెస్ట్ చేయటం దురదృష్టకరమన్నారు. ఐదు రోజుల క్రితం ప్రసారమైన కథనంపై ఇప్పటికే ఎన్టీవీ యాజమాన్యం క్షమాపణలు కూడా తెలిపినప్పటికీ, ఆ తర్వాత కూడా జర్నలిస్టులపై కఠిన చర్యలకు దిగడం ప్రభుత్వ దురుద్దేశాన్ని స్పష్టంగా చూపుతోందని అన్నారు. "సిట్‌పై నిజంగా నమ్మకం ఉంటే, విచారణ పూర్తయ్యాకే చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి. ముందస్తు అరెస్టులు మీడియా స్వేచ్ఛను హరించడమే" అని ఆయన వ్యాఖ్యానించారు. నిరాధారమైన లేదా అసత్య కథనాలపై ఖండన కోరుకోవడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం ప్రతి పౌరుడి హక్కేనని, కానీ అర్ధరాత్రి అరెస్టులు, కుటుంబ సభ్యుల ముందే పోలీసు దాడులు మీడియాను భయపెట్టే ప్రయత్నంగా మాత్రమే భావించాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీవీ జర్నలిస్టులు ముగ్గురూ సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ జర్నలిస్టులని, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో వారి పాత్ర ప్రశంసనీయమన్నారు. అలాంటి వారిని నేరస్థులుగా చూపడం సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతాయని హెచ్చరించారు. ఈ తరహా చర్యలు కొనసాగితే రేపు ప్రజలకు నిజం చెప్పే ప్రతి గొంతు ప్రమాదంలో పడే పరిస్థితి వస్తుందని జేడీఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు.

**జేడూఆర్ఎఫ్ డిమాండ్లు..**

ఎన్టీవీ జర్నలిస్టులు దొంతు రమేష్, పరిపూర్ణాచారి, సుధీర్‌లను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని, జర్నలిస్టులపై అర్ధరాత్రి అరెస్టుల సంస్కృతిని వెంటనే నిలిపివేయాలని, మీడియా స్వేచ్ఛకు, జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని మేడా డిమాండు చేశారు. సిట్ విచారణను పారదర్శకంగా, రాజకీయ ఒత్తిడులు లేకుండా కొనసాగించాలని, మీడియా స్వేచ్ఛను అణిచే ఏ ప్రయత్నాన్నైనా దేశ వ్యాప్తంగా తోటి జర్నలిస్టుల సంఘాలతో కలిసి తీవ్రంగా ఎదుర్కొంటామని జర్నలిస్టు డెమోక్రటిక్ రైట్స్ ఫోరం (జేడీఆర్ఎఫ్) స్పష్టం చేసింది.

## ఆదిత్య లో 23 న వసంత పంచమి అక్షరాభ్యాసం

**గండేపల్లి (మనసులో మాట)జనవరి 17..** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో శు క్రవారం అనగా 23 వ తేదీన వసంత పంచమి (సరస్వతీ దేవి జన్మదినోత్సవం) సందర్భంగా ఆదిత్య విశ్వవిద్యాలయం సూరంపాలెం లో కొలువై యున్న శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయ ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించబడును. యావన్మంది భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు పెండ్యాల చక్రవర్తి 7731886664 సంప్రదించగలరు.

# రౌతులపూడి ఎస్ఐ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



**రౌతులపూడి, (మనసులో మాట )జనవరి 17:** మండలంలోని రాఘవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని సార్లంకపల్లె గ్రామంలో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో బాధితులకు ఎటువంటి ప్రాణనష్టం కలగకుండా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేసిన రౌతులపూడి సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని ప్రత్తిపాడు నియోజకవర్గం శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఎస్సై వెంకటేశ్వరరావుకు దుస్సాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వరుపుల సత్య ప్రభ మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంఘటనలో ఎటువంటి ప్రాణనష్టం కలగకుండా ఎస్సై వెంకటేశ్వరరావు చేసిన సేవలు అమోఘమని సత్య ప్రభ అన్నారు. ఈ సంఘటనలో సేవలు అందించిన రౌతులపూడి తాసిల్దార్ ఎస్వి నరేష్ ను కత్తిపూడి బుజ్జి సీతమ్మ సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి ను దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రౌతులపూడి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తమరాల సత్యనారాయణ, రౌతులపూడి మండల అధ్యక్షురాలు గంటి మల్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇత్తంశెట్టి భాస్కర్ బాబు, రౌతులపూడి మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పైల వేణుగోపాల్, ఇటంశెట్టి అశోక్, సీనియర్ నాయకులు యాళ్ల జగదీష్, జట్ల రాజా, కత్తిపూడి బుచ్చి సీతమ్మ సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుంచి జిల్లాలో పశు ఆరోగ్య శిబిరాలు

- గోడ ప్రతులను ఆవిష్కరించిన ఇంచార్జి కలెక్టర్ మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 17:** పశువుల ఆరోగ్య పరిరక్షణ, ఉత్పాదకత పెంపు, వ్యాధుల నివారణ లక్ష్యంగా నేటి (ఆదివారం) నుండి ఈ నెల 31వ తేదీ వరకు జిల్లాలోని పశుపాలక రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినట్లు తూర్పు గోదావరి ఇంచార్జి జిల్లా కలెక్టర్ (ఎఫ్ఏసీ), జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన 'పశు ఆరోగ్య శిబిరాలు' ప్రత్యేక ప్రచార గోడ ప్రతులను శనివారం రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మేఘా స్వరూప్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామ స్థాయిలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పశుపాలక రైతుల పశువులు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ శిబిరాల్లో పాలిచ్చే పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ (పురుగు మందుల పంపిణీ), గొర్రెల మశూచి టీకాలు, కోళ్లకు, బాతులకు టీకాలు వేయడం, అలాగే ఉచిత పశు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పశువుల ఆరోగ్యం మెరుగుపడి రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ టీ శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉదయం 8 గంటల నుండి పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. పశుపాలక రైతులు తమ పశువులను శిబిరాలకు తీసుకొచ్చి ఉచిత పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఓ ఎల్ అప్పలకొండ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ టీ శ్రీనివాస రావు, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ కే సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మాణిక్యాలరావు కుటుంబానికి
# రూ.50వేలు తక్షణ ఆర్థిక సహాయం

- టీడీపీ సీనియర్ నేత పారోజు మాణిక్యాలరావు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ పాడె మోసిన ఎమ్మెల్యే గోరంట్ల






**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 17:** రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పారోజూ మాణిక్యాలరావు ఆకస్మిక మృతి పట్ల రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాణిక్యాలరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, భౌతిక కాయానికి పూలమాలతో నివాళులు అర్పించి, అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. తెలుగుదేశం పార్టీకి అనేక సేవలు అందించిన మాణిక్యాలరావు ఆకస్మికంగా మృతి చెందటం చాలా బాధాకరమని, తక్షణ ఆర్థిక సహాయంగా ఆ కుటుంబానికి రూ. 50 వేలు సహాయాన్ని అందిస్తానని గోరంట్ల తెలిపారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం మంజూరు చేసే ఇల్లుతో పాటు పార్టీ నుండి ఆర్థిక సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గోరంట్ల తోపాటు మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, పుక్కళ్ల రాజు, ఆళ్ల ఆనందరావు తదితర నాయకులు ఉన్నారు.

# మహా నేత జ్యోతిబసు 16వ వర్ధంతి

- లండన్ లో ఉన్నత చదువులు చదివి కష్టాజీవుల శ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేసిన జ్యోతిబసు
- సి పి ఎం సీనియర్ నేత దువ్వ శేష బాబ్జి




**కాకినాడ (మనసులో మాట) జనవరి 17..** మహానేత కామ్రేడ్ జ్యోతిబసు 16వ వర్ధంతి సందర్భంగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య భవన్లో ఘనంగా నివాళు లర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి బేబీ రాణి, నగర కమిటీ సభ్యుడు కె సత్తిరాజులు ముందుగా జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సీనియర్ నేత దువ్వ శేష బాబ్జి మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో జన్మించి, లండన్లో విద్యను అభ్యసించిన జ్యోతిబసు కష్టజీవుల శ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. 1977 నుంచి 2000 వరకు విరామం లేకుండా 23 సంవత్సరాలు పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సేవలందించి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఏర్పడిన వామపక్ష ప్రభుత్వం భూసంస్కరణలు అమలు చేసి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిందన్నారు. సిఐటియు నేత జి బేబిరాణి మాట్లాడుతూ జ్యోతిబసు నిర్మించిన కార్మికోద్యమ స్ఫూర్తితో నేడు కార్మిక వర్గానికి ప్రమాదంగా ఉన్న లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఉద్యమం సాగించాలన్నారు. ఫిబ్రవరి 12వ తేదీన జరగబోతున్న సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం రాజశేఖర్, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలకా వెంకటరమణ, కె నాగజ్యోతి, నాగాబత్తుల సూర్యనారాయణలతోపాటు మేడిశెట్టి వెంకటరమణ, ఎం హరినాథ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ కోసం ప్రత్యేక
# 'డిజిటల్ పోర్టల్' ఏర్పాటు : జిల్లా కలెక్టర్





**అమలాపురం(మనసులో మాట) జనవరి 17..** ప్రస్తుత విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో పూర్వ విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అన్నారు. శనివారం మామిడి కుదురు శ్రీ గోకరాజు గణాధిపతి మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 1988 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగకు పూర్వ విద్యార్థులు తమ స్వగ్రామాలకు చేరుకునే సందర్భంలో ఇలాంటి సమ్మేళనాలు నిర్వహించడం ద్వారా వారి అనుభవాధారిత కెరీర్ ప్రణాళికలను ప్రస్తుత విద్యార్థులకు తెలియజేసి ప్రేరణ కల్పించవచ్చన్నారు.

కెరీర్ డెవలప్‌మెంట్ కోసం కరపత్రాలు, డిజిటల్ పోర్టల్‌ల నిర్వహణ ద్వారా విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 1988 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సీఎస్ఆర్ నిధుల సహకారంతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌లను జిల్లా కలెక్టర్ పూర్వ విద్యార్థులతో కలిసి ప్రారంభించారు.

భవిష్యత్ కెరీర్‌ను రూపుదిద్దుకున్న పూర్వ విద్యార్థులు ఇక్కడి నుంచి ప్రపంచవ్యాప్తంగా విజయాలు సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకొని ప్రస్తుత విద్యార్థులు తమ ఆసక్తి ఉన్న రంగాల్లో దశలవారీగా అభివృద్ధి సాధించాలని కోరారు. కెరీర్ డెవలప్‌మెంట్ ప్లాన్ లేకుండా ఉన్నత లక్ష్యాలు సాధ్యం కావని తెలిపారు.

పూర్వ విద్యార్థులు తమ అనుభవాధారిత కెరీర్ ప్రయాణాన్ని ఒక సమగ్ర పోర్టల్ ద్వారా పంచుకోవడం అభినందనీయమని, ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి స్పష్టమైన లక్ష్యాలను ఏ ం ్ ర ం ్ చ ్ డ ్ ం ల ో దోహదపడుతుందన్నారు. కెరీర్ డెవలప్‌మెంట్ అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల అభివృద్ధి, బాధ్యతాయుత పౌరులుగా ఎదగడం కూడా అని పేర్కొన్నారు. విద్యార్థులు తమ బలాలు, బలహీనతలు, ఆసక్తులను స్వీయ మూల్యాంకనం చేసుకుని వ్యవసాయం, సాంకేతికత, పరిపాలన వంటి రంగాల్లో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ సాధనాలు, భాషా నైపుణ్యాలు, కమ్యూనికేషన్‌లో ప్రావీణ్యం సాధించాలని అన్నారు. వ్యవసాయ ఆధునీకరణలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆన్‌లైన్ కోర్సులు, వర్క్‌షాప్‌లు ద్వారా భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ముందుగా లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రభుత్వ పరీక్షలు, స్కాలర్‌షిప్‌లు, ఇంటర్న్‌షిప్‌ల కోసం ప్రయత్నించాలని తెలిపారు. వైఫల్యాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని, ప్రభుత్వం విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి నవీన్ మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులే నిజమైన ప్రేరణ అని, వారి అనుభవాలు ప్రస్తుత విద్యార్థుల కలలకు దారి చూపుతాయని అన్నారు. డిజిటల్ యుగంలో కెరీర్ డెవలప్‌మెంట్ సాంకేతికతతో కలిసి సాగాలని, ఈ పోర్టల్ పూర్వ మరియు ప్రస్తుత విద్యార్థుల మధ్య బలమైన బ్రిడ్జ్‌గా పనిచేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఈవో పి. నాగేశ్వర రావు, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. మమ్మీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి, 1988 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పాలమడుగు గ్రామంలో
# క్రీడా పోటీలు ప్రారంభం

**ఎటపాక, ( మనసులో మాట ) జనవరి 17:** పోలవరం(రంపచోడవరం )జిల్లా ఎటపాక మండలం పాలమడుగు గ్రామ పరిధిలో పర్షిక వైశాలి జ్ఞాపకార్థంగా క్రీడా పోటీలు వాలీబాల్ మరియు ఆర్చరీ లను వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు బొల్ల పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర నాయకులు మువ్వా శ్రీనివాస్,ఏటిఏ మండల అధ్యక్షుడు కాకరాజు ,అపక రమేష్ ( పీడీ) శనివారం క్రీడా పోటీలను ప్రారంభించారు. ముందుగా మీడియం సురేష్ అధ్యక్షతన వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించరు. అనంతరం అపక రమేష్ క్రీడలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడలలో ముందుండాలని సూచించారు. ఏ టీ ఏ మండల అధ్యక్షులు కాకరాజు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ఆరోగ్యాన్ని కలిగిస్తాయని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడలు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఈటి లక్ష్మణ్, సవలం ముత్తయ్య,సోంది రమేష్, వెంకటేష్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# హరిదాసులను గౌరవించాలి

- హరిదాసలను సత్కరిస్తున్న సురేష్ శర్మ సతీష్ బ్రదర్స్



**అనపర్తి (మనసులో మాట) జనవరి 17:** సంక్రాంతి నెల ప్రారంభం నుండి సంక్రాతి పండుగ వరకు నెల అంతా ప్రతిరోజు తెల్లవారుజామున హరినామ కీర్తనలు చేసే, హరిదాసులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అనపర్తి సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రెడ్డి సురేష్ శర్మ అన్నారు. నెల రోజులు గ్రామం అంతా సంచారం చేసిన ఇద్దరు హరిదాసులను, శనివారం నాడు సమితి ఆధ్వర్యంలో సురేష్ శర్మ బ్రదర్స్ నూతన వస్త్రాలు స్వయంపాకం దక్షిణ తాంబూలాలతో ఘనంగా సత్కరించారు.

# హెల్పింగ్ హ్యాండ్స్ ఉప్పలపాడు యువత సేవలు

-ఫౌండర్ సత్తి సోమరాజు



**గండేపల్లి (మనసులో మాట). జనవరి 17..** గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో సత్తి సోమరాజు ఆర్పిఎఫ్ విశ్రాంతి రైల్వే ఉద్యోగి,ఉద్యోగశీలో ఉండగా పబ్లిక్ హాలిడేస్ లో డ్యూటీలో ఉన్నరోజులకు అదనంగా జనవరి నెలలో వచ్చే సెలవు వేతనం డబ్బులను తను పుట్టిన ఉప్పలపాడు గ్రామంలో వృద్ధులకు,వికలాంగులకు, వితంతువులకు సంక్రాంతి పండుగ రోజున కొత్త బట్టలు,స్వీటు ఇచ్చి వారితో పండుగ సంతోషాన్ని పంచుకుంటున్నారు. ఈసందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ సత్తి సోమరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమం 2010 నుంచి సుమారు17 సంవత్సరాల నుండి నిరాటశీకముగా కొనసాగిస్తున్నామని ఇందుకు డబ్బులు రూపంలో, సేవరూపంలో,ఉద్యోగస్తులు సేవా భావం గల పెద్దల సహకారంతో గ్రామంలోవృద్ధులు,వికలాంగులు,పేదవారు మరియు వితంతువులకు కొత్త బట్టలు,అరకేజీ స్వీట్ బాక్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వారిని పేదలుగా కాకుండా మా ఆత్మీయులుగా భావించి వారి ఆశీర్వాదం పొందుతూ సంక్రాంతి పండుగ సంతోషాన్ని వీరితో పంచుకుంటున్నామని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో సిరిదేళ్ళ శ్రీనివాస్,పి శ్రీను,యస్ కిరణ్,రమేష్,కె గోవింద్,పి చంటి,ప్రసాద్,ఎస్ కె తాతాజీ,ఆలీ,పీవి ప్రసాద్,దాసరి వెంకటేష్,పి శ్రీను ల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

# కన్నుల పండుగ గా ప్రభల తీర్థం



**కపిలేశ్వరపురం (మనసులో మాట) జనవరి 17..** కపిలేశ్వరపురం శివారు శ్రీరామాపురం గ్రామం శనివారం ప్రభల తీర్థం ఘనంగా జరిగింది. పరిసర గ్రామాల కోరుమిల్లి, మాచర, కపిలేశ్వరపురం తదితర గ్రామాలనుండి ఆయా గ్రామాల నుండి పట్టు దారాల పోగులతో ప్రభలను సుందరం గా తీర్చి దిద్ది వాటిపై శ్రీ దుర్గా మత, పార్వతీ మాతా సమేత ఆగస్తేస్వర, పాప వినాసేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రతిష్టించి బాజా భజన్త్రీతీలు, మేళతాలాలతో గ్రామాల్లో ఊరేగింపు గా తరలి శ్రీరామపురం ప్రభలు తరలివెళ్లాయి. వాటిని దర్శించేందుకు పరిసర గ్రామాలైన అంగర, టేకి, కోరుమిల్లి, కపిలేశ్వరపురం, తాతపూడి, వెదురుమూడి, వల్లూరు నల్లూరు, పడమర ఖండ్రిక, నేలటూరు తదితర గ్రామాల నుండి వండలాది గా భక్తులు కుటుంబ సమేతం గా తరలివచ్చి ఉత్సవ మూర్తులను దర్శించి, పూజలు జరిపించుకున్నారు. ఆయా ఆలయాల పాలకమండలి సభ్యులు, ఆలయాల అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## ఖతార్ దేశంలో ఇబ్బందులు పడుతున్న మహిళను స్వదేశానికి రప్పించిన కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం(మనసులో మాట) జనవరి 17:** ఖతార్ దేశంలో ఒక బాబా ఇంటిలో పనిచేస్తుండగా కింద పడి కాలు కి దెబ్బతగిలి పనిచేయలేక నరకయాతన పడిన ఒక మహిళను కలెక్టర్ ఆమెను స్వదేశానికి రప్పించారు.వివరాల్లోకి వెళితే ఉప్పలగుప్తం మండలం పేరాయిచెరువు గ్రామానికి చెందిన పి.వెంకటలక్ష్మి అనే మహిళ గత సంవత్సరం జులై నెలలో ఖతార్ దేశం వెళ్ళింది. అక్కడ ఒక బాబా ఇంటిలో పనికి కుదిరి అక్కడ పనిచేస్తుండగా కాలు జారి పడిపోయింది. కాలికి బలమైన గాయం తగలడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొం టుందని, పని చేయలేక పోతుందని అక్కడ ఇంటి యజమానులు పని చేయక పోతే కుదరదు అని వారు బలవతంగా పనిచేయిస్తూ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని కనీసం వాళ్ళు హాస్పిటల్ కూడా తీసుకుని వెళ్లడం లేదని తన సోదరుడు కృష్ణమూర్తికి పోను ద్వారా చెప్పగా అతను జిల్లా కలెక్టర్ దృష్టికి తన సోదరి ఇబ్బందులు తెలియపరిచాడు. కలెక్టర్ సూచనల మేరకు కృష్ణమూర్తి కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ఆశ్రయించి జరిగిన విషయాన్ని చెప్పడం జరిగింది.దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ బృందం అక్కడ ఏజెంట్ కుటుంబ సభ్యుల సహకారంతో ఆమెను తిరిగి రప్పించే ఏర్పాట్లు చేపట్టి స్వదేశానికి సురక్షితంగా చేర్చడం జరిగిందని నోడల్ అధికారి మరియు డిఆర్ఓ కే మా ధవి సమన్వయ అధికారి గోళ్ళ రమేష్ తెలిపారు.

## సుంకరపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మ వారికి కుంభం సమర్పణ

**తాళ్ళరేవు మనసులో మాట జనవరి 17:** మండల పరిధిలోని సుంకరపాలెం గ్రామంలో కొలువై ఉన్న గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి అమ్మవారికి బొబ్బిలి సత్యనారాయణ



ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుంభం ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రజలు, రైతులు పాడి పంటలతో, ఆరోగ్యంతో సుభిక్షంగా ఉండాలని ఆరోగ్యంతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి కుంభం నైవేద్యంగా సమర్పించామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర సీతారామ మూర్తి, సుంకర మురళి, సుంకర రామచంద్రరావు, గుంటముక్కల సూరిబాబు, చిక్కం హనుమంతరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

**పిఠాపురం, (మనసులో మాట) జనవరి 17 :** రామచంద్రపురంలో ఈనెల 22, 23 తేదీలలో నిర్వహించనున్న 'సీనియర్ రాష్ట్ర స్థాయి 3/3 విభాగం లో బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్'లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక ఈనెల 19వ తేదీన జరుగుతుందని జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జ మాణిక్యాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ రామచంద్రపురంలోని బాస్కెట్ బాల్ గ్రౌండ్ వేదికగా ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు నిర్ణీత సమయానికి గ్రౌండ్ వద్ద హాజరుకావాలని కోరారు. నిబంధనల ప్రకారం, ప్రతి క్లబ్ నుండి నలుగురు క్రీడాకారులకు మాత్రమే ఎంపికలో పాల్గొనే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన వివరించారు.

## అమలాపురంలో జాబ్ మేళా

**అమలాపురం(మనసులో మాట) జనవరి 17..** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద ఈ నెల 21న జాబ్ మేళా నిర్వహించబడునని జిల్లా ఉపాధి అధికారి ఈ వసంతలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగులు ఈ జాబ్ మేళాలో పాల్గొని వివిధ కంపెనీల్లో ఉద్యోగం సంపాదించుకోవచ్చు అని ఆమె సూచించారు. ఎస్ఎస్ సి ఇంటర్, ఐటిఐ, డిప్లమో, ఫార్మసీ డిగ్రీ తదితర కోర్సులు చదివిన నిరుద్యోగులకు అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. తమ సర్టిఫికెట్లు బయోడేటా జిరాక్స్ కాపీల తో జాబ్ మేలాలో పాల్గొనాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 89789050 32 నెంబర్లో సంప్రదించగలరని ఆమె సూచించారు.

# ఎన్టీఆర్ కు ఘన నివాళి

### -బొమ్మూరు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఘనంగా వర్ధంతి కార్యక్రమం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 17:** రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో పద్మశ్రీ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉప కులపతి ఆచార్య మునిరత్నం నాయుడు అధ్యక్షత వహించి సమర్ధవంతంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడెమీ డైరెక్టర్ జీవీ రమణ (రాకా), సంగీత కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శర్మ, రాకా సాంస్కృతిక సంస్థ కోశాధికారి సూరపురెడ్డి తాతరావు, గోదావరి కల్చరల్ అసోసియేషన్ కార్యాధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఉప కులపతి ఆచార్య మునిరత్నం నాయుడు అధ్యక్షోపన్యాసం చేస్తూ నందమూరి తారక రామారావు యుగ పురుషుడని, తెలుగు భాషకు సాహిత్యానికి చరిత్ర పరిరక్షణకు విశేష కృషి చేశారన్నారు. ఇటువంటి మహానుభావులు నూటికో కోటికో ఒకరు పుడతారన్నారు. ఎన్టీఆర్ ఆలోచనల నుంచే ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు విశ్వ విద్యాలయం స్థాపించబడిందని గుర్తు చేశారు. తెలుగు భాష పరిరక్షణకు ఎన్టీఆర్ చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏపీ తెలుగు విశ్వ విద్యాలయం మొట్ట మొదటి వైస్ ఛాన్సలర్ గా నియమించిన తీరును వివరించారు. ఈ విశ్వ విద్యాలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు. త్వరలో పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని ఉప కులపతి మునిరత్నం నాయుడు తెలియజేశారు. అనంతరం సంగీత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ కళలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారని, గారు తన గురువైన వెంపటి చిన్న సత్యాన్ని జ్ఞాపకం చేసుకుంటూ నర్తన శాల చిత్రంలో నృత్య భంగిమలు వారి వద్ద ఎన్టీఆర్ నేర్చుకున్నారని గుర్తు చేశారు. సూరపరెడ్డి తాతరావు మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేశారని, అందులో ముఖ్యంగా కిలో బియ్యం రెండు రూపాయల పథకం చాలా ఆదరణ పొందిందన్నారు. అలాగే ఎంతో మంది అట్టడుగు వర్గాలకు రాజకీయ భిక్ష పెట్టారని గుర్తు చేశారు. యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ రాముడు, కృష్ణుడు, దుర్యోధనుడు, కర్ణుడు లాంటి ప్రతిష్ఠాత్మకమైన పాత్రలు వేసి తెలుగు ప్రజల హృదయాలలో ఎన్టీఆర్ సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. తన చిత్రాలలో సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక విభిన్నమైన పాత్రలు వేశారని, ఆయన కారణజన్ముడని కొనియాడారు. గౌరవ అతిథిగా విచ్చేసిన జీవీ రమణ మాట్లాడుతూ తెలుగు భాషకు ఎనలేని సేవ చేస్తూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగు గౌరవాన్ని, తెలుగు సంస్కృతిని, తెలుగు సాహిత్యాన్ని పరిచయం చేసిన మహా మనిషి ఎన్టీఆర్ అని నివాళులర్పించారు. ఆనాటి ప్రతి ప్రభుత్వ సభలూ సమావేశాల్లో శంకరంబాడి సుందరాచార్యులు రచించిన "మా తెలుగు తల్లికి మల్లె పూదండ" గేయాన్ని సభ ప్రారంభంలో ప్రార్థనా గీతంగా పాడాలని ప్రభుత్వ ఆదేశాలు ఇచ్చిన మొట్ట మొదటి వ్యక్తి ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. రాష్ట్రంలో అనేక విపత్తులు సంభవించినప్పుడు నేనున్నానంటూ సినిమా ప్రపంచాన్ని తన వెంట తీసుకుని వచ్చి విరాళాలు సేకరించి ఇతోధికంగా తమ వంతు ప్రభుత్వానికి, ప్రజలకు ఎప్పటికప్పుడు సహకరించే వారన్నారు. ఆనాడు ప్రజాసేవలో కళాత్మక సేవలు, అనేక మంచి పనులు చేసినందుకు ఆనాడే కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సముచిత రీతిన సత్కరించిందన్నారు. ఒక మహోన్నతమైన వ్యక్తిగా ఆదర్శవంతుడిగా, నటనలో క్రమశిక్షణ పాటించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ కు "భారతరత్న" అవార్డు ప్రకటించాలని, ప్రకటిస్తుందనే ఆశాభావాన్ని రమణ వ్యక్తం చేశారు. ఏదేమైనా భవిష్యత్తు తరాల వారికి ఆదర్శవంతమైన జీవితం, తన నటనా ప్రస్థానాన్ని పది కాలాలపాటు నిలిచేలా ఎన్టీఆర్ తెలుగు వారికి అందజేశారన్నారు. నూజెళ్ళ సూరిబాబు మాట్లాడుతూ ఇంత కాలం తెలుగు విశ్వ విద్యాలయం స్థాపించి దాని ఆలనా పాలన పట్టించుకోలేదని, నేడు ఉప కులపతి ఆచార్య మునిరత్నం నాయుడు వచ్చిన తర్వాత మెల్ల మెల్లగా అభివృద్ధిలోకి రావడానికి, వారి శక్తియుక్తులతో విశ్వ విద్యాలయం అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్ళటానికి కార్యాచరణ చేస్తుండటం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి నెల ఒక సమావేశం.. అది సంగీతం, సాహిత్యం లాంటి విభిన్న కళారూపాల కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు, పూర్వ విద్యార్థులు, విశ్వ విద్యాలయం ఉద్యోగులు తదితర సాహిత్య ప్రియులు పాల్గొని నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్)కి ఘన నివాళులు సమర్పించారు.

# బహిర్గత శత్రువుల కంటే అంతర్గత శత్రువులు ప్రమాదం

### చాటి చెప్పిన "ఇది కదాముగింపు" నాటిక

**అనపర్తి (మనసులో మాట) జనవరి 17:** బహిర్గత శత్రువుల కంటే అంతర్గత శత్రువుల వలన దేశానికి అసలైన ప్రమాదం పొంచి ఉందని ఇది కదా ముగింపు నాటిక చాటి చెప్పింది. సంక్రాంతి సందర్భంగా మండలంలోని పొలమూరు గ్రామంలో, శ్రీ శారద కళానికేతన్ ఆధ్వర్యంలో డిఎన్ఆర్ కళావేదిక ప్రాంగణంలో కళా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లా తిరుపతికి చెందిన శ్రీ శృంగార వల్లభ ఆర్ట్స్ వారి, ఇది కదా ముగింపు నాటిక ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. దేశభక్తి, రైతు శక్తి నేటి సమాజానికి అవసరమని ఈ నాటిక ద్వారా రచయిత తెలియజెప్పారు. దేశానికి వెన్నుముక రైతు అనే సత్యాన్ని నమ్మిన రైతు రామచంద్రం, చెడు వ్యనాలకు లోనై నిత్యం మాదకద్రవ్యాలు సేవించి కుటుంబాన్ని వేధించే చంద్రం, దేశభక్తికి అంకితమై సైనికునిగా దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన సూర్యం, బాధ్యత కలిగిన ఇల్లాలుగా సైనికుని భార్య భారతి పాత్రలు నాటికకు జీవం పోసాయి. ఈ నాటికలో రైతు రామచంద్రంగా భుజంగరావు నటించగా, సూర్యం, చంద్రం పాత్రలో వాసు యడవిల్లి ద్విపాత్రాభినయం చేసి మెప్పించారు. భారతి పాత్రలో నటించిన మాధవి, సబ్ ఇన్స్పెక్టర్ పాత్రలో సత్యనారాయణ, తమ నటనతో ప్రేక్షకుల ఆదరణ చూరగొన్నారు. రచన దర్శకత్వం వహించిన కోరుకొండ బ్రహ్మానందం (కే.బీ. ఆనంద్) తన రచన శైలితో నాటికకు వన్నె తెచ్చారు.



# ఏలేశ్వరం లో అధ్వానంగా పారిశుధ్యం

- పట్టించుకోని మున్సిపల్ శాఖ అధికారులు, నాయకులు
- నగర పంచాయతీ కి పన్నుల ద్వారా కోటి రూపాయలకు పైనే ఆదాయం...
- పారిశుధ్య కార్మికులు కేవలం 24 మందే...

**ఏలేశ్వరం (మనసులో మాట) జనవరి 17..** ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం నగర పంచాయతీలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోతున్నప్పటికీ అధికారులకు నాయకులకు కానీ చీమకుట్టినట్లు కూడా అనిపించడం లేదు. వివరాల్లోకి వెళితే ఏలేశ్వరం నగర పంచాయతీలో 20 వార్డులు ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే పారిశుధ్య కార్మికులు ఉండగా మిగతా 18 మంది తాత్కాలిక కార్మికులు పనిచేస్తున్నారు. ఆ 24 మందిలో కొంతమంది మాత్రమే రెగ్యులర్గా హాజరై పనులు చేస్తుండగా మిగతా వారు తాత్కాలకు ఉద్యోగుల కన్ను సైగలో వారు ఎక్కడికి పంపితే అక్కడ పని చేయాల్సి ఉంటుంది. అలా ప్రస్తుత రాజకీయ పలుకుబడి ఉండి వారికి మాత్రమే సౌకర్యవంతమైన సేవలందిస్తారు. మిగతా వారికి మాత్రం అంతంత మాత్రమే కనీసం ఫిర్యాదు చేస్తున్న అధికారులు గాని స్థానిక నాయకులు గాని స్పందించరు. ఈ నగర పంచాయతీలో 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 50 వేలకు పైనే జనాభా నివసిస్తున్నారు. వీరు కలుగుతున్న అసౌకర్యాన్ని ఏ ఒక్కరూ పట్టించుకోరు.



ఇకపోతే స్థానిక మెయిన్ సెంటర్ కి బాలాజీ చౌక్ నుంచి లింగంపర్తి గ్రామానికి వెళ్లే ఆర్టీసీ డిపో వైపు రహదారి లో పంట కాలవ ప్రవహిస్తూ ఉంటుంది. కాలువ పక్కనే నగర పంచాయతీ వారు చెత్త డంపు ఏర్పాటు చేశారు. అయితే ఉదయానికల్లా ఆ వేస్టేజ్ అంతా మెయిన్ రోడ్డు మీదకు సగం వచ్చేస్తుంది. చుట్టు పక్కల ఉన్న షాపు ల వాళ్ళు వేస్టేజ్ అంతా అక్కడే వేస్తారు. పంచాయతీ సిబ్బంది తెల్లవారు జామున ఆ వేస్టేజ్ అంతా ట్రాక్టర్లోకి డంప్ చేసి అక్కడ నుండి తరలించి, క్లీన్ గా ఉంచుతారు. అయితే గత రెండు రోజులుగా ఆ చెత్తని నగర పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది క్లీన్ చేయక పోవడంతో, ఆ చెత్త రోడ్డు మధ్య వరకు చేరి , పాదచారులకు, ఆ రోడ్డు పై వెళ్లే వాహనదారులకు దుర్వాసన తెప్పిస్తూ అసహ్యంగా తయారైంది. అయినప్పటికీ అధికారులు కానీ నాయకుల కానీ , ఈ ప్రధాన కూడలిలో ఉన్న ఈ చెత్తను తొలగించకపోవడం విడ్డూరంగా ఉంది. నగర పంచాయతీలో ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు విపరీతంగా పెంచేసి ప్రజలకు కనీస సదుపాయాలను సైతం ప్రజా ప్రతినిధులు అధికారులు నిర్లక్ష్య వైఖరి తో వ్యవహరించడంలో అంతర్యం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇప్పటికైనా అధికారులు నగర పంచాయతీలో గల వివిధ వార్డులలో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎప్పటికప్పుడు చెత్తను తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నగర పంచాయతీకి కోట్లాది రూపాయలు ఆదాయంతో పాటు ఆర్థిక సంఘం ప్రతి సంవత్సరం హెచ్చించి ఇస్తున్న ఆర్థిక సహాయం ఏమైపోతుందో నగరాన్ని పాలించే ప్రజాప్రతినిధులు మాత్రమే చెప్పాలి. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు ఈ విషయం పై దృష్టి సారించాలని నగర పంచాయతీని సుధీకరణకు పారిశుద్ధ్య లోపం తొలగించేందుకు కార్మికులను ఎక్కువగా నియమించి చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

**ప్రత్తిపాడు (మనసులో మాట) జనవరి 17..** ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994- 95 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం రాచపల్లి అడ్డరోడ్డు సమీపంలోని ఓ మామిడి తోటలో సంక్రాంతి పండుగను తలపించే విధంగా జరిగింది. ఆరు నుంచి పదవ తరగతి వరకు చదివిన విద్యార్థులంతా 30 ఏళ్ల తర్వాత ఒకచోట చేరి గత స్మృతులను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరునొకరు ఆలింగనం చేసుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు.తమ స్థితిగతులను ఒకరితో ఒకరు పంచుకున్నారు.అనంతరం చదివిన బడి పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ చదువులతో నేడు ఈ స్థాయిలో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తొలుత ఇటీవల కాలంలో మృతి చెందిన తోటి మిత్రులు, ఉపాధ్యాయులను తలచుకొని రెండు నిమిషాలు మౌనం పాటించారు. 30 ఏళ్ల తర్వాత ఈ ఆత్మీయ కలయికకు కృషి చేసిన పెద్దిరెడ్ల గంగారావుని తోటి మిత్రులు అభినందించారు.ఫండ్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు తీర్మానం చేశారు.

## ఆదిత్య లో ఎన్ సిసి శిబిరం



**గండేపల్లి (మనసులో మాట) జనవరి 17..** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 18 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ శిబిరం సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ మేజర్ కె మహమ్మద్ ఆసిఫ్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత అవగాహనపై పెద్దాపురం ఉప విభాగ డీఎస్పీ శ్రీహరి రాజు అతిథి ఉపన్యాసం నిర్వహించబడింది. సెషన్ అత్యంత సమాచారాత్మకంగా, విజ్ఞానవంతంగా సాగింది. డీఎస్పీ గ ట్రాఫిక్ నియమాల ప్రాధాన్యత, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు భద్రతా చర్యలపై క్యాడెట్లకు అవగాహన కల్పించారు. ఇక అదనంగా 18 ఆంధ్ర ఎన్‌సీసీ క్యాడెట్లచే రక్తదాన శిబిరం, వృక్షారోపణ,స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు మరియు ఫైరింగ్ శిక్షణ విజయవంతంగా నిర్వహించబడ్డాయి. రక్తదాన శిబిరంలో క్యాడెట్లు మానవతా విలువలను చాటారు. వృక్షారోపణలో పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేశారు. ఫైరింగ్ శిక్షణ ద్వారా క్యాడెట్ల లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు నాయకత్వ లక్షణాల ప్రోత్సహించబడతాయన్నారు.

# నేడే చొల్లంగి తీర్థం...

- ముస్తాబైన సోమేశ్వరస్వామి, సంగమేశ్వరస్వామివారి ఆలయాలు
- పవిత్ర స్నానాలకు పోటెత్తనున్న భక్త జనం
- భారీ బందోబస్తు నడుమ విస్తృత ఏర్పాట్లు



**తాళ్లరేవు (మనసులో మాట), జనవరి 17:** చొల్లంగి అమావాస్య పర్వదినం సందర్భంగా చొల్లంగిలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తీర్థ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. చొల్లంగిలోని చంద్ర ప్రతిష్ఠిత లింగమైన శ్రీ రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి, తుల్యభాగ నదీతీరాన ఉన్న శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత సంగమేశ్వరస్వామివారి ఆలయాలను విద్యుద్దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయానికి రంగులు వేయడంతో కళకళలాడుతున్నాయి. ఈ మేరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. స్వామివారి అతిశీఘ్ర దర్శనం కోసం ఈ ఏడాది రూ.30 క్యూలైన్ను కూడా ఏర్పాటు చేసారు. సంక్రాంతి తరువాత వచ్చే మాఘమాసం అమావాస్య రోజున సముద్రస్నానం. చేస్తే మోక్షం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో తెల్లవారుజామున 2 గంటలనుంచే భక్తులు పవిత్ర తుల్యభాగ నదిలో స్నానమాచరిస్తూ ఉంటారు. చొల్లంగి తీర్థానికి వీరభద్రులు, అమ్మవార్ల ఊరేగింపులు, అప్పన్నెద్దుల ఊరేగింపులతోఆమావాస్య పర్వదినం సందర్భంగా పవిత్ర స్నానాలు చేయించడం ఆనవాయితీగా వస్తుంది. అమావాస్య మరుసటి రోజున సప్త సాగర యాత్ర ప్రారంభమవుతుంది.

**ట్రాఫిక్ మళ్లింపు..**

చొల్లంగి తీర్థం నేపథ్యంలో కాకినాడ- యానాం రహదారిలో ట్రాఫిక్ను మళ్లించినట్లు కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయణ తెలిపారు. అమలాపురం నుంచి కాకినాడ వెళ్లే బస్సులను జామకాయల తూమునుంచి గొర్రిపూడి మీదుగా కాకినాడకు, అలాగే కాకినాడ నుంచి వచ్చే బస్సులను గురజనాపల్లి మీదుగా యానాం రహదారికి మళ్లించినట్లు తెలిపారు. తీర్థానికి తరలివచ్చే వేలాది మందికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కాకినాడ డిఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, అదేశాల మేరకు కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ పర్యవేక్షణలో 8మంది ఎస్సైలు 130 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**భక్తులు అప్రమత్తంగా ఉండాలి.**

తుల్యభాగ నదీపాయలో పవిత్ర స్నానాలాచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సత్యనారాయణ కోరారు. పోలీసు నిబంధనలను పాటిస్తూ, ఆలయాల్లో క్యూ పద్ధతిని పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అలాగే తీర్థం సందర్భంగా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదని, నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## అగ్ని ప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధం

**ఎటపాక, ( మనసులో మాట) జనవరి 17:** పోలవరం జిల్లా ఎటపాక మండలం నల్లకుంట పంచాయతీ పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన కొర్రి బాబు తాటాకు ఇల్లు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం నిరుపేద గిరిజన కుటుంబం అయినా కొర్రి అనూష, భర్తతో పాటు కూలి పనికి వెళ్ళింది. ఇద్దరు చిన్న పిల్లలు పక్క ఇంట్లో ఆడుకుంటున్నారు. ఆకస్మికంగా ఇంట్లో నుంచి మంటలు ఎగసి పడుతుండటంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ లోగా పూర్తిగా సామగ్రి, కొంత నగదు సైతం ఇంట్లో ఉన్నాయని, పూర్తిగా కాలి బూడిద అయ్యాయని బాధితులు వాపోతున్నారు. కట్టు బట్టలతో మిగులామని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## సుంకరపాలెం వీరేశ్వర స్వామివారి ఆలయంలో ఏకాదశ హరతులు

**తాళ్లరేవు (మనసులో మాట), జనవరి 17:** మండల



పరిధిలోని సుంకరపాలెం గ్రామంలో కొలువై ఉన్న పురాతన ఆలయమైన శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకంఠం గిరిబాబు శర్మ బ్రహ్మోత్సవంలో కవల కోటేశ్వరరావు శ్రీమతి వరలక్ష్మి దంపతులచే స్వామివారికి ఏకాదశ హారతులు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల మాస శివరాత్రి నాడు దాతల సహకారంతో స్వామివారికి ఏకాదశ హారతులు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

## వైయస్సార్ పార్టీ నేతల చేతిలో టీడీపీ కార్యకర్త లాలం బంగారయ్య మృతి



**కోటనందూరు మనసులో మాట జనవరి 17..** కోటనందూరు మండలం అల్లిపూడిలో వైకాపా దౌర్జన్య కాండను ప్రభుత్వ విప్ యనమల దివ్య తీవ్రంగా ఖండించారు. సంక్రాంతి శుభ వేళ అల్లిపూడి లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి టీడీపీ శ్రేణులు బహుమతులు ప్రధానం చేసే సమయంలో వైకాపా అల్లరి మూకలు గ్రామంలో అరాచకాన్ని సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసారని ఆమె అన్నారు.కేవలం శాంతి భద్రతలకు విఘాతం కల్పించేందుకే వైకాపా నేతలు కుట్రపూరితంగా హత్యాకాండ సృష్టించారని వైకాపా నేతల దాడిలో అసువులు బాసిన టీడీపీ కార్యకర్త లాలం బంగారయ్య కుటుంబానికి అండగా ఉంటాని అన్ని విధాలా ఆదుకుంటామని యనమల దివ్య చెప్పారు. ఈసంఘటనను తీవ్రంగా పరిగణలోకి తీసుకున్న ఆమె సంఘటనకు బాధ్యులను వారిని చట్టపరంగా శిక్షిస్తామని ఎంతటి వారైనా ఉపేక్షించేదీ లేదని స్పష్టం చేసారు.అల్లిపూడి ఘటనలో గాయపడి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చింతకాయల శ్రీరాంను సీనియర్ నేతలు యనమల రాజేష్,చింతంనీడి అబ్బాయి, గాడి రాజబాబు,పెంటకోట భాస్కర సత్యనారాయణ లతో ఎమ్మెల్యే యనమల ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. వైకాపా అల్లరి మూకల గూండాయిజం క్షమించరాని నేరమని,శాంతి భద్రతలకు విఘాతం సృష్టించేందుకు వైసీపీ నాయకులు ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని యనమల దివ్య మండిపడ్డారు. క్షతగాత్రులకు సహాయ కార్యక్రమాలు చేయాలని ఆమె పార్టీ శ్రేణులను ఆదేశించారు.

### మండల పట్టణ అధ్యక్షులు రేసులో

# కొత్త ముఖాలు..!!

**- తెరపైకి నూతన అభ్యర్థుల పేర్లు - ఏం జరుగుతుందని సర్వత్రా ఉత్కంఠ**

పిఠాపురం
JANASENA PARTY

**పిఠాపురం, (మనసులో మాట)జనవరి 17 :** పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీలో గ్రామ కమిటీలు నియామకం జరిగిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మండల కమిటీలు నియమించే సమయం ఆసన్నమైంది. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అధిష్టానం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా ప్రచారంలో ఉన్న పేర్లను కాదని, క్షేత్రస్థాయిలో చురుగ్గా ఉంటూ పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావంతో ఉన్న కొత్త అభ్యర్థులను తెరపైకి తీసుకురావడం జనసేన వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

**పట్టణ పగ్గాలు 'వీర మహిళ'కు?**
పిఠాపురం పట్టణ అధ్యక్ష పదవి విషయంలో జనసేన సంచలన నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. తొలిసారిగా ఒక మహిళకు, అది కూడా వృత్తిరీత్యా వైద్యురాలైన ఒక ప్రముఖ 'వీర మహిళ'కు పట్టణ అధ్యక్షురాలిగా అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలన్న పవన్ కళ్యాణ్ ఆలోచనలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

**మండలాల్లో మారుతున్న సమీకరణాలు:**
మండల అధ్యక్షుల ఎంపికలోనూ ఊహించని మార్పులు కనిపిస్తున్నాయి.

**గొల్లప్రోలు మండలం:** పార్టీ ఆవిర్భావం నుండి జెండా మోస్తూ, కష్టకాలంలోనూ అండగా నిలిచిన ఒక సీనియర్ నాయకుడికి గొల్లప్రోలు మండల బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

**పిఠాపురం మండలం:** ఇక్కడ ఒక మాజీ శాసనసభ్యుని తనయుడికి బాధ్యతలు కట్టబెట్టడం ద్వారా రాజకీయంగా మరింత పట్టు సాధించాలని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.

కొత్తపల్లి మండలం: పార్టీ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తూ, యువతలో మంచి ఫాలోయింగ్ ఉన్న ఒక యువ నాయకుడి పేరు కొత్తపల్లి మండల అధ్యక్ష పదవికి ఖరారైనట్లు తెలుస్తోంది.

**కార్యకర్తల్లో నూతనోత్సాహం:**
జనసేన పార్టీలో కొత్త,పాత నాయకులు అనే బేధం లేకుండా అందర్నీ కలుపుకుని పోయే విధంగా ఉండగల సమర్ధులను నియమించాలని జన సైనికులు అధిష్టానానికి పలు వినతులు అందించారు. క్షేత్రస్థాయిలో అవగాహన కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఇప్పటికే సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల పనితీరును బేరీజు వేసుకుని అధిష్టానం వీరిని ఖరారు చేసే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. త్వరలోనే వీటిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# పండగ ముగిసింది

**- కొత్త అల్లుళ్ళు సందడి తో...**
**- సంక్రాంతి కి కిరాణా, మాంసం, మందు, దుస్తులు ఖర్చు 400 కోట్లు**
**- జూదాలు ఖర్చు వేరే లెక్క**



**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 17:** సంక్రాంతి పండగకు జిల్లా ప్రజలు భారీగానే ఖర్చు చేశారు. పండగకు కొత్త దుస్తులకు, మద్యం, మాంసం, కిరాణ సామాగ్రికి, ఇళ్ల పెయింటింగ్‌కు ఇలా అధిక మొత్తంలోనే ఖర్చు చేశారు. సంక్రాంతి పండగకు నెల రోజులు ముందు నుంచి ప్రజలు ఇళ్లకు సున్నాలు, పెయింటింగ్ వేయించడం దగ్గర నుంచి భోగి, సంక్రాంతి, కనుమ పండగ వరకు ఖర్చు చేస్తూనే ఉన్నారు. పండగ 20 రోజుల ముందు నుంచే కొత్త దుస్తులు కొనుగోలు చేయడంలో ప్రజలు నిమగ్నమయ్యారు. ముఖ్యంగా పల్లెల్లో సంక్రాంతి పండగను సంబరంగా జరుపుకున్నారు.

**ఇంటిల్లపాది:**
సంక్రాంతి పండగను కోనసీమ జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. కొంతమంది సంక్రాంతి రోజున పండగ జరుపుకోగా మరికొంత మంది కనుమ రోజు పండగ జరుపుకుంటారు. రైతులు పండించిన పంట కూడా సంక్రాంతి పండగ నాటికి ఇంటికి వస్తుంది. దీంతో కుమార్తెలను, అల్లుళ్లను సంక్రాంతి పండగకు పిలిచి వారికి కొత్త దుస్తులు పెట్టి, వారికి ఇష్టమైన పిండి వంటలు వండి పెడతారు.

**మద్యం విక్రయాలు అధికమే:**
జిల్లాలో 99 వరకు మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా బెల్టు దుకాణాలు వేలల్లో ఉన్నాయి. గ్రామాల్లో సంధుకొకటి చొప్పున ఉన్నాయి. దీంతో మద్యం ప్రియులు ఫుల్‌గా తాగేశారు. జిల్లా వ్యాప్తంగా రూ.100 నుంచి రూ.150 కోట్ల వరకు మద్యం వ్యాపారాలు జరిగాయని సమాచారం.

**కిరాణా సామగ్రి, మాంసం, చేపలు విక్రయాలు:**
సంక్రాంతి పండగకు పిండి వంటలు, ఇతర వంటకాలు వండడానికి జనం కిరాణ సామాగ్రి అధికంగానే కొనుగోలు చేశారు. మాంసం, చేపలు విక్రయాలు కూడా అధికంగానే జరిగాయి. కనుమ సందర్భంగా శుక్రవారం, శనివారం చికెన్, మటన్, చేపల విక్రయాలు జిల్లా వ్యాప్తంగా అధిక మొత్తంలో జరిగాయి. ప్రతి ఒక్కరూ చేపలు, మాంసం కొనుగోలు చేశారు. ఈ వ్యాపారం కూడా లెక్కిస్తే జిల్లా వ్యాప్తంగా రూ.కోట్లలోనే జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. కక్క, ముక్క, మందు కోసం ప్రజలు బాగానే ఖర్చు చేశారు. మటన్ కిలో రూ.వెయ్యి దాటింది. నాటుకోడి మాంసం ధరలు కూడా అమాంతం పెంచేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో వీటిని కొనుగోలు చేయాల్సి వచ్చింది. మొత్తంగా చూస్తే పండగ ఖర్చు జిల్లా ప్రజలు రూ.కోట్లలోనే చేశారని చెప్పకతప్పదు.

# మధుర జ్ఞాపకాలకు 35 ఏళ్లు



**పిఠాపురం, (మనసులో మాట) జనవరి 17 :** పిఠాపురం మండలం మల్లం గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల బృందం 35 సుదీర్ఘ సంవత్సరాల తర్వాత శనివారం పాఠశాల ఆవరణలోనే కలుసుకున్నారు. వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడి, ఉన్నత ఉద్యోగాలు చేస్తూ జీవితంలో ముందుకు సాగిన వారంతా, తమ బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకునేందుకు ఒక్కచోట చేరారు.
పాఠశాల ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే పూర్వ విద్యార్థుల ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ, అలనాటి స్నేహబంధాలను గుర్తు చేసుకున్నారు. వీరి కలయికతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.. పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజులు, అప్పటి సంఘటనలను పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కొందరు విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమ సహకారాన్ని అందిస్తామని మాట ఇచ్చారు. ఈ అపూర్వ కలయిక స్నేహానికి ప్రతీకగా నిలిచింది.

# పి.మల్లవరంలో ఘనంగా రంగవల్లుల పోటీలు

**ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహ ముగ్గుకు ప్రథమ బహుమతి**



**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 17:** మండల పరిధిలోని పి.మల్లవరం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణం వద్ద సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ (బాబి) ఆధ్వర్యంలో "రంగవల్లులు" పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, ముత్యాల జయలక్ష్మి, ధూళిపూడి గొల్లబాబు, సుబ్బారావు, శుభ, పితాని సత్యవతి, విష్ణు, పంపన చంద్రబాబు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ వేసిన ముగ్గుకు మొదటి బహుమతి లభించింది. ఈ బహుమతిని పి. ఆశా శ్వాతి గెలుచుకోగా, రెండవ బహుమతి పి.అనూష, మూడవ బహుమతి వై వి వి లక్ష్మి, నాలుగో బహుమతి డి కుమారిలు గెలుచుకున్నారు. అదేవిధంగా చిన్నారుల విభాగంలో ఏ.నయన ప్రథమ, ఎం శ్రీలక్ష్మి ద్వితీయ, ఎం రామ మానస తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఆయా బహుమతులను ధూళిపూడి వెంకటరమణ, నాయకులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో విళ్ళ సత్యనారాయణ, దున్న సింహాద్రమ్మ, అందే కాశీరాజు, సుబ్బారావు, పితాని వీరబాబు, దడాల సత్తి కొండ, నేతల నాగార్జున, స్వామి, రామలక్ష్మి పాల్గొన్నారు.



# ఎక్కడో పుట్టి... ఎక్కడో పెరిగి

**- చదువులమ్మ చెట్టు నీడలో కలిశారు**
**- ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం**
**- 35ఏళ్ళ తర్వాత కలసిన పూర్వ విద్యార్థులు**

**ముమ్మిడివరం(మనసులో మాట) జనవరి 17:** ఎక్కడో పుట్టి... ఎక్కడో పెరిగి... ఇక్కడే కలిశాం. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ ఎంతో ఉల్లాసం గా ఉత్సాహం గా 50 ఏళ్ళు దాటిన వ్యక్తులంతా చిన్న పిల్లలు లా మారి ముమ్మిడివరం మండలం అయినాపురం లో సందడి చేశారు.
35ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. ఎవరు ఎక్కడ ఉంటున్నారు ఎవరికీ తెలియదు. ఎవరు ఏం చేస్తున్నారు అన్నదీ తెలియదు. వీరందరూ అయినాపురం జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యను అభ్యసించినవారే.
వీరందరూ కలవాలని భావించారు. అనుకున్నదే తడవుగా పాఠశాల నుంచి 190-91సంవత్సరంలో 10వ తరగతి బ్యాచ్‌కు సంబంధించిన వారి వివరాలను సేకరించారు. ఒకరి ద్వారా ఒకరి సెల్‌ఫోన్ నంబర్లు పొందుకున్నారు.
శనివారం ఉన్నత పాఠశాలలో వీరందరూ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది వరకు కలుసుకొని, తాము చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి పనులను, ఉపాధ్యాయులను తలుచుకొని భావోద్వేగానికి గురయ్యారు. మీర్ అలీ రాజా, మీసాల వెంకట రమణ కుమార్ ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులైన గెడ్డం జయదానం, చివుకుల భాస్కర రావు, కుసుమ రాజు, శ్రీపాద సత్యనారాయణ లను ఘనంగా సన్మానం చేశారు.

## లోక కళ్యాణార్థం రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజలు




**కపిలేశ్వరపురం (మనసులో మాట) జనవరి 17..** ప్రపంచ శాంతి ని కోరుతూ కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామంలో సత్యసూర్య భాస్కరావు ఆధ్వర్యంలో కవికొండల నాగశివశర్మ, ర్యాలీ శేఖర్ శర్మ బ్రహ్మత్వంలో లోకాకల్యాణర్థం కోరుతూ మహాన్యాస గణపతి పూజ, మండపారాధన చేసి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వపత్రి పూజ, కుంకుమ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమం లో పురోహితులు నాగేంద్ర శర్మ, డి. వి సిద్ధాంతి శేషసాయి, డి. ఎస్. అర్. ఎల్. శర్మ పాల్గొనగా సాయంత్రం వరకూ మహిళలు శ్రీ లలితా సహస్ర నామ పారాయణ, లింగాష్టకం, బిళ్వాష్టకం, మనిద్వీప వర్ణ వర్ణన వశీటివి పారాయణ చేయగా నీరాజన మంత్ర పుష్పాలు, జరిగి ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమం లో అధిక సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ



**రౌతులపూడి (మనసులో మాట) జనవరి 17:** మండలంలోని రాఘవపట్నం గ్రామపంచాయతీ పరిధిలో సార్లంక గ్రామ అగ్నిప్రమాదం బాధితులకు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగళ్ళ ఉదయ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రతిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ ఆధ్వర్యంలో స్వెటర్స్, ట్రంకు పెట్లు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేడిశెట్టి సూర్యకిరణ్ అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా సూర్యకరణ మాట్లాడుతూ ఈ సంఘటన జరగడం చాలా బాధాకరమని బాధితులకు కూటమి ప్రభుత్వం తక్షణ సహాయం అందించి బాధితులను ఆదుకుందని సూర్యకిరణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం మండల సొసైటీ చైర్మన్ పెంటకోట మోహన్ తుని బ్లాక్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, శంఖవరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు గాబు సుభాష్, ఉపాధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి ), రౌతులపూడి మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, మండల జనసేన నాయకులు తంటపురెడ్డి జయగంట, బచ్చుల నానాజీ, ఎన్ నాగ సత్యనారాయణ, పి వినోద్, పల్లా శ్రీనివాస్, రౌతులపూడి మండల జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# నేడు కళామందిరంలో కృతజ్ఞతలతో మీవాడు పుస్తకావిష్కరణ

**పలమనేరు జనవరి 17( మనసులో మాట) :** తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో 18వ తేది ఆదివారం కళామందిరం లో "కృతజ్ఞతలతో మీవాడు" పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు సంస్థ అధ్యక్షులు పి. తులసినాథం నాయుడు తెలిపారు. కన్నడంలో ధనుంజయ లక్ష్మి రామకృష్ణ రాసిన పుస్తకాన్ని తెలుగులో జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి అనువదించారన్నారు. సాహిత్య, మరియు తెలుగు భాషాభిమానులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# 31 మున్సిపల్ సీట్లతో బీఎస్పీ అద్భుత ప్రదర్శన


**- సాకే వినయ్ కుమార్**




**ధర్మవరం జనవరి 17 (మనసులో మాట)..** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం మహారాష్ట్ర మున్సిపాలిటీ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అద్భుత విజయాన్ని నమోదు చేసుకుని దేశ రాజకీయాల్లో తన బలమైన ఉనికిని మరోసారి చాటుకుందని బీఎస్పీ ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జి సాకే వినయ్ కుమార్ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆయన మాట్లాడుతూ నాగపూర్‌లో 13, చంద్రపూర్‌లో 8, అమరావతిలో 7, షోలాపూర్, థానే, అహ్మద్‌నగర్‌లలో ఒక్కో సీటు చొప్పున మొత్తం 31 మున్సిపల్ సీట్లు బీఎస్పీ గెలుచుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు.
దేశంలో బీఎస్పీ పని అయిపోయిందని, పార్టీకి భవిష్యత్తు లేదని విమర్శించిన రాజకీయ ప్రత్యర్థులకు ఈ ఎన్నికల ఫలితాలు గట్టి సమాధానమని ఆయన స్పష్టం చేశారు. బీహార్, పంజాబ్, కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో బీఎస్పీ సాధిస్తున్న వరుస విజయాలను చూస్తే విమర్శకులు తమ మాటలకే తామే సిగ్గుపడే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా ధర్మవరం నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ వేగంగా పుంజుకుంటూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుం టోందని తెలిపారు. బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం బీఎస్పీ చేస్తున్న పోరాటానికి ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా బీఎస్పీ పార్టీ మరింత శక్తివంతంగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉచిత వైద్య శిబిరం ను సద్వినియోగం చేసుకోండి..

**స్పందన హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా.**



**ధర్మవరం జనవరి 17 (మనసులో మాట)** పట్టణంలోని పుట్టపర్తి రోడ్ సాయిబాబా గుడి వద్ద గల స్పందన హాస్పిటల్ లో ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉచిత షుగర్ బిపి పరీక్షల వైద్య శిబిరమును నిర్వహిస్తున్నట్లు స్పందన హాస్పిటల్ అధినేతలు డాక్టర్. బషీర్, డాక్టర్.సోనియాలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి సమాజంలో షుగర్, బీపీలు సర్వ సాధారణ అయినవని, కానీ వీటి పట్ల తప్పనిసరిగా జాగ్రత్తలు వహించితే మంచి ఆరోగ్యం వస్తుందని తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు ఖాళీ కడుపుతో రక్త పరీక్ష ఉదయం ఎనిమిదిలోగా (సరియైన రిపోర్ట్ కోసం) ఇవ్వవలెనని తెలిపారు. తదుపరి చికిత్సలు సలహాలు ఉదయం పదిగంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్. ఘంటసాల రాఘవ, డాక్టర్ టి ఎం బషీర్ ఈ శిబిరంలో రోగులకు వైద్య చికిత్సలను అందిస్తారని తెలిపారు. కావున ఇటువంటి అవకాశాన్ని గ్రామీణ, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# నేత్ర దానంతో రెండు కుటుంబాల్లో వెలుగులు నింపిన నేత్ర దాత



**ధర్మవరం జనవరి 17 (మనసులో మాట)..** పట్టణములోని పోతుకుంట కి చెందిన కీ,శే కునుతూరు చిన్న వెంకటరెడ్డి (80 సం ) శనివారం మరణించగా పుట్టెడు దుఃఖం లో ఉన్న కూడా విశ్వదీప సేవా సంఘం సభ్యులు నేత్రదానంపై అవగాహన కల్పించిన వెంటనే నేత్రధానం కి ఒప్పుకోవడం తో జిల్లా అందత్వ నివారణ సంస్థ అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ డివై కుల్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ సహకారం తో టెక్నీషన్ జి. రాఘవేంద్ర కంటి కార్నియా సేకరించడం జరిగింది అని విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకులు కోల్లమోరం చంద్రశేఖర్ రెడ్డి ,అధ్యక్షులు గాజుల సురేష్, కార్యదర్శి జుజారు రఘు తెలిపారు . అనంతరం వారు మాట్లాడుతూ నేత్రదానానికి సహకరించిన దాత భార్య రామక్క, కుమారులు కునుతూరు కేశవరెడ్డి, వెంకటరెడ్డి, నరేంద్ర రెడ్డి కుమార్తెలు కేశమ్మ, రమాదేవి కోడళ్ళు వరలక్ష్మి, విజయ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి లకు సేవా సంఘం వారు కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గాజుల శేషు చంద్రశేఖర్ రెడ్డి మాధవ, ఆదినారాయణ తదితర సభ్యులు పాల్గొన్నారు. నేత్రదానం చేయువారు సెల్ నెంబర్ 9392323605 లేదా,9666629841 లేదా 9059017583 లేదా 8247724335, 9492323912 లేదా,9703126122 కు సంప్రదించవచ్చునని తెలిపారు.

# గొట్లూరులో స్థల వివాదం

**- అంగన్వాడి స్థలంలో విగ్రహ నిర్మాణానికి ప్రయత్నం**
**- అధికారులు స్పందించి యథావిధిగా అంగన్వాడి సెంటర్ నిర్మించాలి - గొట్లూరు గ్రామ పెద్దల డిమాండ్**




**ధర్మవరం జనవరి 17 (మనసులో మాట)..** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం రూరల్ గొట్లూరు గ్రామంలో అంగన్వాడి సెంటర్‌కు కేటాయించిన స్థలంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేయాలన్న ప్రయత్నం తీవ్ర వివాదానికి దారితీసింది. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గత నెలలో అంగన్వాడి భవనాన్ని జెసిబీ సహాయంతో తొలగించడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.
ఈ ఘటనపై గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించి అంగన్వాడికి కేటాయించిన స్థలం అంగన్వాడి సెంటర్ కె ఉండాలని,విగ్రహ ఏర్పాటు కోసం వేరే అనుకూలమైన స్థలాన్ని కేటాయిస్తామని గ్రామ పెద్దలు స్పష్టంగా తీర్మానించారు. అయినప్పటికీ ఈ స్థల వివాదం కోర్టులో స్టే ఉండగానే కొందరు వ్యక్తులు గ్రామ పెద్దల సూచనలను పట్టించుకోకుండా అంగన్వాడి స్థలంలోనే విగ్రహ నిర్మాణానికి పిల్లర్ పనులు ప్రారంభించడం మరింత వివాదానికి దారితీసింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా వెంటనే అధికారులు జోక్యం చేసుకుని అంగన్వాడి స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించి, యథావిధిగా అంగన్వాడి సెంటర్‌ను నిర్మించి చిన్నపిల్లలకు అందుబాటులో ఉండేలాగా గ్రామ పెద్దలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రామాంజనేయులు, బిజెపి ఓబీసీ మండల అధ్యక్షులు కట్టుబడి వెంకటేష్,టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు తలారి నారాయణస్వామి, మరియు గ్రామ పెద్దలు గిరిక గోపాల్, కాటమయ్య,సాకే రామదాసు, నారాయణస్వామి, పోతలయ్య, పెద్దిరెడ్డి,పిట్ట నరసింహులు, వెంకటరెడ్డి,బిజెపి సోషల్ మీడియా సుబ్బరాయుడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ 30 వ వర్ధంతి కార్యక్రమానికి

# హాజరు కానున్న పరిటాల శ్రీరామ్

**ఎన్టీఆర్,పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా నాటక ప్రదర్శనబిటిడిపి నాయకులు**



**ధర్మవరం జనవరి 17 (మనసులో మాట)..** తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు నందమూరి తారకరామారావు 30 వర్ధంతి సందర్భంగా ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో పట్టణములోని కాలేజీ సర్కిల్లో గల క్రీడా మైదానంలో ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఉచిత నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి పార్టీ కార్యాలయంలో నాటకం యొక్క వాల్ పోస్టర్లను టిడిపి నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ని పాల్గొంటారని తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ఆదివారం రోజున ఉదయం 9:30 గంటలకు ధర్మవరం పట్టణం ఎన్టీఆర్ సర్కిల్లో గల నందమూరి తారక రామారావు విగ్రహానికి పరిటాల శ్రీరామ్ పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ధర్మవరం నియోజకవర్గంలో గల తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల నాయకులు,మండల, పట్టణ అధ్యక్షులు మండల,పట్టణ కమిటీల నాయకులు క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, బూత్ కన్వీనర్లు,బూత్ లెవెల్ ఏజెంట్లు,బూత్ కమిటీ సభ్యులు,వార్డ్ కమిటీ సభ్యులు, తెలుగు యువత, తెలుగు మహిళ, ఐటీడీపీ,ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ అనుబంధ సంఘాల కుటుంబ సభ్యులు ఎన్టీఆర్, ఎన్.బి.కె అభిమాన సంఘాల నాయకులు హాజరుకావాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ పట్టణం లోని గాంధీనగర్ సర్కిల్లోగల తెలుగుదేశంపార్టీ కార్యాలయం వద్దకు ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందిగా వారు తెలిపారు. అనంతరం టిడిపి పార్టీ కార్యాలయం నుండి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పిస్తారని తెలిపారు. కావున ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులంతా విజయవంతం చేయవలసిందిగా ప్రతి ఒక్కరికి పేరుపేరునా వారు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా
పట్టణంలోని క్రీడా మైదానంలో ఎన్టీఆర్,పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా ఉచిత షాస్టాశీకములు అను నాటకం సాయంత్రం ఏడు గంటలకు ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఉంటుందని తెలిపారు. కావున ఈ కార్యక్రమమునకు ధర్మవరం నియోజకవర్గంలో గల ప్రజలు,ఎన్డీఏ పార్టీల కుటుంబ సభ్యులందరూ హాజరై నాటక ప్రదర్శనను దిగ్విజయం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

# తిమ్మరాజుపేట లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**అచ్యుతాపురం జనవరి 17 మనసున్న మాట..** మన గ్రామ సర్పంచ్ శ్రీమతి భాగ్యలక్ష్మి, శివబాపునాయుడు మరియు శ్రీ గౌరీ దుర్గ భవాని కోలాట బృందం ఆధ్వర్యంలో నిన్న సంక్రాంతి వేడుకలు చాలా ఘనంగా జరిగాయి ఈ భాగంలో స్త్రీలకి ముగ్గులు పోటీల్లో జరిపించారు స్త్రీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు వీటిలో సీనియర్ జూనియర్ కింద విభాగం చేసి ముగ్గులు వేసిన వారికి సీనియర్స్ కి 1 ప్రైజ్ పప్పు వెంకట్ లక్ష్మి 2 ప్రైజ్ శరగడం యమునా 3 ప్రైస్ శరగడం మనీఅలాగే జూనియర్స్ కి ఫస్ట్ సెకండ్ కౌన్సిలేషన్ బహుమతి ఇవ్వడం జరిగింది ఈ పోటీల్లో కలర్స్ రంగవల్లి ముగ్గులు చూసి గ్రామస్తులందరినీ ఎంజాయ్ చేస్తూ ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నారు అలాగే క్రీ" శే"శరగడం నాయుడు కుమారుడు క్రీ"శే"శరగడం వెంకట అప్పారావు జ్ఞా"అతను భార్య సత్యవతిమరియు కుమారుడు సురేష్ చేతుల మీదగా మన గ్రామస్తులకి 180 మందికి దుప్పట్లో పంపిణీ చేయడం జరిగింది

# పదవి విరమణ చేసిన పాల సంఘం ఉద్యోగులకు సన్మానం




**చీడికాడ, జనవరి17, (మనసులో మాట)**మండలంలో అప్పలరాజుపురం విశాఖ డైరీ చెందిన పాల సంఘంలో పనిచేస్తూ ఇటీవల సంఘం కార్యదర్శి డోకల కాశీ విశ్వేశ్వరరావు హెల్పరు కురచా దేవుళ్ళు పదవి విరమణ చేసారు వారికి సన్మాన సభ శనివారం రాత్రి జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ డైరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి ఇద్దరు ఎంతో కృషి చేశారన్నారు ఈ సందర్భంగా ఇద్దరిని గ్రామ పెద్దలు సంఘ పాలకవర్గ సభ్యులు సిబ్బంది సభ్యులు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గవిరెడ్డి జగన్నాథం సంఘ అధ్యక్షులు చుక్క రమణ టిడిపి నాయకులు గవిరెడ్డి శ్రీనివాసరావు మాజీ ఎమ్మెల్యే తనయుడు కురచా శేషు పాల్గొన్నారు

# ఘనంగా తీర్థ మహోత్సవాలు



**కె.కోటపాడు,జనవరి17( మనసులో మాట):** మండలంలోని గొందుపాలెం గ్రామస్తుల ఆరాధ్య దేవత శ్రీదండు ముత్యాలమ్మవారి తీర్థంను శనివారం ఘనంగా చేశారు. ఉదయంనుంచే అమ్మవారికి ధూప,దీప, నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు చేశారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సమాజ మిత్రవారు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తారు. నేల డాన్స్ లు, కోలాటాలు, తప్పెటగుళ్ళు ప్రదర్శించారు. గుఱ్ఱం పందెం పోటీలు నిర్వహించారు.డాన్స్ బేబి డాన్స్ వినోద కార్యక్రమాలు జరిగాయి. అలాగే చౌడువాడ శివారు గరుగుబిల్లి గ్రామదేవత శ్రీ దండు ముత్యాలమ్మ తీర్థం సందర్భంగా టీడీపీ యూనిట్ ఇంచార్జి మొల్లి గోవింద తదితర భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దాలివలసలో శ్రీ ముత్యాలమ్మ తల్లి తీర్థం సందర్భంగా సర్పంచ్ భూమిరెడ్డి దేముళ్ళు, టీడీపీ సీనియర్ నాయకులు రెడ్డి రామస్వామి, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శిలు బండారు గంగునాయుడు, కూండ్రపు రామకృష్ణ, గ్రామ పెద్దలు దర్శించుకున్నారు. మండలంలోని కింతాడ గ్రామంలో శ్రీ మరిడమ్మవారి తీర్థం, లంకవానిపాలెంలో శ్రీ గుహలింగేశ్వర స్వామితీర్థం జరిగింది. ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటీసీల సభ్యులు, పలురాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు దర్శించుకున్నారు.



# అక్మల్, రోషన్ కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే

**పలమనేరు జనవరి 17 ( మనసులో మాట):** నియోజకవర్గ పరిధిలోని వీకోట మండలం వైస్ సర్పంచ్ అక్మల్ భాష మరియు విలేఖరి రోషన్ కుటుంబీకులను పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి శనివారం పరామర్శించారు. అక్మల్ తల్లి షహనాజ్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మండల తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అక్మల్ కుటుంబీకులను ఆయన పరామర్శించారు. అదేవిధంగా సీనియర్ పాత్రికేయులు రోషన్ తండ్రి సలీమ్ వారం క్రితం ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో వారి స్వగృహానికి వెళ్ళి రోషన్ తో పాటు వారి కుటుంబీకులను పరామర్శించారు. ఈ సంతాప కార్యక్రమంలో నాయకులు రాంబాబు, రంగనాథ్, మురుగేష్, శభరీష్, లక్ష్మణ్, అమర్ లతో పాటు మైనారిటీ నాయకులు రూహుల్లా, నాసీర్ , గౌస్ పీర్, మూసా తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లిం కుటుంబానికి ఆర్థిక సహాయం అందవేత...

**- మదీనా మసీదు కమిటీ**



**ధర్మవరం జనవరి 17 (మనసులో మాట)..** పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ ఎల్ -4 లో నివాసము ఉండు ఓ పేద ముస్లిం కుటుంబానికి మదీనా మసీదు కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆ కుటుంబానికి రూ.9,500 రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా మదీనా మసీదు కమిటీ నాగూర్ హుస్సేన్, కార్యదర్శి అల్తాఫ్ మాట్లాడుతూ పట్టణంలో పేద ముస్లింలు ఎక్కడ ఉన్నా సరే, గుర్తించి వారికి వివిధ సేవా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని తాము కొన్ని సంవత్సరాలుగా నిర్వర్తిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఆ ముస్లిం కుటుంబంలో తండ్రి చాలా పేదవాడు కావడం వల్ల తన కూతురు వివాహ నిమిత్తం తమవంతుగా ఈ సహాయాన్ని అందించడం మాకెంతో సంతోషాన్ని ఇస్తోందని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు మదీనా మసీదు కమిటీ వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సలీం భాష, అజీజ్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డిప గ్రామంలో మహిళలకు ముగ్గులు పోటీలు



**నర్సీపట్నం రూరల్, జనవరి 17, ( మనసులో మాట) :** సంక్రాంతి సంబరాలలో భాగంగా వడ్డిప గ్రామంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ సౌజన్యంతో ప్రైమ్ 9 సహకారంతో వడ్డిప అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళలకు భారీ ఎత్తున ముగ్గులు పోటీలు నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా హాజరైన అనిమిరెడ్డి రమణ తన సొంత నిధులతో విజేతకు మిక్సర్ గ్రైండర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండుగలో రంగవల్లులకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందన్నారు. రంగవల్లులు లేని సంక్రాంతి పండుగను ఊహించలేమన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా నుదురుపాటి తాతాజీ జన్మదిన వేడుకలు

**పేదలకు నిత్యవసర సరుకులు, బట్టలు పంపిణీ**



**అనకాపల్లి జనవరి 17, (మనసులో మాట):** అనకాపల్లి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త సంఘ సేవకులు నుదురుపాటి తాతాజీ జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి దివ్య ఆశీస్సులతో ప్రముఖ వ్యాపారవేత్త, సిద్ద లింగేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నుదురుపాటి తాతాజీ జన్మదినం వేడుకలు వైభవంగా నిర్వహించారు. సందర్భంగా పలు సేవా కార్యక్రమాలతో పాటు పేదలకు బట్టల పంపిణీ, నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. శనివారం చిన్నవీధిలో తన సొంత నిధులతో నిర్మించిన కళ్యాణ మండపంలో జన్మదిన, షష్టిపూర్తి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 61 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా 62 మంది నిరుపేదలకు నిత్యవసర వస్తువులు, బట్టలు పంపిణీ జరిగిందన్నారు, ప్రతి ఏడాది తను ఎన్ని సంవత్సరాలు వస్తే అంతమందికి సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘ సభ్యులు, శ్రీ జానకిరామ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ వైశ్య యువజన సంఘం సభ్యులు, శ్రీ వాసవి స్వయంసేవ ట్రస్ట్ సభ్యులు, శ్రీ రామాలయం కమిటీ సభ్యులు తాతాజీ దంపతులను ఘనంగా సత్కరించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
ఆదివారం 18 జనవరి 2026


# భారీగా ఐపీఎస్‌లు బదిలీ




**విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా అభిషేక్ మహంతి**

**హైదరాబాద్, జనవరి 17:** తెలంగాణలో భారీగా ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. మున్సిపల్ షెడ్యూల్ విడుదలకు ముందే అధికారుల బదిలీ జరగడం విశేషం. ఈ క్రమంలో 20మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా అభిషేక్ మహంతి నియమితులయ్యారు. లాజిస్టిక్స్ ఎడిగా గజారావు భూపాల్, ఇంటెలిజెన్స్ డిఐజిగా ఆర్.భాస్కరన్, ఫ్యూచర్ సిటీ అడిషనల్ సీపీగా చందన దీప్తి, సైబరాబాద్ డిసిపిగా టి.అన్నపూర్ణ, ట్రాఫిక్-3 డిసిపిగా రాహుల్ హెగ్డే బదిలీ అయ్యారు. అలాగే అఎఅ ఎస్పీగా ఆర్.వెంకటేశ్వర్లు, హైదరాబాద్ క్రైమ్ డిసిపిగా ఎస్.చైతన్యకుమార్, ట్రాఫిక్-1 డిసిపిగా అవినాష్ కుమార్, ట్రాఫిక్-2 డిసిపిగా కాజల్, సైబరాబాద్ కమిషనరేట్ డిసిపిగా శేషాద్రిని రెడ్డి, మల్కాజ్‌గిరి కమిషనరేట్ డిసిపిగా రాహుల్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డిసిపిగా శివం ఉపాధ్యాయ, మల్కాజ్‌గిరి ట్రాఫిక్-2 డిసిపిగా వి.శ్రీనివాసులు బదిలీ అయ్యారు.

# అతివలకే అవకాశం

**50శాతం పదవులు మహిళలకే..**

**మేయర్లు, చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు ఖరారు**

**రాష్ట్రంలో మున్సిపల్‌ఎన్నికలకు సర్వం సిద్ధం**



**హైదరాబాద్, జనవరి 17:** తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. శనివారం సాయంత్రానికి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కానుంది. రాత్రికి లేదాఆదివారం ఉదయానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి రిజర్వేషన్ల జాబితా అందజేసే అవకాశం ఉంది. ప్రభుత్వం జీవో ఇచ్చిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు ఎస్ఈసీ సిద్ధంగా ఉంది. ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. 10 కార్పొరేషన్లలో ఎస్సీ-1, ఎస్టీ-1, బీసీ-3(ఒకటి మహిళ)లకు కేటాయించారు. జనరల్ కేటగిరీలో ఐదు స్థానాలకు గానూ ఏకంగా నాలుగు స్థానాలను మహిళలకు కేటాయించారు. 121 మున్సిపాలిటీల్లో ఎస్సీ-17, ఎస్టీ-5, బీసీ-38, జనరల్-61 కేటాయించడం జరిగింది.కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లు... ఇలా ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ - ఎస్టీ (జనరల్),రామగుండం కార్పొరేషన్- ఎస్సీ (జనరల్),మహబూబ్‌నగర్ కార్పొరేషన్- బీసీ మహిళ, మంచిర్యాల కార్పొరేషన్- బీసీ (జనరల్), కరీంనగర్ కార్పొరేషన్ - బీసీ (జనరల్), ఖమ్మం కార్పొరేషన్- మహిళ (జనరల్), నిజామాబాద్ కార్పొరేషన్- మహిళ (జనరల్), వరంగల్ కార్పొరేషన్- జనరల్, జీహెచ్ఎంసీ - మహిళ (జనరల్) నల్లగొండ కార్పొరేషన్- మహిళ (జనరల్) కు కేటాయించారు.

# జనవరి 28 నుండి మహా జాతర



**ములుగు, జనవరి 17:** రెండేళ్లకోమారు జరిగే మేడారం జాతర ఈ యేడు జనవరి 28 నుండి 31 వ తేదీ వరకు జరుగుతుంది. జాతర మొదటి రోజైన 28న కన్నేపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకు వస్తారు. అదే రోజు కొండాయి నుండి గోవిందరాజులును, పూనుగుండ్ల నుండి పడిగిద్దరాజులను గద్దెలపై ప్రతిష్టింప చేస్తారు. రెండవ రోజున 29నసమ్మక్కను చిలుకల గుట్ట నుండి పూజార్లు తీసుకోని వచ్చి గ్దదెపై ప్రతిష్టింప చేస్తారు. మూడో రోజున శుక్రవారం పూర్తి మొక్కుల చెల్లింపు, నాలుగవ రోజు సాయంత్రం దేవ దేవతలను తిరిగి వన ప్రవేశం చేస్తారు. వంశపారంపర్యంగా వస్తున్న ఆదివాసులే పూజార్లు కావడం ఈ జాతర పూర్తిగా ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం నిర్వహించడం ప్రత్యేకత. తమ కోర్కెలు తీర్చమని భక్తులు అమ్మవార్లకు బంగారం (బెల్లము) నైవేద్యంగా సమర్పించు కుంటారు. తెలంగాణ రాష్ట్రంలో ములుగు జిల్లాలో జరిగే అతిపెద్ద, విశిష్ట ఆదివాసిల జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రతి రెండు సంవత్సరాలకొకసారి జరుగుతుంది. ఈ సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్టాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్టాల నుంచి సుమారు కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇది ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరొందింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్క - సారలమ్మ జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. గిరిజనుల ఆచారం మేరకు ఈ సంప్రదాయ జాతరకు ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. గద్దెలను కొత్తగా నిర్మించింది. ఈ పనులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభిస్తారు.



# పాలమూరు బిడ్డల శ్రమతోనే ప్రాజెక్టులు

**పాలమూరు అన్యాయం చేసిన కేసీఆర్**

**బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం**

**పదేళ్లు ప్రాజెక్టులు కట్టకుండా నిర్లక్ష్యం**



- రూ.1,284 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన
- జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పిన సీఎం రేవంత్

**మహబూబ్‌నగర్, జనవరి 17:** దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా.. వాటిలో పాల మూరు బిడ్డల శ్రమ దాగి ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. వారి చెమట అందులో ఉంటుందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన మండలం ఈ జిల్లాలోని గట్టు మండలం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పదేళ్లపాటు పాలమూరు జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. కేసీఆర్ పదేళ్లపాటు పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్ట కూడా తీసుకురాలేదని విమర్శించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారు. ప్రాజెక్టు పేరు మీద రూ.23 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు కానీ, ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఉద్దండాపూర్ జలాశయం భూ నిర్వాసితులకు నిధులు చెల్లించలేదు. సంగంబండ వద్ద బండ పగుల గొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. గతంలో పాలమూరు జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. జిల్లాలోని ప్రాజెక్టుల గురించి అడగలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ పెడితే సభకు రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. భాజపా ఎంపీలు రాష్ట్రానికి ఐఐఎం సాధిస్తే.. పాలమూరు జిల్లాలోనే భూమి ఇచ్చే బాధ్యత నాదని అన్నారు. పాలమూరు జిల్లాను వెనకబడిన జిల్లాగా ఇంకా ఎన్నాళ్లు చూపించాలి? పదేళ్లలో రూ.1.80లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటి పూర్తి చేశారు.. అది మూడేళ్లకే కుప్పకూలింది. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత నాది. ఇవాళ రాష్ట్రంలో 3.50 కోట్ల మంది పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తున్నాం. గతంలో పదేళ్ల పాటు పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా ఈ సారి ప్రజలు తరిమి కొడతారని సీఎం అన్నారు. భారత తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకే తొలి ప్రాధాన్యత ఇచ్చారని, తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే ఇప్పటికీ జీవనాధారం అయ్యాయన్నారు. గతంలో భూస్వాములు, దొరల వద్ద లక్షలాది ఎకరాలు ఉండేదదని, భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చి మిగులు భూములను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంచిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు పేదలకు పంచేందుకు ప్రభుత్వం వద్ద భూమి లేదని, ఇప్పుడు చేయగలిగింది మంచి విద్య అందించటమేనన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. నిబద్ధత లేని చదువు వల్ల ప్రయోజనం ఉండదని, ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని సూచించారు. 25 ఏళ్లు కష్టపడి చదివితే.. 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చౌమహల్లాలో 'సూఫీ' సంగీత హోరు.. మైమరపించిన అనితా సింఘ్వి

**'అల్లా హూ..', 'దమా దమ్ మస్త్ ఖలందర్' గీతాలతో ఆధ్యాత్మిక ఆనందం**

**హాజరైన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి**

**సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా కచేరీ**

**హైదరాబాద్, జనవరి 17:**

హైదరాబాద్‌లోని చారిత్రక చౌమహల్లా ప్యాలెస్ వేదికగా శనివారం రాత్రి జరిగిన సూఫీ, గజల్ సంగీత కచేరీ ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత సూఫీ గాయని అనితా సింఘ్వి తన స్వర మాధుర్యంతో నగర వాసులకు ఒక మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని పంచారు. ఈ సంగీత విభావరికి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వి తదితరులు హాజరై సంగీతాన్ని ఆస్వాదించారు. చారిత్రక కట్టడాల నడుమ సాగిన ఈ కచేరీ వీక్షకులకు కనుల పండుగగా నిలిచింది. గ్వాలియర్ ఘరానా సంప్రదాయానికి చెందిన అనితా సింఘ్వి.. భక్తి, కవిత్వం కలగలిపి ఆలపించిన తీరు సభికులను కట్టిపడేసింది. ముఖ్యంగా ఆమె ఆలపించిన 'అల్లా హూ.. అల్లా హూ..' అనే గీతం ప్యాలెస్ ప్రాంగణంలో ప్రతిధ్వనిస్తూ ధ్యాన పారవశ్యాన్ని కలిగించింది. అలాగే ప్రసిద్ధ సూఫీ గీతం 'దమా దమ్ మస్త్ ఖలందర్'ను ఆమె తనదైన శైలిలో ఆలపించి ప్రేక్షకులలో ఉత్సాహాన్ని నింపారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జన్మించిన అనితా సింఘ్వి, చిన్నవయసులోనే పండిట్ క్షీర్‌సాగర్ వద్ద సంగీతంలో మెళకువలు నేర్చుకున్నారు. నక్ష్-ఎ-నూర్, సదా-ఎ-సూఫీ, తాజల్లి వంటి ఆల్బమ్‌లతో ఆమె మంచి గుర్తింపు పొందారు. గాలిబ్, అల్లామా ఇక్బాల్ వంటి కవుల రచనలకు ప్రాణం పోస్తూ ఆమె చేసిన గానం శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంది. హైదరాబాద్ సాంస్కృతిక వైభవానికి ఈ కార్యక్రమం మరింత వన్నె తెచ్చిందని పలువురు ప్రశంసించారు.

# నేడు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో సీఎం పర్యటన

- సీపీఐ శతవార్షికోత్సవ సభలో పాల్గొననున్న రేవంత్
- జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- మేడారంలో ఆలయం ప్రారంభించనున్న సీఎం
- అక్కడే కేబినేట్ భేటీకి ఏర్పాట్లు పూర్తి



**వరంగల్, జనవరి 17:** ఖమ్మం వరంగల్ జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి నేడు పర్యటించనున్నారు. ఖమ్మంలో సీపీఐ వందో వార్షికోత్సవంలో పాల్గొననున్నారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతారు. మద్దులపల్లిలో జెఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపనతో పాటు, నర్సింగ్ కాలేజీని ప్రారంభిస్తారు. వ్యవసాయ మార్కెట్ ప్రారంభంతో పాటు మున్నేరు లింక్ కెనాల్ ప్రారంభిస్తారు. కూసుమంచిలో వందపడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తారు. ఇకపోతే వరంగల్ పర్యటనలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. మేడారంలో అమ్మవారి గద్దెలను ప్రారంభిస్తారు. అనంతరం మేడారంలో కేబినేట్ భేటీ ఉంటుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రులంతా అక్కడికి చేరుకుంటారు. మేడారంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఇప్పటికే పరిశీలించారు. జాతర పనులు తుది దశకు చేరుకున్నాయని ఆమె వెల్లడించారు. ఆ తల్లుల దర్శనం కోసం అన్నివర్గాల ప్రజలు ఈ జాతరకు తరలివస్తారన్నారు. దాదాపు రెండు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని సీతక్క చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామని వివరించారు. మేడారం భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డికి.. సమ్మక్క సారలమ్మ తల్లులతో ఎంతో భావోద్వేగ బంధం ఉందని గుర్తుచేశారు. అందుకే రూ.260 కోట్లతో మేడారం అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పుకొచ్చారు. జనవరి 18న మేడారంలో దేవాలయాన్ని ప్రారంభించేందుకు సీఎం విచ్చేయనున్నారని తెలిపారు. ఇక్కడే కేబినెట్ సమావేశం సైతం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేబినేట్‌లో పలు కీలక అంశాలు చర్చించనున్నారు. అలాగే మున్సిపల్ ఎన్నికలపైనా చర్చిస్తారని సమాచారం. ఇకపోతే మేడారం వాట్సప్ చాట్ బాత్‌తోపాటు మొబైల్ యాప్‌నూ విడుదల చేశారు. వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో హెల్త్ క్యాంప్, టాయిలెట్ బాక్సులు, రూట్ మ్యాప్‌లు, ట్రాఫిక్ అప్‌డేట్‌లు, సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక వ్యవస్థ, నీటి సౌకర్యం తదితర అన్ని సౌకర్యాల సమాచారం కోసం వాట్సాప్ నంబర్ 7658912300 అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సీతక్క వివరించారు.




# ఇక సంగారెడ్డి నుంచి పోటీ చేయ!

## కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

**సంగారెడ్డి, జనవరి 17:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. తాను జీవితంలో సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ' ఏఐసీసీ సీనియర్ నేత రాహుల్ గాంధీని.. నేను సంగారెడ్డికి పిలిచి అవమానించానేమో అని ఫీల్ అయ్యాను. నాకోసం ఆయన సంగారెడ్డికి వచ్చారు. నన్ను గెలిపించాలని గట్టిగా ప్రచారం చేశారు. అంతగా ఆయన ప్రచారం చేసినప్పటికీ ఇక్కడి ప్రజలు నన్ను ఓడించారు. నేను చాలా ఆవేదన చెందాను. అందుకే సంగారెడ్డిలో నేను ఎమ్మెల్యేగా జీవితంలో పోటీ చేయను' అని అన్నారు. రాహుల్ గాంధీ నా భుజంపై చేయివేసి జగ్గారెడ్డిని గెలిపించాలని అడిగితే.. నన్ను ఇక్కడి వారు ఓడించారు. నా జీవితంలో ఈ ఓటమి మరిచిపోలేనిది. నా ఓటమికి కారణం పేద ప్రజలు కాదు. సంగారెడ్డిలోని మేధావులు, కొందరు పెద్దలు మాత్రమే. రేపటి రోజు సంగారెడ్డిలో నా భార్య నిర్మలా పోటీచేసినా నేను ప్రచారానికి రాను. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తాను. కానీ.. సంగారెడ్డిలో మాత్రం చేయను' అంటూ జగ్గారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు.

# చౌమహల్లాలో సంగీత కార్యక్రమం

## సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్‌హాజరు



**హైదరాబాద్, జనవరి 17:** తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని చారిత్రక చౌమహల్లా ప్యాలెస్‌లో ఘజల్–సూఫీ సంగీత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో పాటు పలువురు ప్రముఖులు హాజరై సంగీత సాయంత్రాన్ని ఆస్వాదించారు. డెక్కన్ ప్రాంతపు సమ్మిళిత సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా సాగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఘజల్, సూఫీ గాయని అనితా సింగ్వి భావగర్భితమైన గానంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సాంస్కృతిక సాయంత్రానికి కళాభిమానుల నుంచి విశేష స్పందన లభించగా, చౌమహల్లా ప్యాలెస్ ఆధ్యాత్మిక సంగీత శ్రావ్యతతో పరవశించింది. ఈ కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్, టెమ్రిస్‌అధ్యక్షుడు ఫహీం ఖురేషీ, రాజ్యసభ సభ్యులు అభిషేక్ సింగ్వి, రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, తదితరులు హాజరయ్యారు.

# తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థపై కమిటీ

## కొత్తగా 'సికింద్రాబాద్ జిల్లా' ఏర్పాటుకు సంకేతాలు




**హైదరాబాద్, జనవరి 17:** తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పరిధుల్లో మార్పులు, చేర్పులపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ ఆరు నెలల్లో సమగ్ర నివేదిక సమర్పించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ కమిటీ నివేదికకు ముందే ముఖ్యమంత్రి నుంచి ప్రధాన మీడియాకు లీకుల ద్వారా కొంత కీలక సమాచారం చేరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అందులో భాగంగా, రాష్ట్ర రాజధానిలో భాగమైన చారిత్రక సికింద్రాబాద్‌ను కొత్తగా జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి ముఖ్యమంత్రి వచ్చినట్లు సమాచారం. ప్రతిపాదిత ప్రణాళిక ప్రకారం, సికింద్రాబాద్‌తో పాటు సనత్‌నగర్, మల్కాజిగిరి ప్రాంతాలను కలుపుతూ 'సికింద్రాబాద్ జిల్లా'ను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. జనాభా, పరిపాలనా సౌలభ్యం, పట్టణ విస్తరణను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిపాలనా భారమంతా పెరిగిన నేపథ్యంలో, కొత్త జిల్లా ఏర్పాటుతో సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. మరోవైపు, జిల్లాల సంఖ్య పెంపుపై రాజకీయ, పరిపాలనా వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుపై మాత్రం ప్రభుత్వ స్థాయిలో స్పష్టమైన సంకల్పం ఉన్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# తుగ్లక్ పాలన ఏంటో చూస్తున్నాం

- సికింద్రాబాద్ అస్తిత్వం దెబ్బతీసేలా చర్యలు
- సికింద్రాబాద్‌పై పోరాటం ఆపేది లేదు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కేటీఆర్



**హైదరాబాద్, జనవరి 17 :** హైదరాబాద్, సికింద్రాబాద్ కు ఎంతో చరిత్ర ఉందని.. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని తొలగించే విధంగా చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తుగ్లక్ గురించి పుస్తకాల్లో చదువుకున్నాం.. ప్రత్యక్షంగా తుగ్లక్ అంటే ఎలా ఉంటాడో కనిపిస్తుందని విమర్శించారు. మొదటి పని టీఎస్‌ను టీజీగా చేశారు.. దీనివల్ల ఏ పేదవాడికి న్యాయం జరిగిందో తెలియదు.. తెలంగాణ తల్లిని తీసేసి కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చి పెట్టారన్నారు. ప్రజల దగ్గరికి పాలన పోవాలని అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాలని వీకేంద్రీకరణను ఒక విశాల దృక్పథంతోనే కేసీఆర్ ప్రారంభించారని.. కొత్త గ్రామాలు మండలాలు రెవెన్యూ డివిజన్లు జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చారని.. హైదరాబాదులోనూ వార్డులను జోన్లను పెంచడం జరిగిందన్నారు. వాటికి అభివృద్ధి నిధులను కూడా అధికంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ సికింద్రాబాద్ అనేది తెలంగాణ ప్రజల గొప్ప అస్తిత్వం చిహ్నాలు.. కానీ రేవంత్ రెడ్డి తీసుకున్న తుగ్లకు నిర్ణయం వలన సికింద్రాబాద్‌కి చారిత్రక గుర్తింపు పూర్తిగా పోయేటట్లు ఉన్నదని అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్లోని అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా సంఘటితమై.. మా పార్టీని ఆహ్వానించడం జరిగిందని.. అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు మొత్తం మా పార్టీకి చెందిన వార అన్నారు. సికింద్రాబాద్లో పుట్టిన బిడ్డలుగా సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడాలని పోరాటం చేస్తున్నారు.. అధికారం ఇచ్చింది పట్టణాల అస్తిత్వాలను ప్రజల అస్తిత్వాలను గుర్తు లేకుండా చేరుపడం కోసం కాదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.. 'అధికారం ఇచ్చింది గ్యారెంటీలను అమలు చేయడానికి అధికారం ఇచ్చింది ప్రజలు వారికి మంచి చేయాలని.. కానీ ఇలాంటి ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేయడం లేదు.. హైదరాబాద్ నగరంలో రెండు సంవత్సరాలుగా ఒక్క ఇటుక కూడా పెట్టలేదు.. ఒక్క రోడ్డు కూడా వేయలేదు ఒక ఇల్లు కూడా కట్టలేదు.. కానీ నగరం మొత్తం తన విధ్వంసం ప్రణాళికలతోని ముందుకు పోతున్నారు.. ఈరోజు శాంతి ర్యాలీ పేరుతో సికింద్రాబాద్ ప్రజలు ప్రజాప్రతినిధులు ఒక కార్యక్రమాన్ని శాంతియుతంగా చేపట్టారు.. ప్రజల కోరిక మేరకు ప్రజాప్రతినిధులని కోరిక మేరకు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి వెళ్తామని సిద్ధంగా ఉన్నాం.. కానీ నిన్న రాత్రి వరకు అనుమతి ఉందని చెప్పి, ఇప్పుడు అనుమతి లేదని చెప్పి వేలాది మందిని కార్పొరేటర్లను, మాజీ కార్పొరేటర్ లను పార్టీ సీనియర్ నాయకులను సాధారణ ప్రజలను ఎక్కడికి అక్కడ అరెస్టు చేశారు.. ఇంత అరాచకంగా అక్రమంగా పనిచేస్తున్న ప్రభుత్వం అధికారం శాస్వతంగా కాదని గుర్తుపెట్టుకోవాలి.. ఇప్పుడున్న పదవిలో ఎల్లకాలం కొనసాగరని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాసయాదవ్, కాలె యాదయ్య, కెపి వివేకానంద, ఎమ్మెల్సీలు దేశపతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధం

- సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాం
- మున్సిపల్ పోరులోనూ బీజేపీ హవా చాటుతాం
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్, జనవరి 17:** రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేసిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు 5 వేల సర్పంచ్ స్థానాలకు పోటీ చేశామని.. గతంలో కంటే బీజేపీ సర్పంచ్‌ల సంఖ్య పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతమైందని.. ఇందుకు ఈ ఫలితాలే నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలో ముక్కలవు తుందని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని తెలంగాణ బీజేపీ చీఫ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లడం, సభలు నిర్వహించడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40 శాతం కమిషన్‌గా మారిపోయిందని, పారిశ్రామికవేత్తలను బెదిరిస్తుందని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పెద్దఎత్తున నిధులు అందిస్తోందని.. వాటితోనే అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రాజెక్టులకు, విద్యాలయాలకు భూమి కేటాయించడం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ తెలంగాణకు ఏమీ చేయలేదని రాంచందర్‌రావు విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధికి ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం లేదని, కేంద్ర నిధులతోనే చేయవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర పథకాలపై అబద్దాలు ప్రచారం చేస్తోందని.. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో కేంద్ర పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల త్రివేండ్రం ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేశామని.. కేరళలో కార్యకర్తలపై దాడులు జరిగినా పట్టువదలకుండా పనిచేశామని, ముంబై కార్పొరేషన్‌లోనూ గెలిచామని గుర్తుచేశారు. బీఎంసీ ఎన్నికల్లో 29 మున్సిపాలిటీల్లో 25 స్థానాల్లో బీజేపీ గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు రాంచందర్ రావు. ప్రజల సేవకు కమిట్మెంట్‌తో పనిచేస్తామని, ప్రజలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీలకు కేటాయించిన ప్రాంతాల్లో నాయకులు అక్కడే ఉండాలని, బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు.




# ఒక్క చాన్స్ ప్లీజ్..

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు..

**హైదరాబాద్, జనవరి 17:** కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో మున్సిపాలిటీలకు ఖర్చు చేసిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. అదే విధంగా బీఆర్ఎస్ కు ఓటేస్తే... గెలిచిన వాళ్లంతా మళ్లీ కాంగ్రెస్ గూటికే వెళతారని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సికింద్రాబాద్ లోని క్లాసిక్ గార్డెన్ లో జరిగిన 'బీజేపీ మున్సిపల్ ఎన్నికల విజయ సంకల్ప సమ్మేళనం'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి. రాబోయే మున్సిపాలిటీ బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రజలను అభ్యర్థించారు. అదే విధంగా మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో మార్క్ ఏంటో చూపిస్తామన్నారు. అత్యధిక కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు గెలిపిస్తే కేంద్రం నుండి అధిక నిధులు తెస్తామన్నారు. అవసరమైతే సీఎస్సార్ నిధులు తెచ్చి బీజేపీ పాలిత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను డెవలప్ మెంట్ చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో మున్సిపాలిటీలకు ఖర్చు చేసిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కు ఓటేస్తే... గెలిచిన వాళ్లంతా మళ్లీ కాంగ్రెస్ గూటికే వెళతారన్నారు. కరీంనగర్, నిజామాబాద్, బైంసా, నిర్మల్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో మజ్లిస్ దోస్తీ చేస్తుందని అన్నారు. బీజేపీ గెలిచే చోట ఓట్లను తారుమారు చేసి మజ్లిస్ కు అధిక సీట్లు వచ్చేలా డీలిమిటేషన్ పేరుతో కాంగ్రెస్ కుట్రలు చేసిందన్నారు. తమకు ఒక్క చాన్స్ ఇస్తే.. కాంగ్రెస్, మజ్లిస్, బీఆర్ఎస్ కుట్రలను చిత్తు చేస్తామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పైసలను నమ్ముకుని గెలవాలనుకుంటున్నాయని కానీ బీజేపీ ప్రజలను నమ్ముకుని ఎన్నికల్లోకి వెళుతోందన్నారు. అభివృద్ధి, ప్రజా సమస్యలు, హిందుత్వం.... ఈ 3 అంశాలే బీజేపీ ఎన్నికల ఎజెండాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇక నుండి పోలింగ్ జరిగే వరకు ఒక్కో ఇంటికి 6 సార్లు వెళ్లాలని, ముఖ్యంగా వార్డుల వారీగా సమస్యలున్న చోటకే వెళ్లి భరోసా ఇవ్వాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ క్యాడర్ కు , నాయకులకు పిలుపునిచ్చారు.

# ఇండిగోపై ప్రభుత్వం కఠిన చర్యలు

## ₹22.20 కోట్ల జరిమానా, సీఈవోకు కాషన్




**న్యూ ఢిల్లీ, జనవరి 17 :** డిసెంబర్ 3 నుంచి 5, 2025 మధ్య ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో చోటుచేసుకున్న భారీ విమాన ఆలస్యాలు, రద్దుల ఘటనపై కేంద్ర పౌర విమానయాన శాఖ ఆదేశాలతో డీజీసీఏ సమగ్ర విచారణ చేపట్టింది. ఈ ఘటనల వల్ల లక్షలాది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు వెల్లడైంది. విచారణ కాలంలో మొత్తం 2,507 విమానాలు రద్దు, 1,852 విమానాలు ఆలస్యం కాగా, మూడు లక్షలకుపైగా ప్రయాణికులు ప్రభావితమయ్యారని డీజీసీఏ పేర్కొంది. కార్యకలాపాల్లో అతిగా ఆప్టిమైజేషన్, ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనల అమలులో వైఫల్యం, రోస్టరింగ్‌లో తగిన బఫర్ లేకపోవడం, నిర్వహణ పర్యవేక్షణ లోపాలు ప్రధాన కారణాలుగా గుర్తించబడ్డాయి. ఈ ఉల్లంఘనల నేపథ్యంలో ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై డీజీసీఏ కఠిన చర్యలు తీసుకుంది. సంస్థ సీఈఓకు కాషన్, సీఓఓకు వార్నింగ్ జారీ చేయగా, ఎస్వీపీ(ఓసీసీ)ను బాధ్యతల నుంచి తొలగించింది. అదేవిధంగా, ఇతర సీనియర్ అధికారులకు కూడా హెచ్చరికలు జారీ చేసింది. వివిధ సీఏఆర్ నిబంధనల ఉల్లంఘనలకు గాను ఇండిగోపై ₹22.20 కోట్ల జరిమానా విధించిన డీజీసీఏ, భవిష్యత్తులో సంస్కరణల అమలుకు భరోసాగా ₹50 కోట్ల బ్యాంక్ గ్యారంటీ సమర్పించాలని ఆదేశించింది. ప్రభావిత ప్రయాణికులకు సంబంధించి, రీఫండ్‌లతో పాటు సీఏఆర్ ప్రకారం పరిహారం చెల్లించడమే కాకుండా, అదనంగా ₹10,000 విలువైన 'జెస్చర్ ఆఫ్ కేర్' వౌచర్ అందజేయాలని ఇండిగోకు సూచించింది. భద్రత, నియంత్రణ నిబంధనల అనుసరణే అత్యున్నత ప్రాధాన్యమని డీజీసీఏ స్పష్టం చేసింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థాత్మక సంస్కరణలు తప్పనిసరిగా అమలు చేస్తామని హెచ్చరించింది.

# ఆల్ ఇండియా బార్ పరీక్షలో మెరిసిన నవతారెడ్డి



- ఏఐబీఈ ఫలితాల్లో సత్తా చాటిన బొబ్బ నవతారెడ్డి
- 'సత్యమేవ జయతే' స్ఫూర్తితో న్యాయసేవ చేస్తా కుటుంబ సభ్యులు, న్యాయవాదుల హర్షం

**శేరిలింగంపల్లి - మనసులో మాట**

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ ఫలితాల్లో శేరిలింగంపల్లికి చెందిన బొబ్బ నవతారెడ్డి ఉత్తీర్ణత సాధించి తన సత్తా చాటారు. న్యాయవాద వృత్తిలో శాశ్వత ప్రాక్టీస్ కోసం అత్యంత కీలకమైన ఈ పరీక్షలో విజయం సాధించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నవతారెడ్డి మాట్లాడుతూ.. "హక్కు ఉన్నచోట పరిష్కారం ఉంటుంది""సత్యమేవ జయతే" అనే న్యాయ సూత్రాలను తాను బలంగా నమ్ముతానని తెలిపారు. ఇదే స్ఫూర్తితో న్యాయసేవలో ముందుకు సాగుతానని, బాధితులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఈ పరీక్షలో విజయం సాధించినందుకు గాను ఆమె తండ్రి బొబ్బ విజయ్ రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, తోటి న్యాయవాదులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.



# ఆరు నెలలుగా జీతాల్లేక ఆకలి కేకలు

- వెంటనే బకాయిలు చెల్లించండి
- లేదంటే విధులు బహిష్కరించి సమ్మె చేస్తాం: సీఐటీయూ హెచ్చరిక
- మున్సిపల్, ముంపు గ్రామాల కార్మికుల దయనీయ స్థితి
- కలెక్టర్ హైమావతికి వినతిపత్రం అందజేత




**గజ్వేల్ - మనసులో మాట**

గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని కార్మికులకు, మల్లన్న సాగర్ ముంపు గ్రామాల పరిధిలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ (జుxఖ) సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ హైమావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో గత పదేళ్లుగా పనిచేస్తున్న రోజువారీ కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మల్లన్న సాగర్ ముంపు గ్రామాల పరిధిలో పనిచేస్తున్న 33 మంది గ్రామ పంచాయతీ కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వలేదని అధికారుల దృష్టికి తెచ్చారు. గతంలో సీఐటీయూ ఒత్తిడితో వేతనాలు విడుదల చేసినప్పటికీ, మళ్లీ పాత పద్ధతిలోనే బకాయిలు పెడుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్, పంచాయతీ పనులే ఆధారంగా జీవిస్తున్న కార్మికులంతా దళిత, బహుజన వర్గాలకు చెందినవారని, వారికి వేరే ఆర్థిక వనరులు లేవని తెలిపారు. సర్వస్వం కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ముంపు గ్రామాల కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పదేళ్లుగా పనిచేస్తున్నా వీరికి ఈఎస్ఐ పిఎఫ్ (గ్రాట్యుటీ) సౌకర్యాలు కల్పించడం లేదని, కనీసం రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ జీవో ప్రకారం గ్రామ పంచాయతీ కార్మికులకు కూడా వేతనాలు అమలు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని కార్మికులందరికీ బకాయి జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విధులు బహిష్కరించి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.

# మల్లికార్జున స్వామి జాతరకు రండి.. మాజీ ఎమ్మెల్సీకి ఆహ్వానం

**కూచన్‌పల్లి వ్యవసాయ క్షేత్రంలో శేరి సుభాష్ రెడ్డిని కలిసిన యాదవ సంఘం పెద్దలు**

**ఘనంగా జరగనున్న జాతర మహోత్సవాలు**



**రామాయంపేట - మనసులో మాట**

రామాయంపేటలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డికి యాదవ సంఘం పెద్దలు ఆహ్వానం పలికారు. శనివారం కూచన్‌పల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిసి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు జాతర ఉత్సవాల వివరాలను వెల్లడించారు. జనవరి 24వ తేదీ శనివారం రోజున వీర గంధాలతో గంగ బోనం ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం 25వ తేదీ ఆదివారం రాత్రి మంద గంపల ఊరేగింపు ఉంటుందని, ఆ మరుసటి రోజు 26వ తేదీ సోమవారం నాడు శ్రీ మల్లికార్జున స్వామి కల్యాణం, అగ్నిగుండాల ప్రవేశం కార్యక్రమాలు ఘనంగా జరుగుతాయని వివరించారు. అలాగే 27వ తేదీ మంగళవారం రోజున రేణుకా మాత కల్యాణం, బండ్లు తిరుగుట కార్యక్రమాలతో జాతర ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ మామిళ్ల ఆంజనేయులు, యాదవ సంఘం నాయకులు గాయంతి మల్లయ్య, బసనపల్లి రాజు, ఎర్ర గొల్ల రమేష్, అన్నమైన పోచయ్య, ఊడెం దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**రాజారాం తండాలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ**

**పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు: సర్పంచ్ మాణిరాం**

**గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని పిలుపు**



**కంగ్టి - మనసులో మాట**

పేదలకు అండగా ఉండటమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాజారాం తండా సర్పంచ్ మాణిరాం స్పష్టం చేశారు. శనివారం కంగ్టి మండలంలోని రాజారాం తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు ఆయన ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో పేద వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. గ్రామాభివృద్ధే తన ధ్యేయమని, ఇందుకోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల విషయంలో ఎలాంటి రాజకీయ వివక్ష ఉండదని, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చూస్తామని భరోసా ఇచ్చారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఖీరు నాయక్, పల్లవి పర్శురామ్, మాజీ ఎంపీటీసీ షలిబాయి, ఇతర గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# మూగజీవాలను కాపాడబోయి.. మృత్యు ఒడిలోకి..

**డీ83 కెనాల్‌లో పడి ఐటీఐ విద్యార్థి దుర్మరణం**

**మేకలను రక్షించే ప్రయత్నంలో జారిపడి కొట్టుకుపోయిన వైనం**

**పెద్దపల్లిలో విషాదం.. శనివారం ఉదయం మృతదేహం లభ్యం**

**పెద్దపల్లి - మనసులో మాట**



మూగజీవాలను కాపాడబోయి ఓ యువ విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన హృదయవిదారక ఘటన పెద్దపల్లిలో చోటుచేసుకుంది. మేకలను రక్షించే ప్రయత్నంలో కాలువలో జారిపడి ఐటీఐ విద్యార్థి మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి (డబుల్ బెడ్ రూమ్) ప్రాంతానికి చెందిన ఖాదర్ కుమారుడు సయ్యద్ సహద్ (19) స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సెకండియర్ చదువుతున్నాడు. శుక్రవారం (16వ తేదీ) మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో మేకలను మేపడానికి చందపల్లి శివారులోని డీ83 కెనాల్ (పవర్ హౌస్ సమీపంలో) వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో మేకలు ప్రమాదవశాత్తు కాలువలో పడిపోవడంతో, వాటిని బయటకు తీసేందుకు సహద్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతడు కూడా కాలు జారి నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సహద్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించగా, శనివారం ఉదయం పవర్ హౌస్ సమీపంలో విగతజీవిగా కనిపించాడు. చేతికి అందివచ్చిన కొడుకు కళ్లెదుటే విగతజీవిగా మారడంతో తండ్రి ఖాదర్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు పెద్దపల్లి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# భద్రాద్రి రామయ్య సేవలో గజ్వేల్ 'రామకోటి'

**ముచ్చటగా నాలుగోసారి అరుదైన అవకాశం**

**సీతారాముల కల్యాణానికి 300 కిలోల 'గోటి తలంబ్రాల' తయారీ బాధ్యత**

**భద్రాచలం దేవస్థానం నుంచి పిలుపు.. హర్షం వ్యక్తం చేసిన రామకోటి రామరాజు**

**గత 28 ఏళ్లుగా రామనామ ప్రచారమే ఊపిరిగా సేవలు**



**గజ్వేల్ - మనసులో మాట**

శ్రీరామనవమి నాడు భద్రాచలంలో అంగరంగ వైభవంగా జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవంలో వినియోగించే అత్యంత పవిత్రమైన 'గోటి తలంబ్రాల'ను సిద్ధం చేసే అరుదైన అవకాశం గజ్వేల్ పట్టణానికి చెందిన 'శ్రీరామకోటి భక్త సమాజం' ధార్మిక సేవా సంస్థకు ముచ్చటగా నాలుగోసారి దక్కింది. ఈ మేరకు భద్రాచలం దేవస్థానం నుంచి పిలుపు వచ్చినట్లు సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు తెలిపారు. గోటి తలంబ్రాల దీక్షలో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అనేక ధార్మిక సంస్థలు పోటీ పడుతున్నప్పటికీ, గజ్వేల్ రామకోటి సంస్థకే వరుసగా నాలుగో ఏడాది కూడా ఈ అవకాశం దక్కడం విశేషం. శనివారం గజ్వేల్‌లో జరిగిన రామకోటి కార్యక్రమంలో రామరాజు మాట్లాడుతూ.. గత 28 సంవత్సరాలుగా రామ నామమే ప్రాణంగా భావించి, ప్రతి భక్తునిచే రామకోటిని లిఖింపజేస్తూ ముక్తి మార్గాన్ని చూపుతున్న తమ సంస్థ సేవలను గుర్తించి భద్రాచలం దేవస్థానం ఈ బాధ్యతను అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భక్తుల భక్తిభావానికి మెచ్చి దేవస్థానం వారు ఏటా వడ్ల పరిమాణాన్ని పెంచుతూ వస్తున్నారని తెలిపారు. 2023లో 20 కిలోలు, 2024లో 150 కిలోలు, 2025లో 250 కిలోల వడ్లను ఇవ్వగా, ఈ ఏడాది తమ సంస్థపై ఉన్న అపార నమ్మకంతో ఏకంగా 300 కిలోల వడ్లను కేటాయించారని వివరించారు. గ్రామగ్రామాన గోటి తలంబ్రాల తయారీకి శ్రీకారం చుట్టిన ఘనత తమ సంస్థదేనని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల భక్తులు ఇందులో భక్తిశ్రద్ధలతో పాల్గొంటారని చెప్పారు. ఈ గోటి తలంబ్రాల తయారీ కోసం కేటాయించిన వడ్లను తీసుకొచ్చేందుకు త్వరలోనే తమ బృందం భద్రాచలం వెళ్లనున్నట్లు రామరాజు వెల్లడించారు. సీతారాముల సేవలో తరించడం తమ పూర్వజన్మ సుకృతమని ఆయన పేర్కొన్నారు.

# నిరంతరాయంగా 167 వారాలు.. 'హోప్' అన్నదానానికి విశేష స్పందన

***ఒక్కరోజే 2455 మందికి భోజన సౌకర్యం.. గంగారంలో హోప్ ఫౌండేషన్ సేవలు -ఆకలి తీర్చడమే నిజమైన సంతృప్తి: చైర్మన్ కొండ విజయ్ కుమార్***

**(శేరిలింగంపల్లి - మనసులో మాట)**

పేద ప్రజల ఆకలి తీర్చడమే లక్ష్యంగా హోప్ ఫౌండేషన్ చేపట్టిన అన్నదాన యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. శేరిలింగంపల్లి గంగారంలోని హోప్ కార్యాలయం వద్ద ఫౌండేషన్ ఆధ్వర్యంలో 167వ వారం అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. సుమారు 2455 మంది ప్రజలు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్, ఇతర సభ్యులతో కలిసి ప్రజలకు స్వయంగా అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా చైర్మన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆకలితో ఉన్నవారికి కడుపునిండా అన్నం పెట్టి వారి ఆకలి తీర్చడంలో తనకు ఎంతో ఆత్మసంతృప్తి లభిస్తుందని అన్నారు.



# చెరువులో చెత్త వేస్తే రూ. 1000 జరిమానా!

**కుడి చెరువు పరిరక్షణకు వెల్దుర్తి పంచాయతీ కఠిన నిర్ణయం**

**నిబంధనలు ఉల్లంఘించిన వారి వీడియో/ఫోటో పంపితే పారితోషికం**

**పశువులు, ప్రజల ఆరోగ్యం కోసమే ఈ నిబంధన: వార్డు సభ్యుడు మహేందర్ గౌడ్**



(వెల్దుర్తి - మనసులో మాట)

గ్రామంలోని నీటి వనరులను కాపాడుకునేందుకు, ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు మెదక్ జిల్లా వెల్దుర్తి గ్రామ పంచాయతీ కఠిన నిర్ణయం తీసుకుంది. మండల కేంద్రంలోని కుడి చెరువును కాలుష్యం బారి నుంచి కాపాడేందుకు నడుం బిగించింది. ఇకపై చెరువులో గానీ, చెరువు కట్టపై గానీ ఎవరైనా వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారం వేస్తే వారికి వెయ్యి రూపాయల (రూ. 1000) జరిమానా విధించనున్నట్లు 8వ వార్డు సభ్యుడు అంగడిపేట మహేందర్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి బలరాం రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త వేయడం వల్ల నీరు కలుషితమై పశువులు, ఇతర మూగజీవాలు ప్రమాదాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బట్టలు ఉతికేందుకు చెరువుకు వచ్చే గ్రామస్థులు కలుషిత నీటి కారణంగా చర్మ వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని తెలిపారు. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదన్నారు. ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘించి చెరువులో చెత్త వేస్తుంటే.. వారిని ఫోటోలు లేదా వీడియోలు తీసి గ్రామ పంచాయతీకి సమాచారం అందించాలని కోరారు. అలా సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం (రివార్డు) ఇస్తామని ప్రకటించారు. వార్డు అభివృద్ధికి, చెరువుల పరిరక్షణకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రామగుండంలో ఘనంగా తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు

**అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కటింగ్..**

**రాబోయే ఎన్నికల్లో సత్తా చాటుతాం**

**బీసీల హక్కుల కోసమే టీఆర్పీ పుట్టింది: రామగుండం నాయకులు**



పెద్దపల్లి - మనసులో మాట

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) అధినేత తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలను రామగుండంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాసిపేట ఉదయ్ ఆదేశాల మేరకు రామగుండం మండల, పట్టణ అధ్యక్షులు గుంటి ఆంజనేయులు, మంద వెంకటేష్‌ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. రామగుండంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీఆర్పీ అనేది బడుగు బలహీన వర్గాల (బీసీల) హక్కుల కోసం పుట్టిన పార్టీ అని, వచ్చే ఎన్నికల్లో బీసీ అభ్యర్థులనే నిలబెట్టి గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించి తమ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మల్లన్న అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నశంకరంపేటలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ

**గ్రామీణ ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం**

**ఘనంగా ప్రారంభించిన తహసీల్దార్, ఎస్సై, ఎంఈఓ**

**క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది: తహసీల్దార్ మాలతి**

**జడ్పీ స్కూల్ మైదానంలో విద్యార్థుల ఉత్సాహం**



చిన్నశంకరంపేట - మనసులో మాట

గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న 'చీఫ్ మినిస్టర్స్ (సీఎం) కప్-2026' క్రీడా పోటీలకు చిన్నశంకరంపేట సిద్ధమైంది. ఇందులో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 'సీఎం కప్-2026 టార్చ్ ర్యాలీ'ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ మాలతి, ఎస్సై నారాయణ గౌడ్, ఎంఈఓ పుష్పవేణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాలతి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని అన్నారు. క్రీడలు ఆడటం వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు పరస్పర స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. ఈ పోటీల్లో మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జిల్లా, రాష్ట్ర, తద్వారా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని, యువత క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర్ల చంద్రశేఖర్, హెచ్‌ఎం దీప్లా రాథోడ్, ఎస్టీయూ (రూఖ) జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి

- అతివేగమే ప్రమాదాలకు ప్రధాన కారణం
- యువతే ఎక్కువగా రోడ్డు ప్రమాదలకు బలవుతున్నారని ఆందోళన
- మీ కోసం కాదు.. మీ కుటుంబం కోసం హెల్మెట్
- అతివేగం కుటుంబాలను అనాథల్ని చేస్తుంది
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్



మెదక్- మనసులో మాట

రాష్ట్రంలో జరుగుతున్న హత్యల కంటే రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారి సంఖ్యే ఎక్కువగా ఉందని, ఇది ఆందోళనకరమని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత అతివేగం కారణంగా రోడ్డు ప్రమాదాలకు బలవుతున్నారని, తద్వారా ఆయా కుటుంబాలు అనాథలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వీక్లీ పరేడ్‌కు ఆయన హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం 'అరైవ్ అలైవ్' (సురక్షితంగా చేరుకోండి) రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. అజాగ్రత్తగా వాహనాలు నడపడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని అడిషనల్ ఎస్పీ తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని, నిర్ణీత వేగ పరిమితుల్లోనే వాహనాలు నడపాలని సూచించారు. యువతకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకే ప్రతి గ్రామంలోనూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిబ్బంది విధి నిర్వహణలో అయినా, వ్యక్తిగత పనుల మీదైనా బయటకు వెళ్తే.. వారు క్షేమంగా తిరిగి రావాలని ఇంట్లో కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారని గుర్తుచేశారు. అందుకే హెల్మెట్ అనేది కేవలం పోలీసుల కోసం కాదని, మీ కుటుంబం కోసం ధరించాలని హితవులికారు. విధి నిర్వహణలో సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలనతో పాటు శారీరక దృఢత్వం (ఫిజికల్ ఫిట్‌నెస్) కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ సిబ్బందితో కలిసి రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. "భారత పౌరుడిగా మోటారు వాహన చట్టాన్ని పాటిస్తానని, ఇతరుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుంటానని, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించబోనని" సిబ్బందిచేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, సీఐలు జార్జ్, మహేష్, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ పోరులో 'టీఆర్పీ' జెండా ఎగురవేస్తాం



- బీసీల హక్కుల కోసమే మా పోరాటం: కాసిపేట ఉదయ్
- పెద్దపల్లిలో ఘనంగా తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు
- ఆసుపత్రిలో పండ్లు పంపిణీ, రక్తదాన శిబిరం ఏర్పాటు
- పార్టీలో చేరికలు, నూతన కమిటీల నియామకం

పెద్దపల్లి - మనసులో మాట

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) అధినేత తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలను పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాసిపేట ఉదయ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. మల్లన్న పుట్టినరోజును పురస్కరించుకుని పెద్దపల్లి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే మానవతా దృక్పథంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 'రక్తదానం.. ఒకరి ప్రాణదానంతో సమానం' అని ఈ సందర్భంగా నాయకులు నినదించారు. అనంతరం పెద్దపల్లి బస్టాండ్ కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాసిపేట ఉదయ్ మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీఆర్పీ అనేది బీసీల హక్కుల కోసం పుట్టిన పార్టీ అని, రాబోయే ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించి టీఆర్పీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా నూతన కమిటీలను నియమించారు. పెద్దపల్లి మండల అధ్యక్షుడిగా మెరుగు చందర్‌ను, ధర్మారం మండల యువజన అధ్యక్షుడిగా నెరువట్ల నరేష్‌ను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. అలాగే ఇతర పార్టీల నుంచి స్వచ్ఛందంగా వచ్చిన పలువురు మహిళలను కాసిపేట ఉదయ్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ మండల, పట్టణ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మల్లన్న అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు
# ప్రత్యామ్నాయం 'జాగృతి'

- రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతాం.. అసెంబ్లీ నాటికి బలమైన శక్తిగా ఎదుగుతాం
- కవితతో లబ్ధి పొంది.. ఇప్పుడు విమర్శించడం సిగ్గుచేటు
- బీసీలకు బడ్జెట్, రిజర్వేషన్లు కల్పించాలి: జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్



గజ్వేల్ - మనసులో మాట

రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ధీటైన ప్రత్యామ్నాయ శక్తిగా 'జాగృతి' ఎదుగుతోందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో బలమైన శక్తిగా రూపుదిద్దుకుంటామని ప్రకటించారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయని యాదగిరి ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని, ప్రజా కోర్టులో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేస్తామని తెలిపారు. మరోవైపు, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని విమర్శించారు. ఆ పార్టీలో ముఖ్య నేతలుగా ఎదిగిన కొందరు.. అందినకాడికి దోచుకుని, పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తల సంక్షేమాన్ని గాలికొదిలేశారని మండిపడ్డారు. జాగృతి అధినేత కల్వకుంట్ల కవితపై జరుగుతున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. గతంలో కవిత ద్వారా రాజకీయంగా, వ్యక్తిగతంగా లబ్ధి పొందిన నేతలే.. నేడు ఆమెను విమర్శించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారికి ఆమెను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. 42 శాతం రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు తగిన బడ్జెట్ కేటాయించాలని, అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 'కామారెడ్డి డిక్లరేషన్' అమలయ్యే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను ఏకం చేసి హక్కుల సాధన కోసం పోరాడుతామని తెలిపారు.

# శిక్ష కోసం కాదు.. మీ ప్రాణ రక్షణ కోసమే!

**హెల్మెట్ ధరించడం తప్పనిసరి.. వెనుక కూర్చున్న వారికి కూడా మస్ట్**

**తలకు తగిలే గాయాల వల్లే అధిక మరణాలు: మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు**

**'అరైవ్ అలైవ్ ఉ 2026' ద్వారా గ్రామాలు, కాలేజీల్లో విస్తృత అవగాహన**



మెదక్ - మనసులో మాట

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడాన్ని కేవలం ఒక చట్టపరమైన నిబంధనగా మాత్రమే చూడకూడదని, అది తమ వ్యక్తిగత ప్రాణ రక్షణకు కవచం లాంటిదని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు స్పష్టం చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల జరిగే చిన్న ప్రమాదాలు కూడా తీవ్రమైన గాయాలకు లేదా ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాద గణాంకాలను విశ్లేషిస్తే.. అధిక శాతం మరణాలు తలకు బలమైన గాయాలు కావడం వల్లే సంభవిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. అందుకే వాహనం నడిపే వ్యక్తితో పాటు, వెనుక కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. నాణ్యత లేని హెల్మెట్లు కాకుండా, ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్లు మాత్రమే వాడాలని సూచించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్ ఉ 2026' (సురక్షితంగా చేరుకోండి) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. దీనిలో భాగంగా కళాశాలలు, గ్రామాలు, ప్రధాన కూడళ్లలో అవగాహన సదస్సులు, ర్యాలీలు, ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేస్తున్నామన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే, పోలీసులు విధించే జరిమానాలను శిక్షగా భావించవద్దని, అది ప్రజల ప్రాణాల భద్రత కోసమేనని గ్రహించాలన్నారు.




# క్రీడాకారుల కార్ఖానాగా 'డబ్బ' గ్రామం

- ఆటపాటల్లో యువత జోరు
- చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్న విద్యార్థులు
- క్రికెట్, కబడ్డీ, వాలీబాల్‌లో దూసుకెళ్తున్న యువకిశోరాలు
- ఐక్యతకు, ఆరోగ్యానికి వేదికవుతున్న మైదానాలు
- గ్రామీణ క్రీడలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న డబ్బ

కొమురభీం జిల్లా -మనసులో మాట

'గ్రామీణ ప్రాంతాలే క్రీడలకు పట్టుకొమ్మలు' అనే మాటకు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, చింతలమానెపల్లి మండలంలోని 'డబ్బ' గ్రామం నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. ఒకప్పుడు చదువుకే పరిమితమైన ఇక్కడి యువత.. ఇప్పుడు క్రీడా మైదానాల్లో కొత్త ఉత్సాహంతో పరుగులు తీస్తోంది. ఓటమిని లెక్కచేయకుండా గెలుపే లక్ష్యంగా యువకులు చిందిస్తున్న చెమట చుక్కలు ఆ గ్రామాన్ని క్రీడా వేదికగా మారుస్తున్నాయి.

## ఆటపాటల్లో అదుర్స్..

గ్రామ యువకులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. క్రీడలు వారిలో శారీరక దృఢత్వాన్నే కాకుండా, మానసిక ఉల్లాసాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నాయి. ఎండనకా, వాననకా సాధన చేస్తూ మైదానంలో వారు చూపిస్తున్న పట్టుదల ప్రశంసనీయంగా ఉంది.

## ఐక్యతకు, ఆరోగ్యానికి బాటలు

క్రీడలు కేవలం వినోదం కోసమే కాకుండా, గ్రామస్తుల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంచే సాధనంగా మారాయి. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఆడుతుండటంతో గ్రామంలో సామరస్యం వెల్లివిరుస్తోంది. దీనికి తోడు గ్రామ పెద్దల ప్రోత్సాహం యువకులకు కొండంత అండగా నిలుస్తోంది. శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇస్తూ యువత వ్యాయామం, క్రీడల వైపు మళ్లడం ఆరోగ్యకరమైన సమాజానికి శుభసూచకం.

## జాతీయ స్థాయి లక్ష్యంగా..

డబ్బ గ్రామ యువత చూపిస్తున్న ఈ క్రీడా స్ఫూర్తి భవిష్యత్తులో మంచి ఫలితాలను ఇస్తుందనడంలో సందేహం లేదు. ఇదే ఉత్సాహంతో ముందుకెళ్లి జాతీయ స్థాయిలో పతకాలు సాధించి, గ్రామానికి, జిల్లాకు పేరు తేవాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు. డబ్బ గ్రామం చూపిస్తున్న ఈ స్ఫూర్తి మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికే 'ప్రజా బాట'

క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు.. అంబేద్కర్ చౌరస్తాలో స్తంభాల ఏర్పాటు
ప్రమాదాల నివారణపై వినియోగదారులకు అవగాహన
సమస్యలుంటే మా దృష్టికి తీసుకురండి: లైన్ ఇన్‌స్పెక్టర్ గంగారాం నాయక్




గొల్లపల్లి - మనసులో మాట

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు 'ప్రజా బాట' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం అధికారులు మండలంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లైన్ ఇన్‌స్పెక్టర్ (లైన్ మెన్) గంగారాం నాయక్ మాట్లాడుతూ.. మండలంలోని అంబేద్కర్ చౌరస్తా పరిధిలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న అంతరాయాలు, ఇతర సమస్యల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించడానికే ఈ ప్రజా బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.తరచూ జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించారు. విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ దుబ్బ రాజం, ఏఎల్ఎం (సహాయ లైన్ మెన్) అనిల్, విద్యుత్ శాఖ సిబ్బంది సిరికొండ చంద్రశేఖర్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# యువత రహదారి భద్రతకు ఆదర్శంగా నిలవాలి

మద్నూర్‌లో రవాణా శాఖ అవగాహన సదస్సు
మద్యం సేవించి వాహనాలు నడపొద్దు: ఏఎంవీఐ శంకర్
డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై కీలక సూచనలు

జుక్కల్- మనసులో మాట

కామారెడ్డి జిల్లా రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని మద్నూర్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహన చోదకులకు (డ్రైవర్లకు) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో రవాణా శాఖ అధికారులు పాల్గొని రహదారి భద్రతపై కీలక సూచనలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) శంకర్ మాట్లాడుతూ.. యువత రహదారి భద్రత విషయంలో పదిమందికీ ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని, అజాగ్రత్త వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయని హెచ్చరించారు. రహదారి నిబంధనలు ఖచ్చితంగా పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని డ్రైవర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో మరో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రఫీ, ఇతర సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

# 21న ధర్మపురికి డిప్యూటీ సీఎం.. ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అడ్లూరి

- రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, రూ. 17 కోట్లతో సీవరేజ్ ప్లాంట్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- జూనియర్ కళాశాల మైదానాన్ని సందర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



గొల్లపల్లి - మనసులో మాట

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఈ నెల 21వ తేదీన ధర్మపురిలో పర్యటించనున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ పర్యటన ఏర్పాట్లలో భాగంగా శనివారం గొల్లపల్లి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. హెలిపాడ్, సభా వేదిక ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు, కాంగ్రెస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. ధర్మపురి ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి భారీగా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా రూ. 200 కోట్లతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల' భవనానికి, గోదావరి నది కలుషితం కాకుండా రూ. 17 కోట్లతో ఏర్పాటు చేయనున్న సీవరేజ్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. టీఎఫ్ఐడీ (పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి) నిధుల కింద రూ. 15 కోట్లతో ధర్మపురి పట్టణంలో ఇప్పటికే అనేక పనులు చేశామని మంత్రి వెల్లడించారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను మార్చడానికి, కొత్త స్తంభాల ఏర్పాటుకు రూ. 4 కోట్లు మంజూరు చేశామన్నారు. ధర్మపురి పట్టణంలోని అన్ని కుల సంఘ భవనాల నిర్మాణానికి రూ. 2 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే అనేక పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులకు డిప్యూటీ సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటి ముంగిటకే 'విద్యుత్' పరిష్కారం

సమస్య ఏదైనా 'ప్రజా బాట'లో అక్కడికక్కడే పరిష్కారం
నాణ్యమైన విద్యుత్ సరఫరాయే మా లక్ష్యం: జూలపల్లి ఏఈ హరీష్
వెంకట్రావుపల్లిలో విద్యుత్ అధికారుల ప్రత్యేక డ్రైవ్




(జూలపల్లి - మనసులో మాట)

క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను గుర్తించి, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ 'ప్రజా బాట' పట్టింది. జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ మచ్చ అరుణ యాదగిరి ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు 'ప్రజా బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జూలపల్లి విద్యుత్ ఏఈ హరీష్ మాట్లాడుతూ.. వినియోగదారుల వద్దకు నేరుగా వెళ్లి వారి కష్టాలను తెలుసుకోవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రధానంగా లో-వోల్టేజ్ సమస్యలు, వేలాడుతున్న లూజ్ వైర్లు, అధిక బిల్లులు, ట్రాన్స్‌ఫార్మర్ లోపాలు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం వంటి సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందిస్తూ, శాఖపై నమ్మకం పెంచేలా తమ సేవలు ఉంటాయని స్పష్టం చేశారు. విద్యుత్ సమస్యలు ఏవైనా ఉంటే ఈ ప్రజా బాటను సద్వినియోగం చేసుకోవాలని, లేదంటే 1912 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నేరేడుగొమ్మ సాగర్ రావు, లైన్‌మెన్ మొగిలి, జేఎల్ఎం అరవింద్, మచ్చ యాదగిరి, ఉప సర్పంచ్ పర్లపల్లి రవి, వార్డు సభ్యులు, మంద స్వామి, వేల్పుల సందీప్, రేచావేని మల్లయ్య, కొమ్మ భూమయ్య, కారోబార్ ఆంజనేయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జూలపల్లిలో 11 రోజుల పాటు 'అష్టాంగ యోగా' ప్రత్యేక శిక్షణ

సోమవారం నుంచి శిబిరం ప్రారంభం.. కరపత్రాల ఆవిష్కరణ
యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం
వివరాలు వెల్లడించిన యోగా గురువు శ్రీకోటి కళింగరాజు




జూలపల్లి - మనసులో మాట

ప్రజల్లో ఆరోగ్య స్పృహను పెంపొందించేందుకు జూలపల్లి మండల కేంద్రంలో సోమవారం నుంచి 11 రోజుల పాటు 'అష్టాంగ యోగా' ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా గురువు శ్రీకోటి కళింగరాజు తెలిపారు. శనివారం జూలపల్లిలో యోగా సాధకులతో కలిసి ఆయన శిక్షణ శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అలాగే శిబిరంపై అవగాహన కల్పించేందుకు పరిచయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు కళింగరాజు మాట్లాడుతూ.. అష్టాంగ యోగా సాధన ద్వారా శారీరక, మానసిక వికాసం కలుగుతుందని, సురక్షితమైన పద్ధతుల్లో శరీర శుద్ధి జరుగుతుందని వివరించారు. ఈ శిబిరంలో ఆధునిక పద్ధతుల్లో 'శంకుప్రక్షాళన', వ్యక్తిత్వ వికాసం, మనోబలాన్ని పెంచేందుకు ప్రత్యేక తరగతులు ఉంటాయని తెలిపారు.మన పూర్వీకులు యోగాను జీవనశైలిలో భాగంగా చేసుకుని వందేళ్ల పాటు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా జీవించారని గుర్తుచేశారు. నేడు ప్రపంచమంతా భారతీయ యోగాను అనుసరిస్తుంటే, మనం మాత్రం దాని పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని హితవులికారు. జూలపల్లి పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకుని, సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అందె శివప్రసాద్, ఎలిగేటి శ్రీనివాస్, కనపర్తి రాజేందర్, అమరగాని ప్రదీప్ కుమార్, భాస్కర్, హన్మంత చారి తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేట చైర్మన్ పీఠం 'జనరల్ మహిళ'కే..

ఖరారైన మున్సిపల్ వార్డుల రిజర్వేషన్లు
కలెక్టరేట్‌లో డ్రా తీసిన అధికారులు.. ఆశావహుల్లో మొదలైన ఉత్కంఠ




రామాయంపేట - మనసులో మాట

రామాయంపేట మున్సిపాలిటీలో రాజకీయ ఉత్కంఠకు తెరపడింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మున్సిపల్ వార్డుల రిజర్వేషన్లతో పాటు చైర్మన్ పీఠం రిజర్వేషన్ కూడా ఖరారైంది. మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం అధికారులు నిర్వహించిన 'డ్రా' పద్ధతిలో రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఇందులో అత్యంత కీలకమైన రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పదవిని ఈసారి లిలి'జనరల్ మహిళ'లిలికు కేటాయించారు. దీంతో చైర్మన్ రేసులో ఉన్న పలువురు మహిళా నాయకుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

## వార్డుల వారీగా వివరాలు ఇలా..

మొత్తం 12 వార్డులకు గాను అధికారులు రిజర్వేషన్లను ప్రకటించారు. ఖరారైన జాబితా ప్రకారం.. 1వ వార్డును జనరల్ మహిళకు కేటాయించగా, 2వ వార్డు ఎస్సీ జనరల్ అభ్యర్థికి, 3వ వార్డు ఎస్టీ జనరల్ అభ్యర్థికి దక్కాయి. ఇక 4వ వార్డు ఎస్సీ మహిళకు రిజర్వ్ కాగా, 5వ వార్డు జనరల్ మహిళకు కేటాయించారు. 6వ మరియు 7వ వార్డులు రెండూ జనరల్ (జనరల్) అభ్యర్థులకు దక్కడంతో అక్కడ పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. అలాగే 8వ మరియు 9వ వార్డులను బీసీ జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. 10వ వార్డు, 11వ వార్డులు జనరల్ మహిళలకు రిజర్వ్ అయ్యాయి. చివరిదైన 12వ వార్డు బీసీ మహిళకు దక్కింది. రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆయా వార్డుల్లోని ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

# పారదర్శకంగా వార్డుల రిజర్వేషన్లు ఖరారు

- లాటరీ పద్ధతిలో కేటాయింపు.. రాజకీయ పార్టీల సమక్షంలో ప్రక్రియ
- మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీలకు మోక్షం
- ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే ఎంపిక: కలెక్టర్ రాహుల్ రాజ్



(మెదక్ - మనసులో మాట)

రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ జిల్లాలోని మున్సిపాలిటీ వార్డుల మహిళా రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వెల్లడించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని మెదక్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 32 వార్డులు, నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15 వార్డులు, తూప్రాన్ మున్సిపాలిటీలోని 16 వార్డులు, అలాగే రామాయంపేట మున్సిపాలిటీలోని 12 వార్డులకు సంబంధించిన మహిళా రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగానే ఈ రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. బీసీల డెడికేషన్ కమిషన్ నివేదిక ప్రకారం బీసీ రిజర్వేషన్లను, 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ప్రామాణికంగా తీసుకున్నామని వివరించారు. ఇక మహిళా రిజర్వేషన్లను 'జీవో 9' (ప్రభుత్వ ఉత్తర్వులు) ప్రకారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ పద్ధతి ద్వారా కేటాయించామని పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి లోపాలకు తావులేకుండా రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగానే ఈ కేటాయింపులు జరిగాయని కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ప్రత్యేక అధికారి సంధ్య, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మెదక్ కలెక్టరేట్‌కు చేరిన 'స్వచ్ఛభారత్ యాత్ర'

- ప్లాస్టిక్ ఏరివేత కోసం రోజుకు 41 కిలోమీటర్ల పాదయాత్ర
- క్లీనప్ డ్రైవ్‌పై అధికారులు, కార్యదర్శులకు అవగాహన
- పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత: డిఆర్డిఓ పీడి శ్రీనివాసరావు



మెదక్ - మనసులో మాట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విజయవంతంగా కొనసాగుతున్న 'స్వచ్ఛభారత్ యాత్ర' వాహనం శనివారం మెదక్ కలెక్టరేట్‌కు చేరుకుంది. యాత్ర ఏడవ రోజులో భాగంగా జిల్లాకు వచ్చిన ఈ బృందానికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు 'క్లీనప్ డ్రైవ్'పై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పీడి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ.. ప్లాస్ట్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్లాస్టిక్ ఎగ్జిబిషన్‌కు సంబంధించి ఈ యాత్ర సాగుతోందన్నారు. స్వచ్ఛభారత్ సిబ్బంది ప్రతిరోజూ 41 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తూ, దారి పొడవునా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారని వివరించారు. సేకరించిన ప్లాస్టిక్‌ను యంత్రాల ద్వారా రీసైక్లింగ్ చేయడం, తడి చెత్త-పొడి చెత్తను వేరుచేసి వాటి ద్వారా కొత్త వస్తువులను తయారు చేయడం (వ్యర్థాల నుంచి సంపద) వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలోని ప్రజలు, స్వచ్ఛంద సేవకులు కలిసికట్టుగా తమ పరిసరాలను, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేసే కార్యక్రమమే 'క్లీనప్ డ్రైవ్' అని శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా చెత్తను ఏరివేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, మొక్కలు నాటడం వంటివి చేస్తారని అన్నారు. ఇది కేవలం పరిశుభ్రతనే కాకుండా, స్థానిక ప్రజల్లో పర్యావరణ స్పృహను పెంచుతుందని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఏడుపాయల జాతరకు పటిష్ట బందోబస్తు

- 250 మంది పోలీసులతో నిఘా.. 3 సెక్టార్లుగా విభజన
- భక్తుల భద్రతే మా ప్రాధాన్యం: అదనపు ఎస్పీ మహేందర్
- షీ టీమ్స్, సీసీటీవీ కెమెరాలతో జల్లెడ



(మెదక్ - మనసులో మాట)

మాఘ అమావాస్యను పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మెదక్ జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో చేపట్టిన ఈ భద్రతా ఏర్పాట్లను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ శనివారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం (బ్రీఫింగ్) చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, జాతర ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. బందోబస్తు నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించాలని ఆదేశించారు. క్యూ లైన్లు, బారికేడ్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జాతర బందోబస్తును మూడు సెక్టార్లుగా విభజించి, సుమారు 250 మంది అధికారులు, సిబ్బందితో పటిష్టమైన రక్షణ వలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతరను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులపై సీసీటీవీ కెమెరాలను అమర్చి జాతరను నిరంతరం గమనిస్తున్నట్లు వివరించారు. అలాగే మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా 'షీ టీమ్స్', మహిళా పోలీసు సిబ్బంది, మఫ్టీ బృందాలను రంగంలోకి దింపామన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, దొంగతనాలు, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తులు అధికారులు సూచించిన సురక్షిత ప్రదేశాల్లోనే స్నానాలు ఆచరించాలని, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని అదనపు ఎస్పీ కోరారు. వాహనాలను కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే నిలిపి పోలీసులకు సహకరించాలన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే 'డయల్ 100' లేదా సమీపంలోని పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్లను ధ్వంసం చేస్తే క్రిమినల్ కేసులు

- కేజీ వీల్స్‌తో రోడ్డెక్కితే వాహనాలు సీజ్.. జరిమానా తప్పదు
- ఇప్పటికే మూడు ట్రాక్టర్లపై చర్యలు: జూలపల్లి ఎస్సై సనత్ కుమార్

జూలపల్లి - మనసులో మాట

ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి వేసిన రోడ్లను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని జూలపల్లి ఎస్సై సనత్ కుమార్ హెచ్చరించారు. వ్యవసాయ పనుల కోసం వాడే ట్రాక్టర్లకు అమర్చే 'కేజీ వీల్స్' (ఇనుప చక్రాలు)తో తారు రోడ్లపై తిరిగితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. గత రెండు రోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో కేజీ వీల్స్‌తో తిరుగుతున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని, తహసీల్దార్ ద్వారా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..



సాధారణంగా 20 ఏళ్ల పాటు చెక్కుచెదరని రోడ్లు.. ఈ ఇనుప చక్రాల వల్ల కొద్దిరోజులకే దెబ్బతింటున్నాయని, దీంతో ప్రజాధనం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. రైతులు వ్యవసాయ పనుల కోసం రోడ్లపైకి వచ్చేటప్పుడు తప్పనిసరిగా కేజీ వీల్స్‌కు రక్షణ పట్టీలు (బిగింపులు) ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# ఆలయాల నూతన కమిటీల ఎంపికకు నోటిఫికేషన్ జారీ

జుక్కల్, జనవరి 17 (మనసులో మాట)

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోగల దేవాదాయ శాఖ ఆధీనంలో కొనసాగుతున్న వివిధ మండలాల పరిధిలోని ఆలయాలకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు కు గాను నిజామాబాద్ జిల్లా ఉమ్మడి సహాయ కమిషనర్ విజయ్ రామారావు నోటిఫికేషన్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వుల కాపీలను మద్నూర్ మండలంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ సలాబత్పూర్ ఆలయ అధికారులు మద్నూర్ మండల విలేకరులకు అందజేశారు. నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు కోసం గల దేవాలయాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. శ్రీ సోమలింగేశ్వరా దేవాలయం దుర్కి గ్రామం బిర్కూర్ మండలం, శ్రీ రామ మందిరం బిచ్కుంద గ్రామం మరియు మండలం, శ్రీ హనుమాన్ దేవాలయం ఎక్లరా బిగ్ గ్రామం మద్నూర్ మండలం, శ్రీ లక్ష్మి నారాయణ దేవాలయం మద్నూర్ గ్రామం మరియు మండలం, శ్రీ హనుమాన్ (మారుతీ)దేవాలయం సిరసముందర్ గ్రామం బిచ్కుంద మండలం, శ్రీ లక్ష్మి నారాయణ దేవాలయం దోమకొండ గ్రామం మరియు మండలం, శ్రీ వీరేశ్వరా స్వామి దేవాలయం కాచికపూర్ గ్రామం భిక్నూర్ మండలం పై దేవాలయాల ధర్మకర్తల మండలి కోసం నోటిఫికేషన్ విడుదల అయింది. ఈ దేవాలయాల నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు కోసం అప్లికేషన్స తీసుకొనబడునని, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహాయ కమీషనర్ ద్వారా ఉత్తర్వులు జారీ చేయబడ్డాయని, సలాబత్పూర్ ఆలయ అధికారులు తెలియజేశారు.

# భారత నౌకాదళ కొలువులో 'చందోలి' యువకుడు

**నేవీ 'సీనియర్ సెకండరీ రిక్రూట్'కు ఎంపికైన అంకతి నవీన్**

**డిగ్రీ చదువుతూనే ఎన్‌సీసీ ద్వారా సాధన.. దేశ సేవకే అంకితం**

**తల్లిదండ్రులు, గ్రామస్తుల హర్షం**

గొల్లపల్లి- మనసులో మాట



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చెందోలి గ్రామానికి చెందిన యువకుడు అంకతి నవీన్ భారత నౌకాదళంలో (ఇండియన్ నేవీ) ఉద్యోగం సాధించి గ్రామానికి వన్నె తెచ్చాడు. ఇటీవల విడుదలైన భారత నౌకాదళ 'సీనియర్ సెకండరీ రిక్రూట్' (ఎస్ఎస్ఆర్) ఫలితాల్లో నవీన్ ప్రతిభ కనబరిచి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దేశ సేవ చేయాలనే సంకల్పంతో.. చెందోలికి చెందిన అంకతి తిరుపతి-సమత దంపతుల కుమారుడైన నవీన్.. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో ఎన్‌సీసీలో చేరాడు. డిగ్రీ చదువుతూనే మరోవైపు నౌకాదళ పరీక్షలకు కఠోర సాధన చేశాడు. గత సంవత్సరం రాత పరీక్షతో పాటు, శారీరక సామర్థ్య పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకుని ఇప్పుడు కొలువు సాధించాడు. చిన్న వయసులోనే దేశ రక్షణ రంగంలో ఉద్యోగం సాధించడం పట్ల నవీన్ తల్లిదండ్రులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**వాడ్కపూర్ పిల్లలకు షటిల్ బ్యాట్లు, నెట్‌ల పంపిణీ**



జూలపల్లి- మనసులో మాట

పిల్లలు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని జూలపల్లి మండలం వాడ్కపూర్ గ్రామ 8వ వార్డు సభ్యులు వేల్పుల ఓదెలు పిలుపునిచ్చారు. శనివారం గ్రామంలోని మహారాజుల కాలనీకి చెందిన పిల్లలకు సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన షటిల్ బ్యాట్లు, నెట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓదెలు మాట్లాడుతూ.. పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత ఉదయం, సాయంత్రం వేళల్లో కాసేపు ఆడుకోవాలని సూచించారు. క్రీడలు ఆడటం వల్ల అది ఒక వ్యాయామంలా మారి శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రీడల్లో రాణిస్తూ, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా రేపటి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లారపు సంతోష్ కుమార్, జెట్టి సతీష్, కన్నం రామనారాయణ, మోదుంపెల్లి రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా కె. హరిత

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

ఆసిఫాబాద్ - మనసులో మాట



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు నూతన జిల్లా కలెక్టర్‌గా కె. హరిత (ఐఏఎస్) నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనపరమైన బదిలీల్లో భాగంగా ఈ నియామకం చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కలెక్టర్‌గా నియమితులైన హరిత గారు త్వరలోనే జిల్లా కేంద్రానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఆమె తనదైన ముద్ర వేస్తారని జిల్లా ప్రజలు, అధికారులు ఆశిస్తున్నారు.

# చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లకు గ్రీన్ సిగ్నల్



## భక్తి పారవశ్యంలో మునిగిపోయిన స్టార్ క్రికెటర్లు

భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న నిర్ణయాత్మకమైన మూడో వన్డే కోసం టీమిండియా ఇప్పటికే ఇండోర్ చేరుకుంది. సిరీస్ 1-1 తో సమానంగా ఉండటంతో, గెలుపు గుర్రం ఎక్కాలనే కసితో ఆటగాళ్లు ఉన్నారు. అయితే మైదానంలో చెమటోడ్చడమే కాకుండా, దైవబలం కోసం టీమిండియా స్టార్ ప్లేయర్లు ఇప్పుడు ఆధ్యాత్మిక బాట పట్టారు. ఇండోర్‌కు అతి సమీపంలో ఉన్న ఉజ్జయినిలోని మహాకాళేశ్వర జ్యోతిర్లింగాన్ని విరాట్ కోహ్లీ, కుల్దీప్ యాదవ్ శనివారం తెల్లవారుజామున సందర్శించుకున్నారు. భారత క్రికెట్ జట్టులో ఇప్పుడు ఆధ్యాత్మిక ధోరణి బాగా కనిపిస్తోంది. కీలకమైన మ్యాచ్‌లకు ముందు ఆటగాళ్లు ఉజ్జయిని మహాకాళుడిని దర్శించుకోవడం ఒక ఆనవాయితీగా మారింది. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు జరిగే అత్యంత పవిత్రమైన భస్మ హారతిలో విరాట్ కోహ్లీ, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు ఆలయ ప్రాంగణంలోనే గడిపిన వీరు, నంది హాల్‌లో కూర్చుని పరమశివుని నామస్మరణలో మునిగిపోయారు. గర్భాలయ చౌకట్ నుంచి స్వామివారిని దర్శించుకుని జలాభిషేకం చేశారు. ఆలయ కమిటీ వారికి స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని బహుకరించింది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఉజ్జయిని మహాకాళేశ్వరాలయం అత్యంత విశిష్టమైనది. ఇది దక్షిణాభిముఖ జ్యోతిర్లింగం కావడం దీని ప్రత్యేకత. ఇక్కడ జరిగే భస్మ హారతి ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో పూజలు చేస్తే అకాల మృత్యు భయం తొలగిపోతుందని, తలపెట్టిన కార్యాల్లో విజయం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే కేవలం క్రికెటర్లే కాదు, బాలీవుడ్ సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు తమ కెరీర్‌లో కష్టకాలం ఎదురైనప్పుడు లేదా పెద్ద విజయాలు సాధించినప్పుడు ఇక్కడికి వస్తుంటారు. కెఎల్ రాహుల్, గౌతమ్ గంభీర్ కూడా నిన్ననే ఈ ఆలయాన్ని సందర్శించడం విశేషం

## బంగ్లాదేశ్ సారథికి ఆయుశ్ మాత్రే నో షేక్‌హ్యాండ్

అండర్ 19 వరల్డ్‌కప్‌లో భాగంగా బులవాయో వేదికగా భారత్ - బంగ్లాదేశ్ యువ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన టీమ్ఇండియా తొలుత బ్యాటింగ్‌కు దిగింది. అయితే అంతకుముందు మైదానంలో అసక్తికర సంఘటన జరిగింది. టాస్ సమయంలో భారత్ కెప్టెన్ ఆయుశ్ మాత్రే, బంగ్లాదేశ్ సారథికి షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు! ప్రస్తుతం క్రీడావర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.ప్రస్తుతం భారత్- బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బంగ్లాలో హిందువులపై దాడుల నేపథ్యంలో ఆ దేశంలో దౌత్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. ఈ కాంట్రవర్సీ క్రికెట్‌దాకా వచ్చింది. దీంతో ఇరుదేశాల మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఈ క్రమంలో తాజా మ్యాచ్‌లో టాస్ సమయంలో బంగ్లా కెప్టెన్ జవేద్ అబ్రార్‌తో టీమ్ఇండియా కెప్టెన్ ఆయుశ్ మాత్రే షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు. దీంతో ఇది క్రీడావర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే దీనిపై అటు బంగ్లాగానీ, భారత్‌గానీ అధికారికంగా స్పందించలేదు. బంగ్లాలో హిందువులపై దాడుల నేపథ్యంలో ఆ దేశ పేస్ బౌలర్ ముస్తాఫిజుర్‌ను బీసీసీఐ ఐపీఎల్ నుంచి తప్పించింది. బోర్డు ఆదేశాల మేరకు వేలంలో ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేసిన కోల్‌కతా ఫ్రాంచైజీ అతడిని జట్టులోంచి రిలీజ్ చేసింది. దీంతో ప్రతి చర్యగా వచ్చే నెలలో భారత్ వేదికగా జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్ జట్టును ఇక్కడికి పంపేందుకు బీసీబీ నిరాకరిస్తోంది. భారత్‌లో కాకుండా శ్రీలంకలో తమ మ్యాచ్‌లు ఆడేలా రీ షెడ్యూల్ చేయాలని ఇటీవల ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. దీనిపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. అయితే ఈ వ్యవహారంపై ఐసీసీ ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.గతేడాది పహల్గామ్? ఉగ్రగాడికి నిరసనగా ఆసియా కప్?లో భారత సీనియర్ క్రికెటర్లు పాకిస్థాన్?తో కరచాలనం చేయలేదు. ఆ టోర్నీలో పాక్?తో మూడుసార్లు భారత్ తలపడగా, మూడుసార్లు కూడా మన ప్లేయర్లు దాయాది జట్టు ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. ఫైనల్‌లో నెగ్గిన తర్వాత కూడా పాకిస్థాన్?కు చెందిన మోసిన్ నఖ్వీ చేతిలమీదుగా ట్రోఫీని అందుకునేందుకు టీమ్ఇండియా నిరాకరించింది. దీంతో నఖ్వీ ఈ ట్రోఫీని తనతోపాటు తీసుకెళ్లాడు. ఆ ట్రోఫీ ఇంకా భారత్?కు అందలేదు. ప్రస్తుతం దీనిపై కూడా కాంట్రవర్సీ నడుస్తోంది. 2025 మహిళల వన్డే వరల్డ్?కప్?లో భారత్- పాకిస్థాన్ మధ్య మ్యాచ్?లోనూ ఇదే పునరావృతం అయ్యింది. పురుషుల క్రికెట్?లోలాగే మహిళలు కూడా పాకిస్థాన్ క్రికెటర్లకు షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. టాస్ సమయంలోగానీ, మ్యాచ్? ముగిసిన తర్వాతగానీ టీమ్ఇండియా ప్లేయర్లు పాకిస్థాన్ క్రీడాకారిణులతో కరచాలనం చేయలేదు. ఇదే పాలసీని ఇప్పుడు యువ భారత జట్టు కూడా కొనసాగించింది.తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 48.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించారు. అభిజ్ఞాన్ కుందు (80; 112 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), వైభవ్ సూర్యవంశీ (72; 67 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. కనిష్క్ చౌహాన్ (28) ఫర్వాలేదనిపించాడు. ఆయుష్ మాత్రే (6), వేదాంత్ త్రివేది (0) నిరాశపర్చడంతో ఆరంభంలోనే భారత్ 12 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. బంగ్లాదేశ్ బౌలర్లలో ఫహద్ 5, ఇక్బాల్ 2, హకీమ్ తమీమ్ 2, పావెజ్ జిబోన్ ఒక వికెట్ పడగొట్టారు.

## కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం కీలక ప్రకటన



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్యాన్స్?కు కిక్కిచ్చే న్యూస్. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఇంటర్నేషనల్, ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ బోర్డుకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ మేరకు అనుమతి లభించినట్లు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం శనివారం ప్రకటించింది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు సూచించిన నిర్దిష్ట నిబంధనలు, షరతులకు అనుగుణంగానే చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణ ఉంటుందని తెలిపింది. 'ఇంటర్నేషనల్, ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించడానికి కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌కు హోం శాఖ, కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ప్రకటించడానికి మేం సంతోషిస్తున్నాం' అని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ బోర్డు ఓ ప్రకటనలో పేర్కొంది. దీంతో 2026 ఐపీఎల్?లో ఆర్సీబీ హోం గ్రౌండ్ మ్యాచ్?లు చిన్నస్వామిలోనే నిర్వహించనున్నారు. ఈ వార్తతో ఆర్సీబీ ఫ్యాన్స్?లో జోష్ నిండినట్లైంది.కాగా, 2025 ఐపీఎల్?లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవడంతో జూన్ 04న చిన్నస్వామి స్టేడియంలో సక్సెస్ సంబరాలు నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు ఊహించిన దానికంటే అధికంగా అభిమానులు రావడంతో స్టేడియం బయట తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో ఘటనలో 11 మంది మృతి చెందారు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. దీంతో ఈ ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైకెల్ డి.కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ వేసింది.చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌ల నిర్వహణకు సురక్షితం కాదని ఈ కమిషన్ తేల్చింది. దీంతో ఆ తర్వాత ఈ స్టేడియంలో నిర్వహించేందుకు షెడ్యూల్ చేసిన అన్ని మ్యాచ్?లను షిఫ్ట్ చేశారు. తర్వాత కర్ణాటక డొమెస్టిక్ మహారాజా ట్రోఫీని కూడా ఆగస్టులో మైసూరుకు తరలించారు. ఆ తర్వాత మహిళల వన్డే వరల్డ్?కప్?లోనూ చిన్నస్వామిలో కొన్ని మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా, వాటిని వేరే వేదికలకు మార్చారు. విజయ్ హజారే ట్రోఫీలోని మ్యాచ్?లు కూడా ఇక్కడ జరగాల్సి ఉండగా, అనుమతి లేకపోవడంతో ఆ మ్యాచ్?లను బీసీసీఐ ఎక్స్?లెన్స్?కు తరలించారు. అయితే ఇప్పుడు కొన్ని షరతులతో మ్యాచ్‌లు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఫ్యాన్స్?కు కచ్చితంగా ఆనందాన్ని ఇస్తుంది. కాగా, 2026 ఐపీఎల్ మార్చి 26 నుంచి ప్రారంభం కానుంది.



## చిత్తుగా ఓడిన ముంబై ఇండియన్స్!

వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు మరో ఘోర పరాజయం ఎదురైంది. యూపీ వారియర్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ముంబై ఇండియన్స్ 22 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. యూపీ కెప్టెన్ మెగ్‌లాన్నింగ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ముంబై పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. మెగ్ లాన్నింగ్(45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 70), ఫోబే లిట్చ్‌ఫీల్డ్(37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించారు. ముంబై బౌలర్లలో నాట్ సివర్ బ్రంట్ రెండు వికెట్లు తీయగా.. అమెలియా కేర్ మూడు వికెట్లు పడగొట్టింది. నికోలా కేరీ, హీలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్ తలో వికెట్ తీసారు. అనంతరం ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులే చేసి ఓటమిపాలైంది. అమెలియా కేర్(28 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 49 నాటౌట్), అమన్‌జోత్ కౌర్(24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 41 నాటౌట్) పోరాడినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లో శిఖా పాండే(2/30) రెండు వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్, సోఫీ ఎక్లేస్టోన్, దీప్తి శర్మ, చోలే ట్రయాన్ తలో వికెట్ తీసారు. లక్ష్యచేధనలో ముంబై బ్యాటర్లు తేలిపోయారు. ఓపెనర్లు హీలీ మాథ్యూస్(13), సజీవన్ సజన(10) నిరాశపర్చారు. దాంతో ముంబై పవర్ ప్లేలో 2 వికెట్లకు 38 పరుగులే చేసింది. ఆ వెంటనే నాట్ సివర్ బ్రంట్‌ను శిఖా పాండే పెవిలియన్ చేర్చింది. నికోలా కేరిని దీప్తి శర్మ ఔట్ చేయగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(18) ట్రయన్ వెనక్కి పంపింది. దాంతో ముంబై 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో అమెలియా కేర్, అమన్‌జోత్ కౌర్ పోరాడారు. కానీ ఛేజింగ్ రన్‌రేట్ ఎక్కువగా ఉండటంతో ముంబైకి ఓటమి తప్పలేదు. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన ముంబైకి ఇది మూడో పరాజయం. రెండు సార్లు యూపీ వారియర్స్ చేతిలోనే ఓడటం గమనార్హం.

## యువరాజ్, లారానా ఆల్‌టైమ్ ఫేవరేట్ క్రికెటర్లు

### టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ



టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన ఫేవరేట్ క్రికెటర్ ఎవరో చెప్పాడు. టీమిండియా క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల పేర్లు కాకుండా ఇతర పేర్లు చెప్పడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అంతేకాకుండా ఒకరి పేరు కాకుండా ఈ 14 ఏళ్ల కుర్రాడు ఇద్దరు ఆటగాళ్లు తన ఆల్‌టైమ్ ఫేవరేట్ అని పేర్కొన్నాడు. ఇందులో ఒకరు భారత ఆటగాడు ఉండగా.. మరొకరు విదేశీ ప్లేయర్ ఉన్నాడు. ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ ఈ విషయాన్ని వెల్లడించాడు. టోర్నీ నిబంధనల ప్రకారం ప్రతీ ప్లేయర్ తమను తాము పరిచయం చేసుకోవాల్సి ఉంటుంది. తమ బ్యాటింగ్, బౌలింగ్ శైలితో పాటు ఫేవరేట్ క్రికెటర్ల పేరు చెప్పాలి. అంతేకాకుండా బ్యాటర్లు అయితే తమ ఫేవరేట్ షాట్, బౌలర్లు అయితే తమ ఫేవరేట్ బాల్ ఏంటో తెలియజేయాలి. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రతీ మ్యాచ్‌అబశ్రీశ్రీలో ప్లే చేస్తుంటారు. బ్యాటింగ్‌కు వచ్చిన తర్వాత బ్యాటర్ల వీడియోలు.. బౌలింగ్ చేస్తున్న బౌలర్ల వీడియోలను చూపిస్తారు. ఈ క్రమంలోనే వైభవ్ సూర్యవంశీ తన ఫేవరేట్ ప్లేయర్ల పేర్లు వెల్లడించాడు. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా తమ ఆల్‌టైమ్ ఫేవరేట్ క్రికెటర్లు అని చెప్పుకొచ్చాడు. తనకు పుల్ షాట్ అంటే చాలా ఇష్టమని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. జనవరి 15(గురువారం)న ప్రారంభమైన అండర్ 19 ప్రపంచకప్‌లో భారత్.. తమ తొలి మ్యాచ్‌ను అమెరికాతో ఆడింది. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ(2) విఫలమైనా.. భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ ద్వారా వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. అండర్ 19 ప్రపంచకప్ ఆడిన అతి పిన్న భారత ప్లేయర్‌గా నిలిచాడు. 14 ఏళ్ల 294 రోజుల వయసులో వైభవ్ సూర్యవంశీ అండర్ 19 ప్రపంచకప్ బరిలోకి దిగాడు. ఈ క్రమంలో కుమార్ కుశాగ్ర రికార్డ్‌ను అధిగమించాడు. అతను 15 ఏళ్ల 88 రోజుల వయసులో అండర్ 19 ప్రపంచకప్ ఆడాడు. 2020లో జరిగిన టోర్నీలో అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. తాజాగా ఈ రికార్డ్‌ను వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు.

## వెక్కిరించబోయి వికెట్ పారేసుకున్న పాక్ క్రికెటర్

పాకిస్థాన్ క్రికెటర్లకు ఈ మధ్య కాలం అస్సలు కలిసి రావడం లేదు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్ బాష్ లీగ్ నుంచి బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ వరకు ఎక్కడ చూసినా పాక్ ఆటగాళ్లకు అవమానాలే ఎదురవుతున్నాయి. తాజాగా బంగ్లాదేశ్ లీగ్‌లో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ చేసిన ఓ అత్యుత్సాహం ఇప్పుడు సోషల్ మీడియాలో నవ్వులపాలు చేస్తోంది. బౌలర్‌ను వెక్కిరించబోయి తనే బలికావడమే కాకుండా, ప్రత్యర్థి బౌలర్ చేతిలో ఘోరమైన అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో రాజ్‌షాహి వారియర్స్ తరపున ఆడుతున్న సాహిబ్జాదా ఫర్హాన్, సిల్హెట్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వింతగా ప్రవర్తించాడు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో బంగ్లాదేశ్ బౌలర్ రుయెల్ మియా వేసిన బంతిని ఫర్హాన్ డిఫెండ్ చేశాడు. బంతి బౌలర్ దగ్గరకు వెళ్లగానే, ఫర్హాన్ తన చేతిని ముఖం ముందుకు తెచ్చి హాలీవుడ్ రెజ్లర్ జాన్ సీనా స్టైల్లో యు కాంట్ సీ మీ అంటూ బౌలర్‌ను వెక్కిరించాడు. తనేదో తోపు బ్యాటర్ లాగా బౌలర్‌ను కించపరిచేలా ప్రవర్తించడం స్టేడియంలో ఉన్న వారందరినీ ఆశ్చర్యపరిచింది. ఫర్హాన్ చేసిన ఈ వెటకారానికి రుయెల్ మియా సరైన సమాధానం ఇచ్చాడు. మరుసటి బంతికే ఫర్హాన్ భారీ షాట్ కొట్టబోయి షార్ట్ థర్డ్ మ్యాన్ ఫీల్డర్ కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. కేవలం 12 బంతుల్లో 14 పరుగులు చేసిన ఫర్హాన్, తల పట్టుకుని పెవిలియన్ వైపు నడిచాడు. అయితే ఇక్కడ అసలైన ట్విస్ట్ బౌలర్ సెలబ్రేషన్. వికెట్ తీసిన రుయెల్ మియా, దూకుడుగా ప్రవర్తించకుండా టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ ఫేమస్ స్టైల్లో మైదానంలో పడుకుని వింతగా సెలబ్రేట్ చేసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. కేవలం ఫర్హాన్ మాత్రమే కాదు, ఇతర పాక్ స్టార్లు కూడా విదేశీ లీగ్ లలో విమర్శల పాలవుతున్నారు. బిగ్ బాష్ లీగ్‌లో షాహీన్ అఫ్రిదీ ఒకే ఓవర్‌లో రెండు బీమర్లు వేసి బౌలింగ్ నుంచి నిషేధానికి గురయ్యాడు. అటు మహ్మద్ రిజ్వాన్ నెమ్మదిగా ఆడుతున్నాడని కెప్టెన్ అతడిని రిటైర్డ్ అవుట్ చేయగా, బాబర్ ఆజంకు సింగిల్ ఇచ్చేందుకు స్టీవ్ స్మిత్ నిరాకరించడం పెద్ద దుమారం రేపింది. పాక్ ఆటగాళ్ల ప్రవర్తన, వారి ఆటతీరు చూస్తుంటే.. "తినడం, పడుకోవడం, అవమానపడటం.. మళ్ళీ రిపీట్ చేయడం" అన్నట్లుగా మారిపోయిందని నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# మన శంకరవరప్రసాద్ గారు

## రూ.226 కోట్లకు పైగా గ్రాస్ వసూలు




టాలీవుడ్‌లో సంక్రాంతి సీజన్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్న సినిమాగా 'మన శంకర వరప్రసాద్ గారు' నిలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ పండగకు విడుదలై థియేటర్లలో జోరుగా సాగుతోంది. ప్రమోషన్ల దశ నుంచే భారీ అంచనాలు ఏర్పడగా, విడుదల తర్వాత ఆ అంచనాలను వసూళ్ల రూపంలో నిజం చేస్తోంది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు తరలిరావడంతో అన్ని ప్రాంతాల్లోనూ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. వీకెండ్ కావడంతో కలెక్షన్లు మరింత ఊపందుకున్నాయి. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లోనూ ఈ సినిమానే ముందంజలో ఉంది. బుక్‌మైషో వేదికగా ఇప్పటివరకు దాదాపు 2.5 మిలియన్ల టికెట్లు అమ్ముడవడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనం. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా తొలి రోజే భారీ ఓపెనింగ్‌ను నమోదు చేసింది. ఆ తర్వాత రోజురోజుకీ వసూళ్లు పెరుగుతూ మూడో రోజుకు రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను, నాలుగో రోజుకు రూ.200 కోట్ల క్లబ్‌ను దాటింది. తాజాగా ఐదు రోజుల కలెక్షన్లను మేకర్స్ అధికారికంగా ప్రకటించగా, ప్రపంచవ్యాప్తంగా రూ.226 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు వెల్లడించారు. ఇది ఒక ప్రాంతీయ సినిమాకు ఆల్‌టైమ్ రికార్డు అని పేర్కొంటూ స్పెషల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేశారు. నిర్మాతల ప్రకటనలో 'ప్రతి మార్కెట్‌లో 'మన శంకర వరప్రసాద్ గారు' డామినేషన్ కొనసాగుతోంది. మెగా సంక్రాంతి బ్లాక్‌బస్టర్‌గా ఈ చిత్రం ఐదు రోజుల్లోనే రూ.226 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. ఇది రీజినల్ సినిమా చరిత్రలో అరుదైన ఘట్టం' అని పేర్కొన్నారు. వీకెండ్ మొత్తం సినిమా ట్రెండ్ కొనసాగుతుందని కూడా వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా నయనతార నటించగా, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించారు. వీటీవీ గణేష్, యూట్యూబర్ నందన తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.



# ప్రభాస్ స్పిరిట్‌కు డేట్ ఫిక్స్

## 2027 మార్చి5న విడుదల

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్,సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరిగిపోతున్నాయి, గత కొన్ని రోజులుగా ఈ చిత్రం 2027 సంక్రాంతి బరిలో నిలుస్తుందని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే, తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ విడుదల తేదీపై చిత్ర యూనిట్ క్లారిటీనిస్తూ ఒక కీలక ప్రకటన చేసింది, అందరూ ఊహించినట్లుగా సంక్రాంతికి కాకుండా, ఈ చిత్రం 2027, మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సంక్రాంతి రేసు నుండి తప్పుకున్నప్పటికీ, మార్చి 5న విడుదల కావడం వల్ల ఈ సినిమాకు లాంగ్ సమ్మర్ సీజన్ ప్లస్ పాయింట్‌గా మారనుంది, పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ కనిపించనున్న ఈ సినిమా కోసం సందీప్ రెడ్డి వంగా ఒక విభిన్నమైన, రా యాక్షన్ డ్రామాను సిద్ధం చేస్తున్నారు. ప్రభాస్ తన కెరీర్లో మొదటిసారిగా ఒక సీరియస్ ఐపీఎస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. ప్రభాస్ సరసన తృప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలో మెరవనున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్ బస్టర్ల తర్వాత వంగా తీస్తున్న సినిమా కావడంతో వరల్డ్ వైడ్ మార్కెట్ ఈ చిత్రంపై కన్నేసింది, అధికారిక విడుదల తేదీ వెల్లడి కావడంతో ప్రభాస్ అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన 'సౌండ్ స్టోరీ' టీజర్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందో హింట్ ఇచ్చింది, ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.



# హిట్టు కొట్టి చూపించా

## వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా: శర్వానంద్

'నారీ నారీ నడుమ మురారి'తో చెప్పి మరీ హిట్టు కొట్టాన'ని కథానాయకుడు శర్వానంద్ అన్నారు. ఈ కథ విన్న తొలిరోజు నుంచే ఇది తనకెంతో నమ్మకాన్ని కలిగించిందని.. ఈ సినిమా ఎప్పుడు విడుదల చేసినా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని ముందే ఊహించానని.. ఇప్పుడా నమ్మకం నిజమైనందుకు ఆనందంగా ఉందని తెలిపారు. శర్వా హీరోగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. నరేశ్, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు శ్రీను వైట్ల అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. 'ఇది నాకు చాలా ఎమోషనల్ మూమెంట్. హిట్ కొడతానని చెప్పి మరీ కొట్టాను. సంక్రాంతికి రావాలన్న నా కల నెరవేర్చినందుకు నిర్మాత అనిల్‌కు ధన్యవాదాలు. నేను చాలా రోజులుగా హిట్ కోసం ఎదురు చూస్తున్నా. నాకు ఆ హిట్ ఇచ్చిన దర్శకుడు రామ్ అబ్బరాజుకు కృతజ్ఞతలు. ఈ చిత్రానికి మరో హీరో నరేశ్. మా నాన్న పాత్ర పోషించారు. సినిమా చూసిన వాళ్లంతా 'చాలా రోజుల తర్వాత ఇంతలా నవ్వుకున్నామ'ని చెప్తుంటే ఆనందంగా అనిపించింది. నేనెప్పుడు సంక్రాంతికి వచ్చినా అన్ని సినిమాలు ఆడతాయి. అందుకే ఇకపై ప్రతి సంక్రాంతికి నాకోసం ఒక స్లాట్ పక్కన పెట్టండి ..వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా. శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీస్ నిర్మించనున్న నా తదుపరి సినిమా పండక్కే వస్తుందని అన్నారు. పండగ చివర్లో రావడం వల్ల ఎక్కువ థియేటర్లు ఇవ్వలేకపోయాం. కానీ, వచ్చే వారం నుంచి స్క్రీన్స్ పెరగబోతున్నాయి. ఇది చాలా పెద్ద హిట్ కొట్టబోతుందని అన్నారు నిర్మాత దిల్‌రాజు.

# మరో భిన్నమైన కథతో ధనుష్.. కర మూవీ




రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు పరిమితం కాకుండా, ఎప్పటికప్పుడు కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్న తమిళ స్టార్ ధనుష్ మరోసారి వార్తల్లో నిలిచారు. కథల ఎంపికలో తనకంటూ ప్రత్యేకమైన స్టైల్‌ను కొనసాగిస్తున్న ధనుష్, గత ఏడాది మూడు భాషల్లో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించాడు. గత ఏడాది తెలుగులో 'కుబేరా', తమిళంలో 'ఇడ్లీ కడాయ్', హిందీలో 'తేరే ఇష్క్ మేన్' చిత్రాల్లో నటించిన ధనుష్, ఈ మూడింటిలో 'ఇడ్లీ కడాయ్' మినహా మిగిలిన రెండు సినిమాలతో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్నాడు. ఈ విజయాలతో మరోసారి తన మార్కెట్‌ను మరింత పెంచుకున్న ఈ హీరో, ఇప్పుడు మరో సరికొత్త పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఆ సినిమానే 'కర'. 'పోర్ తోజిల్' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని తాజాగా సంక్రాంతి కానుకగా మేకర్స్ టైటిల్‌తో పాటు టీజర్‌ను విడుదల చేశారు. విడుదలైన టీజర్ ఒక్కసారిగా సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ధనుష్ ఇప్పటివరకు చేయని కొత్త రోల్‌లో కనిపించనున్నాడని టీజర్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. మట్టి వాసనతో కూడిన కథనం, పవర్‌ఫుల్ ప్రెజెన్స్‌తో ధనుష్ కనిపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. కథ, పాత్ర పరంగా ఈ సినిమా పూర్తిగా భిన్నంగా ఉండబోతోందనే సంకేతాలు టీజర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# తెలుగమ్మాయి గ్లామర్ షో తగ్గేదేలే!



రాజ్ అండ్ డీకే చాలామంది జీవితాలను మార్చారు. ఈ ట్యాలెంటెడ్ దర్శకరచయితలు చాలామంది తెలుగు నటులు, నటీమణులకు తమ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో అవకాశాల్ని కల్పించారు. అలా అవకాశం అందుకున్న ఒక తెలుగమ్మాయి శ్రేయా ధన్వంతరి. సమంత రూత్ ప్రభు కంటే ముందే రాజ్ అండ్ డీకే శ్రేయాకు తమ వెబ్ సిరీస్ లో అవకాశాలు కల్పించారు. శ్రేయా ఇటీవల ముంబైలో పాపులర్ అవ్వడానికి వరుస అవకాశాలు అందుకోవడానికి అవసరమైన సాయం చేసింది రాజ్ అండ్ డీకే. శ్రేయా ధన్వంతరి గ్లామర్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపుతో ఎదగాలనుకుంటున్న తెలుగమ్మాయి. మధురా శ్రీధర్ 'స్నేహగీతం' చిత్రంతో నటిగా కెరీర్ ప్రారంభించింది. మోడల్ గా, రచయిత్రిగా శ్రేయా రాణించారు. ముఖ్యంగా ఓటీటీ రంగంలో రాణించిన శ్రేయా, ఎంపిక చేసుకున్న పాత్రలు స్టార్‌గా నిలబెట్టాయి. శ్రేయా నేపథ్యం పరిశీలిస్తే 29 ఆగస్టు 1988న హైదరాబాద్‌లో జన్మించారు. తన తల్లి తెలుగు వారు.. తండ్రి హిందీ భాష మాట్లాడే వ్యక్తి. ఏవియేషన్ రంగంలో పని చేస్తున్నారు. దీంతో శ్రేయా పుట్టిన రెండు నెలలకే తండ్రి ఉద్యోగ రీత్యా వారి కుటుంబం మిడిల్ ఈస్ట్ కి వెళ్లిపోయింది. శ్రేయా తన బాల్యాన్ని దుబాయ్, బహ్రెయిన్, ఖతార్‌లలో గడిపారు. దాదాపు 17దేశాలలో తన తండ్రి ఉద్యోగం చేసారని వెల్లడించారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం తిరిగి భారత్‌కు వచ్చిన శ్రేయా వరంగల్‌లోని ప్రతిష్టాత్మకమైన ఎన్.ఐ.టి-ఓరుగల్లు నుండి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందారు. ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతుండగానే 'ఫెమినా మిస్ ఇండియా సౌత్ 2008' పోటీలలో పాల్గొని ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. అనంతరం మిస్ ఇండియా 2008 ఫైనలిస్ట్‌గా నిలిచారు. 2009లో అక్కినేని నాగచైతన్య మొదటి సినిమా 'జోష్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 2010లో 'స్నేహగీతం' సినిమాలో శైలు అనే ప్రధాన పాత్రలో నటించి మెప్పించారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861